కథామంజరి


పది కథల సమాహారం



నవంబర్ 2026

కథామంజరి

పది కథల సమాహారం



కథా మార్గదర్శి

నవంబర్ 2026

సంపుటి : 7 ♦ సంచిక : 11



అందరికీ దీపావళి శుభాకాంక్షలు

కథామంజరి

శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక సంక్రాంతి హాస్య కథల పోటీ-2027

సాహితీప్రియులకు సాహితీ పండగ సంక్రాంతి. ఎప్పటిలాగే ఈ పండగకి ప్రత్యేకసంచికని తెలుగువారి ముంగిట అందించాలనే సంకల్పంతో, కథామంజరి హాస్యకథల పోటీని నిర్వహిస్తూ, బహుమతులు పొందిన కథలతో జనవరి 2027 సంచికను సంక్రాంతి ప్రత్యేక సంచికగా విడుదల చేస్తోంది. ఈ కథల పోటీకి కథలను ఆహ్వానిస్తున్నాం!

ప్రథమ బహుమతి	..	₹ 5116/-
ద్వితీయ బహుమతి	..	₹ 3116/-
తృతీయ బహుమతి	..	₹ 2116/-
10 ప్రత్యేక బహుమతులు	..	₹ 1,116/- చొప్పున

నిబంధనలు

- ఇతివృత్తం ఏదైనా పర్వాలేదు. 1200 పదాల కంటే మించరాదు. కథ హాస్యరసం చిందించాలి.
- కథను వర్డ్ లో యూనికోడ్ లో టైపు చేసి పంపాలి. పిడియఫ్ లో పంపే కథలు అనుమతించబడవు.
- కథతో పాటు హామీ పత్రం జత చెయ్యాలి. ఆ పత్రంలో.. కథ స్వీయ రచన అని, మరే ఇతర కథలకు, కాపీ కాదని, అనుసరణ కాదని, అలాగే మరే ఇతర పత్రికలకు పంపలేదని, సాంఘిక మాధ్యమాలలో గాని, బ్లాగులలో గాని ప్రచురణ/ప్రసరణ జరగలేదని, సాధారణ ప్రచురణకు స్వీకరించడానికి అభ్యంతరం లేదని కూడా.. సుస్పష్టంగా పొందుపరచాలి. హామీపత్రం లేని కథలను స్వీకరించబడవు.
- పోటీకి వచ్చిన కథలలో సాధారణ ప్రచురణకు కూడా కొన్ని కథలు ఎంపిక చేసుకుని, వీలు వెంబడి ప్రచురణ చేస్తాము. అలా ప్రచురణకు తీసుకునే కథలను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి పంపడం జరగదు. దయచేసి రచయితలు "పోటీలో బహుమతులు పొందకపోతే మా కథని తిప్పి పంపమని" మాకు అభ్యర్థనలు పంపవలదు. ఈ విషయం ప్రత్యేకంగా గమనించవలసిందిగా కోరుతున్నాం.
- కథ హామీపత్రం లో "2027 – సంక్రాంతి హాస్య కథల పోటీకి" అని వ్రాసి పంపాలి.
- కథలను submit@kathamanjari.in కు మెయిల్ ద్వారా 30.11.2026 తేది రాత్రి10 గం. లోగా మాకు చేరేటట్టు పంపాలి. ఆ తర్వాత వచ్చే కథలను పోటీకి పరిగణించడం జరగదు.
- కథల పోటీ నిర్వహణ, ఎంపిక విషయంలో కథామంజరిదే తుది నిర్ణయం.

ఈ కథల పోటీ ఫలితాలు డిసెంబర్ 2026 మూడవ వారంలో తెలియచేయగలం. సంక్రాంతి ప్రత్యేక సంచిక జనవరి ఒకటో తారీఖున మీ నట్టింట వెలుగుతుంది.

ఈ పోటీలో విరివిగా ఉత్సాహంగా పాల్గొనమని రచయిత/రచయిత్రులను మనసారా ఆహ్వానిస్తున్నాం.

కథామంజరి బృందం





మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు

***

కథామంజరి శ్రవ్యసంచిక



ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు
- పసుమర్తి వల్లీకృష్ణ గారు
- నందిరాజు పద్మలతా జయరాం గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి



శీర్షికలు

కథాకీయం i

విశిష్ట అతిథి ii

కథా మార్గదర్శి iv

కథా పరిచయం vi

వినదగునెవ్వరు చెప్పిన ix

కథలు

గుర్తుకొస్తున్నాయి మరి..! ... విజయార్కె 1

గుండె కింద ముల్లు ... తోట దుర్గారావు 6

స్పర్శ ... దేశరాజు 12

అనన్యం ... శ్రీను పైండ్ల 16

ఉనికి ... ఎం కె కుమార్ 21

సమస్య - పరిష్కారం ... కొయిలాడ రామ్మోహన్ రావు ... 26

తల్లి మీద ప్రేమ ... కంచనపల్లి వేంకట కృష్ణారావు ... 31

విజ్ఞాన వేగు ... పైడిమర్రి రామకృష్ణ 33

నాటకం ... శ్రీమతి కె. వరలక్ష్మి 35

మాయలేడి ... కాటూరి రవీంద్ర త్రివిక్రమ్ 41

Cover Page Credit : Eugene Golovesov, Furmanov, RU



కథాకీయం

ఆ మధ్య జరిగిన ఓ సాహితీ సదస్సుని పురస్కరించుకొని, నిర్వాహకులు.. ముప్పై సంవత్సరాల లోపు వయసు ఉన్న యువతకు కథల పోటీ నిర్వహించారు. సాంఘిక మాధ్యమాల ద్వారా బాగా ప్రచారం చేసినా సరే.. రెండే రెండు కథలు వచ్చాయి. నిర్వాహకుల ప్రయత్నాన్ని అభినందిస్తూ.. యువతలో పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గిపోయిందని, అసలు తెలుగుభాష పట్ల, సాహిత్యం పట్ల నిర్లక్ష్య ధోరణి ఉందని ఒకరిద్దరు వక్తలు తమ ఆందోళనను వ్యక్త పరిచారు. దీనికి తోడు బాల్యం నుంచే సాంకేతికత మీద ఆధారపడే పరిస్థితి రావడం, మనిషి సృజనాత్మక శక్తిని క్రమంగా సాంకేతిక శాస్త్రం అణిచేయడం, కృత్రిమ మేధస్సు విశృంఖలం.. ఇలా చాలా కారణాలతో భాష పట్ల గాని, భాషాసాహిత్యం పట్ల గాని యువత అడుగులు పడటం లేదని కూడా వాపోయారు. వేదిక మీద ఉన్న ఒకే ఒక్క యువ రచయిత స్పందిస్తూ.. 'నేటి యువత కూడా సాహిత్యం వైపు అడుగులు వేస్తున్నారని, చాలమంది కుర్రాళ్ళు పుంఖానుపుంఖాలుగా కథలు కవితలు వ్రాస్తున్నారని, అవన్నీ ప్రభంజనం సృష్టిస్తున్నాయని చాలా ఆవేశంగా అన్నారు. వాటి గురించి ఆరా తీస్తే.. అవన్నీ సాంఘిక మాధ్యమాల్లో ఉంటాయని, వందల్లో లైకులు, అభినందనలు వస్తున్నాయనీ తెలిసింది! అలా ఆ మాధ్యమాల వలల్లో చిక్కుకుని అక్కడే ఉన్నంత వరకు ఊపిరి పీల్చుకుంటున్నాయి. అవి సగటు పాఠకుల మధ్యకు రావు. వాటి మీద సరియైన అభిప్రాయం, విశ్లేషణ, విమర్శ చేయడానికి అవకాశాలు.. సాహితీవేత్తలకు అంతగా ఉండవు. ఒకవేళ ఉన్నా.. అశ్లీలమైన పదజాలంతో ప్రతిస్పందనలు వస్తాయి. వాటిని భరించలేక.. వాటి జోలికి ఎవరూ వెళ్ళరు. ఇదీ జరుగుతున్న చరిత్ర! కాకపోతే భవిష్యత్తులో.. అంతా ఆ మాధ్యమాల మీదనే నడుస్తాయనేది వాస్తవమయినా సరే.. మన భాషని, భాషా సంపదను నీటిమీద వ్రాతలుగా వదిలేస్తే.. మనిషి మనుగడకే ముప్పు వస్తుంది. అంచేత ఆ సంపదను కాపాడానికి ఏదో ఆలోచనలు చేయవలసిన ఆవశ్యకత ఉంది!

నిజానికి గతంలో యువతను కథారచన వైపు అడుగులు వేయించడానికి కథామంజరి చాలా ప్రయత్నాలు చేసింది. యువతకోసం.. ప్రత్యేకమైన సమావేశాలు, వారి కథలకు ప్రోత్సాహం, పోటీలు వగైరా నిర్వహిస్తే... ఒకరిద్దరు తప్పితే అస్సలు స్పందనే రాలేదు. నిజంగా యువతలో కథలు వ్రాసే వారుంటే.. తప్పకుండా వారికి ప్రోత్సాహం ఇవ్వటంలో కథామంజరి ఎప్పుడూ ముందుంటుందనీ పదేపదే విన్నవించుకుంటున్నాం! తెలుగు కథకి పూర్వ వైభవం రావాలంటే.. నేటి యువత నడుం కట్టుకోవాలి. సాంఘిక మాధ్యమాల మీదనే ఆధారపడి, అదే పరమపద సోపానం అని సంతోష పడకుండా.. జన బాహుళ్యంలోకి మీ సాహితీ సృష్టిని తీసుకురండి! ఈ ఆలోచనతోనే.. వచ్చే సంక్రాంతికి కథామంజరి "హాస్యకథల పోటీ" నిర్వహిస్తోంది. కథ చదువుతుంటే.. అప్రయత్నంగా నవ్వు తెప్పించే.. కథనాలతో హాస్యకథల్ని అల్లండి. అసలుసిసలైన హాస్యకథలతో ఈ పోటీని సుసంపన్నం చేయండి. తప్పకుండా అవి జనం హృదయంలో పదిలంగా ఉండిపోతాయి!

సంపాదకుడు



విశిష్ట అతిథి

శ్రీమతి కె. వరలక్ష్మి

గతమెంతో ఘనమైనదని గర్వంగా చెప్పుకోడానికి ఎన్నో ఉదాహరణలు కనబడతాయి. తెలుగు కథ గతం కూడా చాలా గొప్పదనే విషయం పదే పదే చెప్పుకోడానికి.. ఆ రోజుల్లో ఏ కథైనా పురుడుపోసుకోడానికి రచయితల తపనే కారణం! కుటుంబ నేపథ్యం ఏదైనా సరే.. హైస్కూలులో చదివేటప్పుడే.. తను, తన చుట్టూ ఉన్న మనుషులు, విలువలు, మంచీచెడు, సమాజం, సమస్యలు.. వీటిని గమనించి, 'మనకెందుకులే' అని అనుకోకుండా, వాటిని పట్టించుకునే తత్వం అబ్బేది. వాటి మీద ఏదో విధంగా స్పందించేవారు. అలా స్పందించి కలాన్ని ఝళిపించి ఎంతో మంచి సాహిత్యాన్ని అందించిన మొన్నటి తరం ఎందరో మహానుభావుల్లో.. రచయిత్రులలో చెప్పుకోదగ్గ రచయిత్రి శ్రీమతి కె. వరలక్ష్మి గారు!

కథలు వ్రాయడానికి భాష మీద పట్టు, సమాజం మీద, చుట్టూ ఉన్న మనుషుల మీద అవగాహన, అధ్యయనం.. వీటితో పాటు సమాజం పట్ల బాధ్యత వహించి రచనలు చేసారు శ్రీమతి వరలక్ష్మిగారు. ఎప్పుడూ సమస్యల వలయంలోనే ఉంటున్న గ్రామీణ ప్రాంత స్త్రీల జీవితాలు, సమాజంలో తన చుట్టూ ఉన్న అతిసామాన్యుల జీవనపోరాటాలు, నిస్సహాయతలు, రాగద్వేషాలు, ప్రేమలు, అసూయలు, అహంకారాలు.. ఇవన్నీ వరలక్ష్మిగారి కథల్లో కనబడతాయి. ఏ కథావస్తువుకైనా సరే.. తను పుట్టి పెరిగిన గ్రామీణ వాతావరణాన్ని అద్భుతంగా అద్ది, కళ్ళ ముందు అక్షర రూపంలో అందించడంలో శ్రీమతి వరలక్ష్మి గారు సిద్ధహస్తులని చెప్పాలి.

వరలక్ష్మిగారి ఇంట్లో తండ్రిగారు పౌరాణిక పద్యాలు, సంభాషణలు వల్లే వేస్తుంటే.. అవెంతో నచ్చేవిట. అలాగే వీధిలో ఉండే ఆడవాళ్ళు.. పుస్తకాలు చదివించుకునేవారుట. ఆ వాతావరణంలో పెరిగిన వరలక్ష్మిగారికి సాహిత్యం పట్ల, కథల పట్ల ఇష్టం పెరిగి.. మూడవ తరగతి వచ్చేసరికి బాలల బొమ్మల రామాయణం కూడా చదివేసారుట. ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పుడే "కాఫీ కాదు" అనే కథ వ్రాస్తే, అది ఆంధ్రపత్రిక వారపత్రికలో ముద్రణ అయింది. "అలా నాకు కథంటే ఇష్టమేర్పడింది. నేను చదివిన సాహిత్యమే నన్ను ప్రభావితం చేసింది. వ్రాసిన కథకు మొదట చదివించే గుణం ఉండాలి. చెప్పాలనుకున్న విషయాలు.. పొట్లంలో పూలలాగా గుబాళించాలి. కథ రాయాలనుకుని వస్తువు గురించి వెతకను, వస్తువు నా కంటపడినప్పుడు, వ్రాయకుండా ఉండను! ఏ కథావస్తువు ఎంచుకుని వ్రాసినా, వాటి మూలాలు తెలుసుకుని వ్రాస్తాను. అలాగే నాకు తెలియని విషయాల మీద నేను వ్రాయను!" అంటారు వరలక్ష్మి గారు.

24 అక్టోబర్ 1948 తేదిన తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేట లో జన్మించిన వరలక్ష్మి గారు తెలుగుభాషలో ఎమ్.ఎ. చేసి, ఓ చిన్న ప్రాథమిక పాఠశాల పెట్టి, అందులో ఉపాధ్యాయులుగా కూడా పని చేసారు. పాలగుమ్మి పద్మరాజు, కాళీపట్నం రామారావు గార్ల రచనలంటే బాగా ఇష్టపడే వరలక్ష్మిగారు 160 పైగా కథలు, 4 నవలికలు, 200 పైగా కవితలు, వ్యాసాలు, నాటికలు వ్రాశారు. తెలుగు యూనివర్సిటీ, రంజనీ, న్యూజెర్సీ, ఆటా, తానా, రంగవల్లి.. వంటి ఎన్నో సంస్థల

సాహితీపురస్కారాలు అందుకున్న వరలక్ష్మిగారి "జీవనరాగం", "మట్టి–బంగారం", "అతడు–నేను" వంటి కథా సంపుటాల మీద పలు విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు చేసి డాక్టరేట్ లు పొందారు.

ప్రస్తుతం హైదరాబాదులో నివాసం ఉంటూ.. సాహితీప్రస్థానాన్ని కొనసాగిస్తున్న శ్రీమతి వరలక్ష్మి గార్కి.. ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. వారి కలం నుండి సమాజహితమైన మరిన్ని కథలు జాలువారగలవని ఆశిస్తున్నాం!

కథామంజరి బృందం

.....

మునిమాణిక్యం నరసింహారావు



మార్చి 15, 1898 న జన్మించిన శ్రీ మునిమాణిక్యం నరసింహారావు గారు తెలుగు సాహిత్యంలో హాస్యం ప్రాముఖ్యతని పెంచిన ప్రముఖులలో ఒకరు. ఆయన రాసిన "కాంతం కథలు" గురించి మాట్లాడుతూ ఒక ప్రముఖుడు "సామాన్యుడి జీవితంలోని చిరు విషాదాలను కూడా నవ్వుగా మార్చగల శక్తి కలిగి ఉంటాయి" అని వ్యాఖ్యానించారు.


ఇది ఆయన హాస్యం గురించి చేసిన మరొక వ్యాఖ్య "హాస్యం అనేది బహుశా గొప్పదే, కానీ అది మునిమాణిక్యం వారి చేతిలో కవచ కుండలాలు ధరించిన అర్జునుడిలా కనిపిస్తుంది. ఆయన మాటల్లో పొదుపు, పదాలలో చురుకుదనం అపూర్వం".

ఆయన మరొక రచన "అప్పులు చేయడం – తీర్చడం" లో సమాజంలో మనుషులను ఆయన చేసిన వర్గీకరణ – "అప్పు చేసిన మొత్తమును తిరిగి ఇచ్చేవాడు అధముడు. కాలం గడిపేవాడు మధ్యముడు. తెచ్చిన మరుక్షణములో ఆ విషయం సులువుగా మరవగలిగినవాడు ఉత్తముడు."

మునిమాణిక్యం వారి రచనా శైలిని స్పష్టంగా విశదీకరించే మరో వ్యాఖ్య – ఆయన రచనలు చదువుతుంటే అనిపించే వింత ఏమిటంటే, మన జీవితంలో మనమే పాత్రలుగా ఉన్నామన్న భావన. అలాంటి సహజత ఆయన రచనలలో అపూర్వం. బి.ఏ. చదివిన మునిమాణిక్యం వారు ఆంధ్ర సారస్వత పరిషత్తులోనూ, ఆకాశవాణిలోనూ పనిచేశారు.

ఎదుటి వారి అవకరాన్ని ఆసరాగా తీసుకుని హాస్య సృష్టి చేయడాన్ని దుమ్మెత్తి పోసిన మునిమాణిక్యం వారు, తెలుగులో హాస్యాన్ని క్రోడీకరించి, వర్గీకరించి "మన హాస్యము"గా గ్రంథస్థం చేశారు. దీనిలో హాస్యం రకాలు, మంచి చెడులు విశదీకరించి మనకి అందిస్తారు.

ఈ పుస్తకానికి ప్రస్తావిత చేసిన శ్రీ వీరభద్రశాస్త్రి గారి మాటల్లో "హాస్యరసాన్ని మనపూర్వులు ప్రధానరసాలలో ఒకటిగా గుర్తించినప్పటికీ, దానికి ఉండదగినంతటి ప్రాధాన్యం ఏర్పడ లేదు. పాశ్చాత్య వాఙ్మయ ప్రభావం ప్రసరించిన తరువాత వచ్చిన ఆధునికాంధ్ర సాహిత్యంలో హాస్యరీతులలో కొంత వైవిధ్యమూ, క్రొత్తదనమూ కానవస్తుంది. అయినా హాస్యరస స్వరూప స్వభావాలను సాకల్యంగా పరామర్శించే గ్రంథజాలం వెలువడలేదు. ఈ కొరత తీర్చడానికి శ్రీ మునిమాణిక్యం ప్రయత్నించారు."



కథా మార్గదర్శి

కీ.శే. కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

సాహిత్యప్రక్రియలు ఏమైనా సరే.. సామాజిక ప్రయోజనం లక్ష్యంగా కనబడి, పండిత పామరులను సైతం చలింప చేయగలగాలి. సమకాలీన సమాజ పరిస్థితుల్ని ఓ మెట్టు పైకెక్కి చూసి, చలించి ఎంతో అద్భుతమైన సాహితీ సంపదను ముందు తరాల వారికి దశ దిశ చూపెట్టే సాహిత్యాన్ని అందించిన.. మన ముందు తరాల రచయితల్లో మరో అగ్రశ్రేణి రచయిత, కవి కీ.శే. కాటూరు రవీంద్ర త్రివిక్రమ్‌గారు.

రవీంద్రగారు బాల్యం నుంచే రచనావ్యాసంగం మొదలెట్టి, సాహిత్యప్రక్రియల్లో కథ, నవల, నాటకం, వ్యాసం.. ఇలా అన్నింట్లో పరిణితి చెందిన రచనలు అందించారు. మరో వైపు.. వైమానిక దళంలో సాంకేతిక విభాగంలో ఉద్యోగ ప్రస్థానం ఆరంభించి, తర్వాత కాలంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు ఉద్యోగం చేసి, పదవీ విరమణ చేసిన తర్వాత హైకోర్టు న్యాయవాదిగా పనిచేశారు. ఏ వృత్తిలో ఉన్నా సరే.. పదో ఏట ప్రారంభించిన రచనా వ్యాసంగాన్ని మాత్రం నిరంతరం కొనసాగించారు. "అక్షరాన్ని నువ్వు ఆరాధిస్తే, అక్షరం నిన్ను ఆశీర్వదిస్తుంది" అని నమ్మే రవీంద్రగారు ప్రాథమిక విద్యను తండ్రిగారి వద్దే నేర్చుకుని.. సాహితీ జీవనానికి మంచి పునాదులు వేసుకున్నారు. తండ్రి గారి ఆధ్యాత్మిక ప్రవచనాలు, సారస్వత పరిజ్ఞానం.. రవీంద్రగారిని ఎంతో ప్రభావితం చేశాయి. ఇక పుస్తక పఠనం సరేసరి.. నిరంతరం పుస్తకాలతోనే గడిపేవారు.

రవీంద్రగారి రచనలన్నీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అద్దం పడతాయి. అతి సామాన్యమైన భాష, చదివించే శైలి, అనవసరమైన వర్ణనలు లేకుండా.. సూటిగా తను చెప్పాలనుకునే విషయాన్ని చెప్పగల రచనా నైపుణ్యం.. వీటితో పాటు పరిశోధన, అన్వేషణలతో కథావస్తువుపై గాఢమైన ముద్ర.. రవీంద్ర గారి రచనలలో కనబడతాయి. ఆద్యంతం చదివిస్తాయి. చదివిన తర్వాత పాఠకుల్ని ఆలోచనల్లోకి దించుతాయి! రవీంద్రగారు.. తను వ్రాసిన నాటకాల్లో దృశ్యానికి ఎంత విలువ ఇచ్చేవారో.. కథలకి నవలలకి కూడా అదే ప్రాధాన్యత ఇచ్చేవారు. అందుకే వారి ఏ రచనైనా అజరామరంగా నిలిచిపోయాయి.

డెబ్బయ్యేళ్ళ సాహితీప్రస్థానంలో రవీంద్ర గారు రెండు వేల కథలు వ్రాసినా.. ఆరు వందలకు పైగా కథలు ప్రచురితమయ్యాయి. ఇవిగాక, పద్నాలుగు నవలలు, వందకు పైగా నాటికలు, నాటకాలు, సాహిత్య వ్యాసాలు, అంతర్యామి వ్యాసాలు, గీతాలు, హరికథలు.. ఇలా అన్నిప్రక్రియలలో సమాజహితమైన రచనలు అందించారు. వైమానికదళంలో పని చేసినప్పుడు.. 1965 మరియు 1971 లలో జరిగిన యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆ స్ఫూర్తితో "కార్గిల్ కథలు" వ్రాశారు. అలా సాహితీ వనంలో విహరిస్తూ.. బ్యాంక్‌లో పనిచేసినప్పుడు.. ఉద్యోగి సంఘం నాయకుడుగా, ఉద్యోగంలో రిటైర్ అయిన తర్వాత లాయరు వృత్తి చేపట్టి ఎన్నో సంస్థలకు న్యాయ సలహాదారుడిగా, జాతీయస్థాయి వినియోగదారుల ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవ సలహాదారులుగా.. సేవలు అందించారు. అలా ఆయన నిత్యజీవితంలో గాని, ఇటు సాహితీజీవనంలో గాని.. సామాజిక లక్ష్యం కనబడుతుంది. ఏ పని చేసినా.. అందులో మానవతా విలువలకు పెద్దపీట వేసి, తనదైన ముద్ర కనబరిచేవారు. అనేక బహుమతులు, సన్మానాలు, సత్కారాలు పొందినా సరే.. ఎంతో సామాన్యంగా అందరితో

ఆప్యాయంగా ఉండే కాటూరు రవీంద్ర త్రివిక్రమ్‌గారు.. విజయవాడలో డిసెంబరు 18, 1946 తేదిన జన్మించారు. యాదృచ్ఛికంగా ఆయన తన డెబ్బయ్ ఎనిమిదవ పుట్టిన రోజునే.. (డిసెంబర్18, 2024) మరణించారు. అంతటి ఘనమైన జీవితం గడిపిన కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ గారిని ఈ సంచిక కథా మార్గదర్శిగా తలుచుకుంటూ.. వారికి నివాళులు అర్పించుకుంటున్నాం!

కాటూరు వారి సాహిత్యం మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన డా. కె. సుబ్బారావు గారు.. మాకు కావలసిన వివరాలు అందించి సహకరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

కథామంజరి బృందం

.....

దాశరథి కృష్ణమాచార్య



దాశరథి సహజంగా కవి. అందుకే ఆయన వచనంలో కూడా పద్య లయ, గంభీరమైన పదజాలం కనిపిస్తాయి. చదువుతుంటే పాట వింటున్నట్టు ఉంటుంది. కానీ అర్థం మాత్రం సామాన్యుడికి కూడా తెలిసేలా సరళంగా ఉంటుంది. ఆయన తెలంగాణ విముక్తి పోరాటంలో పాల్గొన్నవారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అన్న మహాకవి. ఆయన కథల్లో నిజాం నియంతృత్వం, దొరల దౌర్జన్యం, రైతు కష్టాలు, విప్లవ స్ఫూర్తి కనిపిస్తాయి. ఆయన కథ చరిత్రలా అనిపిస్తుంది. ఆయన దొరని తిడతారు, కానీ దొర పిల్లాడి అమాయకత్వాన్ని ప్రేమిస్తారు. పేదవాడి బాధను చూపెడుతూ, అతని పట్టుదలను, ఆత్మగౌరవాన్ని ప్రశంసిస్తారు. కోపం ఉంది, కానీ ప్రేమ ఇంకా ఎక్కువ ఉంది.

దాశరథి కథలు: **అగ్ని ధార** - తెలంగాణ పోరాట కథల సంపుటి.. అణచివేత, తిరుగుబాటు నేపథ్యం; **రుద్రవీణ** - దేశభక్తి, త్యాగం మిళితమైన కథలు.

ఆరుద్ర, శ్రీశ్రీ లాంటి సహచరులు "దాశరథి కథ అంటే కథ కాదు, అది నినాదం" అన్నారు. ఆయన వచనంలో ఉన్న పద్యపు ఉద్వేగం, ప్రజల గుండె కొట్టుకునే శబ్దం వినిపిస్తుందని మెచ్చుకున్నారు. తెలంగాణ పోరాటాన్ని డాక్యుమెంట్ చేసిన "జీవన సాహిత్యం" అని పిలిచారు. అయితే కొంతమంది పెద్దలు "దాశరథి కథలో కథ కంటే కవిత్వం ఎక్కువ" అని తప్పుబట్టారు.

దాశరథి కథాలక్షణాలు మూడు. మొదటిది - కథా శిల్పం కంటే విషయానికి ఎక్కువ ప్రాధాన్యత. చాలా వరకు స్ఫూర్తిదాయకమైన కథలు. రెండవది - సామాన్యుడి బాధ, బరువు, పోరాటం కథల్లో కనిపిస్తాయి. మూడవది - తెలంగాణా విముక్తి పోరాటానికి సాహిత్య సాక్ష్యం.



కథా పరిచయం

కీ. శే. దాసరి సుబ్రహ్మణ్యంగారి రచన: తుమ్మల్లో అస్తమయం

తనకో పేరు రావాలనే ఆశ లేదు. గుర్తింపు ఇవ్వకపోయినా పట్టించుకోలేదు. అతి నిరాడంబర జీవితాన్ని గడిపిన వేరొక రచయిత ఉండరేమో, దాసరి సుబ్రహ్మణ్యం గార్ని తప్పిస్తే. 1952 నుండి 2006 వరకు ఒక యాభై నాలుగేళ్ల పాటు 'చందమామ'లో పని చేస్తూ, తోకచుక్క, ముగ్గురు మాంత్రికులు, రాకాసిలోయ, పాతాళదుర్గం... ఇలా పిల్లలకోసం ఎన్నెన్నో సీరియల్స్ ప్రచురిస్తూ, ఎవరు రాశారో కూడా తెలియనివ్వని ప్రపంచంలో అజ్ఞాతంగా తెర వెనుక ఆ పత్రికకు వచ్చిన ఆదరణను చూస్తూ గడిపేసిన వ్యక్తి దాసరి గారు. ఎన్నో సాంఘిక కథలు (సుమారు 39 కథలను రచన శాయి గారు ఎంతో శ్రమించి సేకరించి ఒక సంపుటంగా వేశారు), అపరాధ పరిశోధక నవలలు, పిల్లల కథలు, జంతువుల పాత్రలలో కథల సీరియల్సు, ఇలా ఎన్నో రచనలు వివిధ కలం పేర్లతో రాసిన దాసరిగారు తమ సాహితీ వ్యవసాయంలోనే, ఒకే ఇంట్లో ఉంటూ జీవితంలో ప్రధాన దశను గడిపేయడం గమనార్హం.

రచన శాయిగారు 2011లో ప్రచురించిన సంపుటి 'దాసరి సుబ్రహ్మణ్యం కథలు' నుండి ఈ నెల కథా పరిచయానికి 'తుమ్మల్లో అస్తమయం' ఎన్నుకున్నాను. ఈ సంపుటిలోని కథల గురించి రాస్తూ, వసుంధర గారు అంటారు, "ఆయన తన భావాలకు అక్షరరూపమిస్తే అవి పరిసరాల వ్యధలై, సుధలై, గాథలై.. కథలయ్యాయి' అని. వసుంధర గారు చెప్పినట్లుగా కథలన్నీ 'సాహిత్యపరంగా సలక్షణం, వస్తుపరంగా విలక్షణం, భావపరంగా హేతుకం'. ఇంకో మాటగా అంటారు "కొన్నింట చలం ఎనేజ్, రాచకొండ రేజ్, ముళ్ళపూడి కరేజ్, కొడవటిగంటి కవరేజ్, రంగనాయకమ్మ అంతటి వారికి ఎంకరేజ్.. అనిపించే ఈ కథల్లో అన్నింటా 'సరిలేరు నీకేవ్వరూ' అనిపించే యాంకరేజ్. ఇతివృత్తాల్లో ఊహకందని రేంజ్. ఇంత మంచి సంపుటీకరణకు ఇంతకాలం పట్టడం స్ట్రేంజ్".

దాసరిగారు రచించిన చాలా సాంఘిక కథలన్నిటిలోని ముఖ్య పాత్రలు, ఒక మనిషి ఎన్ని విధాలుగా వ్యథ పొందే అవకాశముందో, అన్ని విధాలైన సంక్షోభానికి లోనవుతాయి. చివరికి బలైపోతాయి. 'తుమ్మల్లో అస్తమయం' కథ కూడా అంతే! ఈ కథ 1949 మార్చి తెలుగు స్వతంత్ర పత్రికలో ప్రచురితమైంది. కథాకాలాన్ని పాఠకులు దృష్టిలో పెట్టుకోవడం అవసరం. కాని కథలో రచయిత చెప్పదల్చుకున్న సారాంశం ఈ రోజుకీ వర్తిస్తుంది.

కృష్ణారావు నిరుద్యోగి. తనకి తప్పనిసరిగా ఉద్యోగం కావాలి. విశ్వానంద దగ్గర క్లర్కు పోస్టు ఖాళీ ఉందని తెలిసి వచ్చి కలిశాడు. కృష్ణారావు వచ్చాడని తెలిసి విశ్వానందం లెక్కల పుస్తకాలు అడుక్కి పెట్టి, భాగవతాన్ని, భాగవద్గీతను బయటకు తీశాడు. ముందుగా.. కృష్ణారావు ఆత్మవిశ్వాసం ఏ కొంచెమైనా ఉంటే.. అది కూడా పూర్తిగా తీసేశాడు, మూడోసారి కూడా స్కూల్ ఫైనల్ పాస్ కాడని!

ఇక తన ఫిలాసఫీ ఆఫ్ లైఫ్ చెప్పడం సాగించాడు విశ్వానంద. తన లక్ష్యం, ధనికుని మధ్యా బీదవాని మధ్యా సమానత్వాన్ని సాధించడం కాక, దేవుని మధ్యా, మానవుని మధ్యా సమానత్వాన్ని, అంతే సోషలిజాన్ని సాధించడమేనని. అంటే ఓ నూతనమైన అద్వైతం. పూర్వజన్మలో చేసిన సుకృతాన్ని బట్టి ఈ జన్మలో కొద్ది మంది ఐశ్వర్యులుగా పుడతారు. వాళ్లను కూలదోయాలనడం, దైవ శాసన ధిక్కారం అవదా మరి? అది ఈశ్వరాజ్ఞను ధిక్కరించడం కాదా? ఇదీ సారాంశం. అక్కడితో ఆగలేదు. కృష్ణారావు రాక మునుపు ఇద్దరు గడ్డు నాస్తికులను తానే నరకబాధల నుండి కాపాడాడట.. కొంత ఆలస్యంగానైనా!

విశ్వానంద చెప్పిన నలభై రూపాయల జీతం, రెండుసార్లు భోజనానికి ఒప్పుకున్నాడు కృష్ణారావు కృతజ్ఞతతో. అరవై ఇద్దరు పనివాళ్ళ చేత పని చేయించాలి, అయితే అందరూ పని దొంగలూ, గజదొంగలూ అని చెప్తాడు. ఉండడానికి పడమటి వైపునున్న తుమ్మచెట్ల పక్కన వున్న ఇంట్లో ఉండొచ్చని చెప్తాడు విశ్వానందం.

అది తను వచ్చేటప్పుడు చూసినిల్లే.. తుమ్మచెట్లు, జిల్లేడుచెట్ల మధ్య! కృష్ణారావుకు కంపరమెత్తింది. విశ్వానందం మళ్ళీ తన ఫిలాసఫీ చెప్పాడు. అవీ భగవంతుడి సృష్టే, గులాబీ మొక్కలకు, తుమ్మ మొక్కలకు, ఒకటే విలువ. అలాగే మల్లె మొక్క, జిల్లేడు మొక్క. అలాంటి చోట భయమా? ఈశ్వరుడి మీద భక్తి విశ్వాసాలున్నంత వరకూ భయపడాల్సిన అవసరమేముంది? ఇంకో ఇల్లు కావాలా? అలా అడగడం ఏంబాగు? మానవమాత్రుల చేత తాకబడని ప్రకృతి అది. కృష్ణారావుకి తప్పలేదు.

ఆ రోజు రాత్రి అతనికి నిద్దర పట్టలేదు. అర్ధరాత్రి బయట ఏదో శబ్దం. గోడ పక్కన ఏదో పోరాటం. పందికొక్కుల గోండ్రు, ముంగిస చేసే కీచు శబ్దం. భయం ఆవహిస్తోంది. నిద్దర పట్టదు. ఇంకేవో కొత్త శబ్దాలు. ఈ లోగా ఓ ముసలాడు తలుపు తట్టాడు. తనను తాను పరిచయం చేసుకొని, చెప్పడం ప్రారంభించాడు. ఆ ఇంట్లో ఇంతకు మునుపు తన స్థానంలోనే వచ్చిన ఇద్దరు పోయారని, రోగం వస్తే మందిప్పించేవారు లేకపోయారని, కృష్ణారావు లాంటి చిన్నవాళ్లు అక్కడ నుంచి తప్పించుకుని వెళ్ళి పోవడం మంచిదని సలహా ఇస్తాడు. అంతే కాదు. నెల అయిన తరవాత విశ్వానందం జీతం ఇవ్వడనీ, ఇక్కడ అసలు ఖర్చేమిటని, ఏదో ఒక వంకన.. ముఖ్యంగా 'అద్వైతం చిత్తు సత్తు' (ఆ ముసలాయన మాటలు) చెప్తూ.

కృష్ణారావుకి భయం ఎక్కువయింది. అంతకు మునుపు ఇద్దరూ ఎలా పోయారో? అదే అడిగాడు ఆ ముసలాడిని. జబ్బు చేసి, మందిప్పించే నాథుడు లేక. ఇద్దరూ మందు కావాలని అంటూ పోయారు. మరి విశ్వానందం ఏం చేశాడు? డాక్టరు అందుబాటులో లేకనా? అబ్బే, అదేం కాదు. ఆయనకు కాస్త పడిసెం పడితే, డాక్టరు చేత అయిదారు సార్లు పరీక్ష చేయించుకుంటాడు. ఎందుకూ? ఆయన తన ఆత్మను, శరీరాన్ని ఈశ్వరుడుకు అంకితం చేశాడు కనక. మిగిలినవారు అలా చేయలేదు కనక రోగం వచ్చినా మందులూ, మాకులూ తీసుకోకూడదు. ఇద్దరూ తను ఇప్పుడు కూర్చొన్న చాప మీదే పోయారు మందు కావాలంటూ! రెండో వాడికి న్యుమోనియా వస్తే, ప్రకృతిని ఆపడానికి మనమెవరని కిటికీలు, తలుపులు బార్లా తీసి చలిగాలిలోనే వుంచాడతన్ని. వింటూంటేనే భయం ఇంకా ఎక్కువయింది కృష్ణారావుకి. ఇంతకంటే మంచి ఉద్యోగం రాదు తనకి. తప్పదా?

మర్నాడు సాయంత్రం తలుపు తీయగానే ఓ కట్లపాము పరిగెడుతూ గోడ పగుళ్లలోకి వెళ్ళిపోయింది. భయంతో రాత్రికి తోడుగా ముసలాడిని తనతో పడుకోమన్నాడు. కొంచెం కునుకు పట్టే సమయంలో ఏదో కరచినట్లయింది. దుప్పటి కింద పాము.. లాంతరు వెలుగులో పరిగెడుతూ కనిపించింది. కృష్ణారావు మెలికలు తిరిగిపోతున్నాడు. 'రామారావు, రామారావు' అంటున్నాడు డాక్టరు కోసం. ముసలాడు విశ్వానందాన్ని లేపి తీసుకొచ్చాడు. విశ్వానందానికి కోపమొచ్చింది. "పదిహేనేళ్ల

నుంచి ఇక్కడుంటున్నావు, పరమార్థతత్వం బోధపడలేదా? మనిషి చచ్చిపోయేటప్పుడు యమకింకరులు జీవుణ్ణి గొలుసులతో బంధించేందుకు ప్రయత్నం చేస్తుంటే, ఎవడైనా డాక్టరు రామారావు కోసం కబురు చేయమంటాడా? పిచ్చివాడా! అతడి ఆత్మ ఇప్పుడు తపిస్తోంది ఆ అయోధ్య రాముడి కోసం, కానీ ఆలస్యంగా... ఆకాలంగా...". రైల్వే స్టేషన్‌కి తీసుకెడదామా అన్న ముసలాడి ప్రశ్నకు సమాధానంగా విశ్వానందం "ఓరి దైవద్రోహి! చచ్చిపోయేవాళ్ళ ఆత్మల్ని కూడా మంత్ర తంత్రాల వైపు తిప్పేందుకు ప్రయత్నం చేసే పాశండుడా..." అన్నాడు ఉద్రేకంతో.

గిలగిలా కొట్టుకుంటున్న కృష్ణారావు శరీరం ఆగిపోయింది. అతని కథ అయిపోయింది.

ఈ కథ ఒక సెటైర్. తన స్వార్థం కోసం హిందూ అద్వైత తత్వశాస్త్రాన్ని, ప్రకృతి పాఠాల్ని వాడుకునే మనుషుల మీద రాసిన చీకటి వ్యంగ్యాన్ని రచయిత ఎంచుకున్నారు. పని చేయించుకుని, డబ్బులివ్వకుండా, కనీసం మందూ మాకో కూడా ఇప్పించకుండా వుండే కుహనా వ్యవస్థ మీద రచయితకున్న అసహ్య భావం ప్రతిబింబించే కథ ఇది.

పరిచయ కర్త: శాయి రాచకొండ, హ్యూస్టన్



వినదగునెవ్వరు చెప్పిన ..

కథామంజరి సెప్టెంబర్ సంచికలో రాంబో – మెడికో శ్యామ్ కథా సంపుటి 'సరాగమాల' పై రాసిన సమీక్షలో రెండు అంశాలు నాకు నచ్చాయి. మొదటిది, 'సరాగమాల' పుస్తకం వచ్చి సుమారు రెండు దశాబ్దాలు అవుతోంది. దీన్ని నేను తెలుగు సాహితి' (ఢిల్లీ) తరపున ప్రచురించాను. పుస్తకాన్ని కొని చదివినవారు ఎందరున్నారో చెప్పలేను కాని, అచ్చు వేసిన కాపీలు అన్నీ అయిపోయాయి. రెండోది: రాంబో రాసిన పద్ధతి. దానిలో కొత్తదనం కనిపించింది. మూస పద్ధతిలో వస్తూన్న వాటికి భిన్నంగా ఉంది. చక్కని ఉపోద్ఘాతం మూల రచయిత గురించి.. సంపుటిలోని కొన్ని మంచి కథలలోని సుభాషితాలు.. చివరగా రచయిత గురించి సమీక్షకుడి అభిప్రాయం! అవును, శ్యామ్ కథలన్నీ మంచి అనుభవాన్ని పంచుతాయి. రాంబో కథకుడి కోసం నాడి పట్టుకున్నారు. సరైన విమర్శలూ / సమీక్షలూ రానిదే సరైన సాహిత్యం రాదని నా విశ్వాసం!

(విశ్రాంత ఆచార్య) రామవరపు గణేశ్వరరావు, హైదరాబాద్

సాహిత్య ప్రయోజనమే పరమావధిగా, సాహిత్యాభిమానుల నిరంతర శ్రమతో ప్రతి నెలా క్రమం తప్పకుండా వెలువడుతూ పాఠకులను అలరిస్తున్న విశిష్ట మాసపత్రిక 'కథామంజరి'. ఈ నెల సంచిక సంపాదకీయంలో ప్రస్తావించిన అంశం ఎంతో అభినందనీయం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను కథారచనలో వాడకపోవడం మంచిదని, మనిషి అంతరంగం నుంచి పుట్టే స్వచ్ఛమైన సృజనాత్మకత మాత్రమే ఉత్తమ కథను ఆవిష్కరించగలదని సంపాదకులు సూచించడం అక్షరాలా నిజం. మానవ హృదయ స్పందనల నుండి, అనుభవాల నుండి పుట్టే భావోద్వేగాలే కథకు జీవగఱ్ఱ అని నమ్ముతూ, అక్టోబర్ నెల 'కథామంజరి' సంచికలో ప్రచురితమైన కథలను పరిశీలిస్తూ చేసిన నా సమీక్ష ఇదిగో...

వేలూరి ప్రమీలాశర్మ గారి పగటి 'వేషగాడు' కథ బాహ్యరూపాన్ని బట్టి మనుషులను అంచనా వేసే సమాజపు సంకుచిత మనస్తత్వాన్ని ఎత్తిచూపుతుంది. ఏసీ బోగీలో ప్రయాణించే విచిత్ర వేషధారణ గల వ్యక్తిని దొంగగా నిందించి కొట్టినా, అతను ప్రాణాలకు తెగించి నిజమైన దొంగ నుండి సొత్తును కాపాడటం కథలోని ప్రధానాంశం. అయితే, కథనంలో సహజత్వం లోపించింది. ప్రయాణికుల సామూహిక హింస, కథానాయిక మౌనం నాటకీయంగా ఉన్నాయి. అత్యంత కీలకమైన ఆ పగటి వేషగాడి నేపథ్యం, మానసిక అంతరంగ చిత్రణకు చోటివ్వకుండా, కేవలం ఒక నైతిక సందేశం కోసం అతని పాత్రను వస్తువులా వాడుకోవడం కథలోని ప్రధానమైన లోపంగా అనిపిస్తుంది.

ఎస్వీకె సంహితానాయుడు గారి 'నగరంలో ఓ సాయంత్రం!' కథ రిటైర్మెంట్ జీవితంలోని ఒంటరితనాన్ని అధిగమించే వినూత్న ప్రయత్నాన్ని ఆవిష్కరిస్తుంది. వృద్ధ దంపతులు ఇతరుల కారును తమదిగా నటించి, లంచం ఆశించే కానిస్టేబుల్‌ని ఆటపట్టించడం ఇందులో కథాంశం. అయితే, ఇక్కడ ఆ పోలీసులో మార్పు తేలేకపోవడంతో వీరు ఆశించిన సామాజిక ప్రయోజనం నెరవేరక కథ అసంపూర్తిగా అనిపిస్తుంది. సందేశాన్ని ఇవ్వాలనే ఆలోచన అభినందనీయం. వినూత్న వస్తువును

ఎంచుకున్న ఈ యువ రచయిత్రి కథనంలోని ఉద్దేశ్య ఫలితాల సమతుల్యతపై కొంచెం దృష్టి పెడితే భవిష్యత్తులో తప్పక మంచి రచయిత్రిగా నిలుస్తారు.

కర్లపాలెం హనుమంతరావుగారి 'తంబురా' కథ మృత్యుభీతి నేపథ్యంగా సాగుతుంది. భార్యా పిల్లలను కోల్పోయిన చక్రవర్తికి మృత్యుభీతి పెరగడం, దాన్ని అధిగమించడానికి అనైతిక మార్గాలను ఎంచుకోవడం, చివరకు ప్రమాదం నుండి బయటపడి జీవితసత్యం తెలుసుకోవడం కథాంశం. అయితే, పాత్ర చిత్రణలో తీవ్ర అసంబద్ధత ఉంది. కళ్ళ ముందే కుటుంబం పోయాక మృత్యుభీతి కలగడం, తీవ్రమైన భయంలో ఉండి కూడా కామవాంఛకు లోనుకావడం.. మానసిక తార్కికతకు పూర్తిగా విరుద్ధం. వినూత్న వస్తువును ఎంచుకున్నా, పాత్ర మానసిక ప్రవర్తనలో సహజత్వం లోపించడం కథాశిల్పంలోని ప్రధాన లోపంగా నిలుస్తుంది.

తోట సుబ్రహ్మణ్యంగారి 'దిగ్దర్శనం' కథ సమాజాన్ని చైతన్యపరచడంలో సాహిత్యం యొక్క స్థానాన్ని సమున్నతంగా ఆవిష్కరిస్తుంది. ఆదర్శాల రాతలకు, నిజజీవిత ఆచరణకు వైరుధ్యం ఉందనే ఆత్మపరిశీలనతో, రచనలు మానేసిన శరత్, ఒక కుటుంబంలో విడాకులను తన కథే ఆపిందని తెలిసి మనోబలం పొందడం కథాంశం. నేటి కాలంలోనూ రచనల ద్వారా మార్పు వస్తుందనే నమ్మకాన్ని, రచయితల ఆత్మవిమర్శ ప్రాధాన్యతను చాటడం అభినందనీయం. సమాజపు శ్రేయస్సుకు రచయితల నిజాయితీ ఎంత అవసరమో గుర్తుచేస్తూ ఈ కథ ఒక దిగ్దర్శనంగా నిలుస్తుంది.

సీ.వి. శాస్త్రిగారి 'నాయిన మన ఊరు పోదాం' కథ శ్రామికవర్గం ఎదుర్కొనే వేదనను, యజమానుల దౌర్జన్యాన్ని ఆవిష్కరిస్తుంది. హోటల్ యజమాని చేతిలో దెబ్బలు తిని, అవమానపడ్డ తండ్రీకొడుకులు, సమయం చూసి అతనిపై భౌతిక దాడి చేసి, తమ సొంతూరు పారిపోవడం ఇందులో కథాంశం. అయితే, కథనం సాధారణ తెలుగు సినిమాలను తలపించే చౌకబారు ప్రతీకార నాటకంలా సాగింది. యజమాని వద్ద పనివారి వివరాలు ఉంటాయి కదా! తోటి పనివాళ్ళందరూ 'తండ్రీకొడుకుల వివరాలు తెలియవు' అని చెబితే, పోలీసులు కనీస విచారణ చేయకుండా వదిలేయడం పూర్తిగా అసంబద్ధంగా అనిపిస్తుంది. ఈ తార్కిక లోపం వల్ల వస్తువులో ఉన్న తీవ్రత సరిగ్గా వ్యక్తం కాక, కథాబలం దెబ్బతిన్నదేమో అనిపిస్తుంది.

మాధవి బైటారు గారి 'పాపప్రక్షాళన' కథ దౌర్జన్యాలతో సంపాదించిన సంపద వల్ల కలిగే మానసిక పతనాన్ని ఆవిష్కరిస్తుంది. అక్రమంగా కోట్లు గడించిన వ్యాపారవేత్త, తన పాపాలే కూతురి కాపురాన్ని నాశనం చేశాయని తెలుసుకుని పశ్చాత్తాపపడటం కథాంశం. మానవతా విలువలను గుర్తుచేసే మంచి వస్తువు ఉన్నప్పటికీ, శిల్పపరంగా కొన్ని లోపాలున్నాయి. ఒక ఉత్తమమైన కథాశిల్పంలో పాత్రల యొక్క ఆస్తిపాస్తులను, వారి సామాజిక హోదాను నామవాచకాలతో iPhone, BMW వంటి బ్రాండ్ పేర్లతో నేరుగా వర్ణించాల్సిన అవసరం లేదు. కేవలం ఆ పాత్ర ప్రవర్తన, పరిసరాలు, వారి జీవిత విధానం ద్వారానే పాఠకుడికి ఆ దర్పం అనుభవంలోకి రావాలి. సంభాషణలు నాటకీయంగా సాగడం కూడా కథా సౌందర్యాన్ని తగ్గించింది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ కథ మరింత సహజంగా ఉండేది.

సాధారణంగా విశిష్ట అతిథి కథలు గానీ, కథా మార్గదర్శకుల కథలను గానీ సమీక్షించే సాహసం నేను చేయను. కానీ, ఈ కథలు చదివాక వీటిలో చర్చించిన సామాజిక అంశాలు, వాటి వెనుక ఉన్న నైతిక దృక్పథం, ఆనాటి సామాజిక పరిస్థితులు కొంత ఆలోచింపజేయడంతో కొన్ని విషయాలను పంచుకోవాలనిపించింది.

తురగా జయశ్యామలగారి 'భవతీ భిక్షాందేహీ' కథ నగరాల్లో పరువు, సమయాభావాలను ఆసరాగా చేసుకుని సాగే విచిత్రమైన మోసపూరిత దందాలను ఆవిష్కరిస్తుంది. ఎయిర్‌పోర్ట్ వద్ద మిత్రుడికి వీడ్కోలు చెప్పి వస్తున్న కథానాయకుడిని, కారు తగిలిందనే నిందతో నలుగురు చుట్టుముట్టి నాటకమాడి డబ్బులు గుంజడం కథాంశం. శ్రమించకుండా ఎదుటివారిని దోచుకునే నైతిక పతనాన్ని, వ్యవస్థ వైఫల్యాన్ని ప్రశ్నించడం అభినందనీయం. అయితే, ప్రధాన సంఘటనకు ముందు వచ్చే హోటల్ ముచ్చట్లు కథనాన్ని కాస్త సుదీర్ఘం చేశాయి. పరువు కోసం నిశ్శబ్దంగా నష్టపోయే సగటు మనిషి స్థితికి అద్దం పట్టే మంచి కథ ఇది.

సుమారు 75 ఏళ్ల క్రితం నాటి సామాజిక పరిస్థితులకు దర్పణం పట్టే వాసిరెడ్డి నారాయణరావుగారి 'మద్రాసు ఏమయేటట్టు?' ఒక అరుదైన కథ. ఈతరం రచయితలు అధ్యయనం చేయవలసిన శిల్పంతో ఆహ్లాదకరంగా సాగుతుంది. 'మద్రాసు మనదే' అనే ఉద్వేగంతో నగరానికి వెళ్ళిన ఒక గ్రామీణ కుటుంబం, అక్కడ భాషా సమస్యలు, దొంగలు, రద్దీ నడుమ పడే పాట్లను రచయిత ఎంతో అద్భుతమైన హాస్య ధోరణిలో ఆవిష్కరించారు. అప్పట్లోని రాష్ట్ర విభజన పరిస్థితులను, ప్రజల రాజకీయ ఉత్సాహాన్ని అమాయకపు పాత్రల ద్వారా కళ్ళకు కట్టిన తీరు అభినందనీయం. ఎటువంటి లోపాలకు తావు లేకుండా, నాటి కాలాన్ని నేటికీ కళ్ళ ముందు కదిలించే చక్కని హాస్య ప్రవాహం ఈ కథ.

ఈ సంచికలోని మిగిలిన రెండు బాలల కథలైన మహంకాళి స్వాతి గారి 'అపహాస్యం', నారంశెట్టి ఉమామహేశ్వరరావు గారి 'చీకటంటే భయమా?' కథలు తమ పరిధిలోని కర్తవ్యాలను, బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తూ, పిల్లలకు నైతిక విలువలను అందించడంలో సంపూర్ణంగా సఫలీకృతమయ్యాయి. చక్కని సందేశంతో పాఠకులను ఆకట్టుకున్న ఈ రచయితల కలం ఇలాగే సాగుతూ, భవిష్యత్తులో కూడా బాలల రచనలను కొనసాగించాలని మనసారా ఆశిద్దాం.

రాంభో

గుర్తుకొస్తున్నాయి మరి..!

విజయార్కె

మీ బావతో టైం స్పెండ్ చేయలేకపోతున్నాను అనే అసంతృప్తికి చక్కని సలహా ఇచ్చావు. 'మతి మరుపు' యాక్ట్ చేసి బాధ పెట్టాను. చిన్న కోరిక కోరినా మర్చిపోయానని చెప్పడం బాధ కలిగించింది. కొన్ని సరదాలు తిరిగి రావు కదరా.. ఆ విషయం బావకు ఎలా చెప్పాలో తెలియలేదు.

అయినా నాకు అన్నీ బావే కదరా!

వీణాపాణి తన బతుకు వీణ తీగలు తెగి, అపశ్రుతుల గతులు మొదలయ్యాయని వాపోతున్నాడు!

తన ఫ్యూచర్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో వెంటిలేటర్ మీద ఉంటుందేమోనన్న భయం ఆర్జీవీ "దెయ్యం" సినిమాలా వెంటాడుతుంది. తెల్లవారితే "భయం" సినిమా బయోస్కోప్‌లో కనిపిస్తుంది. చీకటి పడిందంటే "రాత్రి "మూవీ ప్లే అవుతుంది. మధ్యాహ్నం ఇంట్లో ఉంటే "మధ్యాహ్నం హత్య" సినిమా గుర్తుకు వస్తుంది. టోటల్‌గా అన్నీ "గుర్తుకొస్తున్నాయి!"

★★★

ఈ కార్యక్రమాన్ని సమర్పిస్తున్నవారు.."తొక్కుడు..మొక్కుడు" అంటూ టీవీలో వ్యాపార ప్రకటన రావడం యాదృచ్ఛికం ... పొద్దుపొద్దున్నే వీణాపాణికి తత్త్వం బోధపడిన సంఘటన జరిగింది.

బద్దకంగా కళ్ళు తెరచి, ఇంకా బద్దకంగా "కాఫీ" అంటూ కేకేశాడు.

నేచురల్‌గా కాఫీ కప్పు విత్ భార్య శృతి ప్రత్యక్షం కావాలి. అలా కాకుండా.. రాకెట్ స్పీడ్‌తో భార్య మాత్రమే వచ్చి, మొగుడిని చూసి "ఒరేయ్ పరాయి పురుషా.. హూ ఆర్యూ" అంది.

ఒక్కసారిగా ఆ మాటలతో రెండు చేతులతో లుంగీని జారిపోకుండా పట్టుకుని, బిత్తర చూపులతో "ఒసే.. శ్రుతీ నేను.." ఆ షాక్‌లో ఏమనాలో తోచక ఆగిపోయాడు.

"నువ్వంటే.. నీకు పేరు గట్రా లేవా.. అయినా ఒంటరిగా పెళ్లి కాని అమ్మాయి గదిలో నీకేం పని.. అమ్మోయ్.. నాన్నోయ్.." అని అరిచింది.

బిక్క చచ్చిపోయాడు వీణాపాణి.

నిన్నటి వరకు బాగానే వుంది. రాత్రికి రాత్రే.. కొంపదీసి మిడ్‌నైట్ వెబ్ సిరీస్‌లు చూడలేదు కదా..!

అలా మొదలైంది వీణాపాణి జీవితంలో ట్రాజెడీ ఎపిసోడ్. అది డైలీ సీరియల్‌లా రిపీట్ అవుతూనే వుంది. ఎప్పుడు ఏది గుర్తుంటుందో, ఎప్పుడేది మర్చిపోతుందో తెలియదు! పొద్దున్నే "ఏమండీ కాఫీ" అంటూ తీసుకువచ్చింది.. హమ్మయ్య తన పెళ్ళానికి గుర్తొచ్చింది అంటూ తెగ హ్యాపీ ఫీలై, కాఫీ నోట్లో పెట్టుకుని, ఆ వెంటనే 'యాక్.. యాక్' అంటూ వాష్‌బేసిన్ దగ్గరికి పరుగెత్తాడు. మజ్జిగను పాలుగా ఫీలై, మరగబెట్టి, కాఫీ పొడి కలిపి తెచ్చింది. కూరగాయల బండివాడు వస్తే..."మా అత్తయ్య కొడుకొచ్చాడని "బయటకు పరుగెత్తబోయింది. భార్యను బయటకు వెళ్లకుండా కాపలా కాసేసరికి, తల ప్రాణం హార్ట్ ఎటాక్ వరకు వచ్చింది. ఆఫీసుకు వెళ్లాలంటే భయమేస్తోంది. అదే సమయంలో టీవీలో 'వసంత కోకిల' సినిమా వస్తుంది. వెంటనే వీణాపాణి మైండ్‌లో ఒక ఫ్లాష్ వచ్చి.. కమలహాసన్‌లా ఫీలై, భార్య ముందు కుప్పిగంతులు వేసాడు. తాను కమలహాసన్ అయినంత మాత్రాన భార్య శ్రీదేవి కావాలన్న రూల్ లేదు కాబట్టి, అది సినిమా కాబట్టి, తన బ్రతుకు కామెడీ కథ అయ్యింది కాబట్టి వర్కవుట్ కాలేదు.



శ్రుతికి తమ పెళ్లి ఫోటోలు చూపించాడు. అందులో ఉన్న తన ఫోటో చూపించి.. "ఈ ఫోటోలో ఉన్న పెళ్లి కూతురు ఎక్కడ అంకుల్? తనచ్చం నాలానే వుంది!" అంది తనకు అంకుల్‌గా ప్రమోషన్ ఇస్తూ!

పోనీ అత్తగారికి కబురు పెడదామంటే.. వాళ్ళు యుఎస్‌లో ఉన్నారు. పైగా 'నా కూతురికి పిచ్చెక్కేలా చేసావని' రివర్సయితే..!

కోపంతో ఫోటో ఆల్బమ్ మోకాలికి కొట్టుకున్నాడు. మోకాల్లో ఉన్న మెదడుకు దెబ్బ తగిలింది. అప్పుడు గుర్తొచ్చాడు శృతి కజిన్ శశాంక్! ఈ మధ్యే యుఎస్ నుండి వచ్చి సైకియాట్రిస్ట్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. వాళ్ళ గృహప్రవేశానికి కూడా వెళ్ళాడు వీణాపాణి.

ఆఘుమేఘుల మీద వెళ్ళడానికి అది వర్షాకాలం కాదు, కనుక, ఒకవేళ అలా వెళ్లినా ఆ ఆఘుమేఘులు క్యాబ్‌ల కన్నా ఎక్కువ చార్జీలు వసూలు చేసే ప్రమాదం ఉందని, పైగా తాను ఈ టైం లో బయటకు వెళ్తే శృతి ఎక్కడ కెలుకుతుందో, ఎవరిని ఎలా కెలుకుతుందో తెలియని కారణంగా, శృతి కజిన్‌కి ఫోన్ చేసాడు.

"వాటే కాళ్ బావా.. మీ చెల్లెలు కూడా లక్కీగా లేదు. ఎవడూ దొరక్క బోర్ ఫీలవుతున్నా,. రెండు బీర్లు పట్టుకొని రానా?" అటు నుంచి శృతి కజిన్ శశాంక్.. అసలు తను మాట్లాడేది వినిపించుకోకుండా, సరిగ్గా ఇరవై నిమిషాల్లో బ్లాక్ కలర్ క్యారీబ్యాగ్‌తో ప్రత్యక్షమయ్యాడు.

★★★

శశాంక్ లోపలికి రాగానే భయపడుతూనే ఎదురొచ్చాడు వీణాపాణి. అతని వెనకే శృతి వచ్చి శశాంక్‌ను చూసి.. "బాబాయ్ నువ్వా.. పిన్ని కులాసానా?" అని అడిగింది.

శశాంక్ బిక్కమొహం వేసి "నేను చెల్లాయ్.. శశిని.." అన్నాడు.

"వాడెవడు.. ఓహ్.. రాధిక అత్తయ్య కొడుకా.." అంది.

వీణాపాణికి సిట్యుయేషన్ అర్థమైంది. శశాంక్‌ను పక్కకు లాక్కెళ్లాడు. అతని చెవి కొరికాడు.. కొరకడం అంటే పళ్లతో రక్తం వచ్చేలా కాదు, లో గొంతుకతో గుసగుసగా మ్యాటర్ చెప్పాడు.

★★★

రెండు బీర్లు, హాఫ్ విస్కీ పూర్తయ్యాక "బావా ఇది సెమీ అల్జీమర్స్" అన్నాడు జీడిపప్పు మంచ్ చేస్తూ!

"అల్జీమర్స్‌లో 'సెమీ' కూడా ఉంటుందా? అయినా ఆల్జీబ్రా విన్నాను కానీ, ఈ అల్జీమర్స్ ఏంటి?" అయోమయంగా అడిగాడు.

"కొందరికి వయసుతో, మరికొందరికి యాక్సిడెంట్‌తో, సిస్టర్‌కి మనసుతో వచ్చింది!" చెప్పాడు శశాంక్.

"ఒక్క ముక్క అర్థమైతే చికెన్ ముక్కతో కొట్టు"

"ఇలాంటి కేసులు అమెరికాలో ఈ మధ్య ఎక్కువయ్యాయి బావా.. మనసులో సునామీ వచ్చినప్పుడు.."

"ఆగాగు! బీరు, విస్కీ కలిసి నీకు మైండ్ స్లిప్పయినట్టుంది.." అన్నాడు, మధ్యలో జోక్యం చేసుకుని వీణాపాణి. "పూర్తిగా చెప్పనివ్వు బావా! మనసులో సునామీ అంటే 'డిస్టర్బెన్స్' అని.. తీరని కోరికలు, అసంతృప్తి.. లాంటివి! ఈ మధ్య

చెల్లాయిని నిర్లక్ష్యం చేస్తున్నావా? తన చిన్న చిన్న కోరికలు తీర్చకపోవడం, తనతో టైం స్పెండ్ చేయకపోవడం గట్రా..”

“అంటే కొన్ని గట్రాలు చేసినట్లున్నాను!” సిన్సియర్‌గా చెప్పాడు.

“అదీ మ్యాటర్.. అందుకే తను బాగా డిస్టర్బ్ అయి, మతిమరుపుతో బాధ పడుతోంది. నువ్వు ఫోన్‌తో, ఫ్రెండ్స్‌తో బిజీగా ఉంటావు. తనతో టైం స్పెండ్ చేయవు. అప్పుడు తను ఎమోషన్స్‌ని మిక్సీలో వేస్తుంది. అవి జ్యూస్‌లా బయటకు వచ్చి, మతిమరుపును కలిగిస్తాయి!”

“మరి దానికి ట్రీట్మెంట్ లేదా.. లైఫ్‌లాంగ్ ఇలా నేను వరుసలు మారుతూ, టెన్షన్‌గా ఉండక తప్పదా?”

“అదేంటి బావా అంతమాటన్నావ్. నేను లేనూ.. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలి. చెల్లాయ్ మిస్సయిన వాటిని తిరిగి గుర్తు చేసి మరీ ఇచ్చేయ్. దీంతో మెల్లిమెల్లిగా లాస్ అయిన మెమరీ తిరిగొస్తుంది. అప్పటి వరకూ నువ్వు జూనియర్ గజిని. పెళ్లి ఫోటో మెడలో ట్యాగ్‌లా వేసుకో!” ఉచిత సలహా కూడా ఇచ్చి, వెళ్ళిపోయాడు!

ఆ తర్వాత.. వీణాపాణి “ఆపరేషన్ గుర్తుకొచ్చాయి మరి!” మొదలుపెట్టాడు.

ఓసారి.. ‘సరదాగా సినిమాకి వెళ్దామని’ అడిగింది. ‘ఇంట్లో నెట్‌లో బోల్డు ఛానెల్స్ వున్నాయి కదా’ అన్నాడు తను. ఆ విషయం గుర్తుకొచ్చి, వెంటనే శృతికి ఇష్టమైన సినిమాకు.. అదీ శృతికి ఇష్టమైన సిటీ బస్సులో తీసుకువెళ్లాడు

సిటీ బస్సులో వెళ్తుంటే, తన పక్కనే కూర్చొని బస్సులో నుంచి బయటకు చూస్తూ బోల్డు ఎంజాయ్ చేసింది. భార్య కళ్ళలో ఆనందం చూసాడు.

తెల్లారి లేవగానే.. కాఫీ అంటూ టీ తీసుకు వచ్చింది. మజ్జిగ కన్నా టీ బెటర్ అనుకున్నాడు.

“థాంక్స్ బావా! సిటీ బస్సులో తీసుకువెళ్లి నాకు సినిమా చూపించినందుకు” అంది.

‘పరాయి పురుషుని కన్నా ‘బావ’ బెటర్’ అనుకున్నాడు.

ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టాడు. ‘కాసేపు కిచెన్‌లో నాతో కబుర్లు చెప్పుకుంటూ ఉండొచ్చు కదా..’ అని తరచూ అడిగేది. అది గుర్తొచ్చి, కిచెన్ లోకి అడుగు పెట్టాడు. శృతితో కలిసి వంట చేశాడు. ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పాడు. మధ్యలో జీఎస్టీలా ముద్దుముచ్చట్లు వడ్డించాడు.

“మీరు నాకు తెగ నచ్చారండి! ఐ లవ్ యు అండి.. పెళ్లయ్యాక కూడా నాతో ఇలాగే ఉంటారా అండి?” అని అడిగింది.

సాయంత్రం బీచ్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ పూలు తీసుకున్నాడు. “పెళ్ళికి ముందే ఇంతగా ప్రేమిస్తున్నారు. పెళ్లి తర్వాత భార్యను ఎంతగా ప్రేమిస్తారో!” అంది శృతి. ఎక్కడో తగిలింది వీణాపాణికి!

వారం రోజులు గడిచాయి.. ఆ రాత్రి శృతి.. “మనం వెంటనే పెళ్లి చేసుకుందాం!” అంది. అర్ధరాత్రి ఒంటి గంటకు పాలగ్లాసుతో వచ్చింది. ఆ రాత్రి వసంత రాత్రి!

తెల్లారి అలవాటులో పొరపాటుగా, బద్ధకంగా ‘కాఫీ’ అన్నాడు.

కాఫీ కప్పుతో ప్రత్యక్షమైంది శృతి. అలాగే చూస్తూ ఉండిపోయాడు వీణాపాణి.

"అదేంటండి! ఆఫీసుకు వెళ్ళరా? అన్నట్టు శశి అన్నయ్యను ఓసారి ఇంటికి పిలుద్దాం భోజనానికి. ఇంతవరకు వాడిని పిలవలేదు" అంది.

అంటే.. శృతి మామూలైంది. యాహూ అని ఎగిరి గంతేయలేదు. ఫ్లాష్‌బ్యాక్ శృతితో చెప్పలేదు. ఒక్కటి మాత్రం డిసైడయ్యాడు. భార్యతో ఎక్కువ టైం స్పెండ్ చేయాలి.

★★★

ఆ రోజు ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చాక శృతి కోసం పడగ్గదిలోకి వెళ్తుంటే, శృతి మాటలు వినిపించాయి. ఫోన్. మాట్లాడుతుండగా... "థాంక్స్‌రా అన్నయ్య, మీ బావతో టైం స్పెండ్ చేయలేకపోతున్నాను అనే అసంతృప్తికి చక్కని సలహా ఇచ్చావు. 'మతిమరుపు' యాక్ట్ చేసి బాధ పెట్టాను. చిన్న కోరిక కోరినా మర్చిపోయానని చెప్పడం బాధ కలిగించింది. కొన్ని సరదాలు తిరిగి రావు కదరా.. ఆ విషయం బావకు ఎలా చెప్పాలో తెలియలేదు. అయినా నాకు అన్నీ బావే కదరా! పాపం తనని కొన్ని రోజులు బాధ పెట్టాను. అయినా మీ బావ బంగారం!" అంటోంది శృతి... అటువైపు శశాంక్‌తో!

ప్రతి విషయానికి "మర్చిపోయానని" చెప్పడం తనకు అలవాటైంది. చిన్న చిన్న ఆనందాలు, భార్యలకు ఇవ్వడం మర్చిపోతే, అప్పుడు శృతి ఎంత బాధ పడిందో... అర్థమైంది! నిజంగా భార్య భర్తను మర్చిపోతే.. అనుభవంలోకి, ఆలోచనలోకి వచ్చింది వీణాపాణికి! అందుకే, భార్య ఆడిన నాటకం తెలిసినా ఆ ప్రస్తావన ఎప్పుడూ తీసుకురాలేదు వీణాపాణి!

ప్రతి భార్య భర్తతో టైం స్పెండ్ చేయాలనుకుంటుంది. అసంతృప్తి ఎక్కువైతే ఆ కాపురంలో కలతలు!

మీ ప్రైవేట్ లైఫ్ కోసం కొంత టైం అట్టి పెట్టుకోండి. మీరు టైం స్పెండ్ చేస్తే.. అనుభూతులు మీకు రిటర్న్ గిఫ్ట్‌గా వస్తాయి.

గుండె కింద ముల్లు

తోట దుర్గారావు

రిటైర్మెంట్ తర్వాత మాకు అదే పని కదా! గడిచిపోయిన జీవితంలో తప్పులు తవ్వుకోవటం! ఈ తప్పే నన్ను బాగా కలిచివేసేది. గుండె కింద ముల్లులా గుచ్చుతూనే ఉంది. దీనికి పరిహారంగా.. నేను కార్తీక్ చేత తిట్టించుకోవాలి అనిపించింది. టైమ్ కోసం వెయిట్ చేస్తున్నాను. కొత్త ప్రాజెక్ట్‌లో వాడి అసహనం, కోపం బయటకు వచ్చాయి. ఇదే అదునుగా వాడిని రెచ్చగొట్టాను. వాడి తండ్రిని కదా, నేను ఏమి తిడితే వాడు స్ట్రాంగ్‌గా రియాక్ట్ అవుతాడో తెలుసు. సక్సెస్ అయ్యాను!

"కార్తీక్.. కడుపులో ఏదో ఇబ్బందిగా ఉంది.. " కార్తీక్ రూమ్ బయట నిలబడి చెప్పాడు రఘురాం.

ఆఫీస్ వర్క్.. మీటింగ్స్ టెన్స్‌గా ఉన్నాడు కార్తీక్.

"ఏదో గ్యాస్ ప్రాబ్లమ్ అయి ఉంటుంది నాన్నా .. గ్యాస్ టాబ్లెట్స్ ఉన్నాయిగా.. " యథాలాపంగా చెప్పాడు కార్తీక్.

రఘురాం మొఖం ఎర్రబడింది.

"గ్యాస్ నొప్పి నాకు తెలియదా.. మాణింగ్ వేసుకున్నాను. తగ్గలేదు!" కొంచెం గొంతు పెంచి చెప్పాడు.

కార్తీక్ కి ఆఫీస్ కాల్స్ వస్తున్నాయి. "కాసేపు చూద్దాం నాన్నా. నొప్పి ఎక్కువ అయితే డాక్టర్ దగ్గరకు వెళ్దాం." చెప్పేసి కాల్ అటెండ్ అయ్యాడు కార్తీక్.

కొడుకునే చూస్తూ నిలబడ్డాడు రఘురాం.

కార్తీక్ కాల్ కంప్లీట్ అవ్వగానే చెప్పాడు "ఆఫీస్ వర్క్ టెన్షన్‌లో ఉన్నాను నాన్నా!"

"ఆఫీస్ వర్క్ గురించే టెన్షన్. ఇంటి గురించి.. ఇంట్లో మనుషుల గురించి టెన్షన్ లేదు నీకు!" రఘురాం లో కోపం పెరుగుతుంది.

వంటింట్లో ఉన్న గౌతమి ఉలిక్కిపడింది. ఈ తండ్రి కొడుకులు పొద్దునే మొదలు పెట్టారు.. గొడవ పడటం! ఎవరినో ఒకరిని సముదాయించాలి. హడావుడిగా హాలులోకి వచ్చింది.

అప్పటికే పోట్లాటకు సిద్ధమైన కోడిపుంజుల్లా ఉన్నారు తండ్రి కొడుకులు!

ఒక టాబ్లెట్ తో రఘురామ్ కడుపునొప్పి తగ్గిపోయింది. అయినా గంటసేపు ఇద్దరి మధ్య మాటల యుద్ధం.

చిన్న విషయాలకే రోజూ గొడవలు పడుతున్నారు తండ్రి కొడుకులు .

గౌతమి తల పట్టుకుంది. తను మావయ్యకు చెప్పలేదు. గొడవ జరిగిన ప్రతిసారీ కార్తీక్‌నే సున్నితంగా మందలిస్తుంది.

“మావయ్యగారు ఏమైనా అంటే నువ్వు కామ్‌గా ఉంటే బాగుంటుంది కార్తీక్!” గౌతమి చెప్తుంది

“ఆయన నన్ను కామ్‌గా ఎక్కడ ఉండనిస్తున్నారు. చాలా ఇరిటేషన్ తెప్పిస్తున్నారు. ఆయన మాటలు ముల్లుల్లా గుచ్చుకుంటుంటే, కామ్‌గా ఎలా ఉంటాను!” కార్తీక్ సీరియస్ అవుతాడు.


అసలు.. ఇద్దరి మధ్య గొడవలు ఎందుకు మొదలయ్యాయో అర్థం కాలేదు గౌతమికి! ఇద్దరూ కామ్ గానే ఉండేవాళ్ళు.

కార్తీక్ హై పొజిషన్‌కి వెళ్ళాడు. ఆఫీస్ స్ట్రెస్ ఎక్కువ అయ్యింది. ఆ స్ట్రెస్ ఇంట్లో చూపించడం మొదలైంది. అది భరించలేక, కొడుకు మీద తన పెద్దరికం చూపించటం మొదలుపెట్టాడు ఆ తండ్రి!.

రోజు ఏదో విషయంలో గొడవ పడుతూనే ఉన్నారు తండ్రి కొడుకులు.

ఆ రోజు.. కార్తీక్ రిలాక్స్‌గా హాలులో సోఫాలో కూర్చున్నాడు.

అప్పుడే రఘురాం ఫోన్‌లో గట్టిగా మాట్లాడుతూ హాలులోకి వచ్చాడు.



"కొడుకులు దగ్గర సుఖపడాలి అంటే మనం 'నాన్నలం' అనే హోదా మరచిపోవాలి. పెద్దవాళ్ళం అనే రెస్పెక్ట్‌ను వదిలేయాలి. డిపెండెంట్స్ అనుకుని, అన్నీ మూసుకుని కూర్చోవాలి. కొడుకులే నాన్నలు.. సార్‌లు మనకు! వాళ్ళ ఆర్డర్స్ ఫాలో అవ్వాలి మనం!" గట్టిగా చెప్తూనే, ఓరకంట కార్తీక్‌ను చూసాడు రఘురాం.

తండ్రి మాటలకి హర్ట్ అయినట్టు కార్తీక్ మొహంలో కనిపిస్తుంది.

అలాంటి సూటిపోటి మాటలే ఫోన్‌లో కొనసాగాయి!

రఘురాం మాట్లాడటం అయిన తరువాత కార్తీక్ అడిగాడు..

"ఏమిటి నాన్నా.. మీ ఫ్రెండ్స్ ముందు, నా గురించి అంత హీనంగా మాట్లాడుతున్నారు. మీకేమి తక్కువ చేసాం? బాగా చూసుకుంటున్నాం కదా!" ఉక్రోషంతో అడిగాడు కార్తీక్.

"అసలు మీ నాన్న ఎలా ఉండేవాడో నీకు గుర్తుందా! నీ కోసం ఏమి చేసాడో, నిన్ను ఎలా పెంచాడో గుర్తు చేసుకో!"

"మీ నాన్నలందరూ ఇంతే! కొడుకులను కొడతారు, తిడతారు! కొడుకులు ఎదిగితే జెలసీతో, వాళ్ళల్లో తప్పులు వెతికి ఇలాగే హింసిస్తారు!" కార్తీక్ గొంతు పెంచాడు.

చాలాసేపు వాదనలు, నిందించుకోవడాలూ, విమర్శలు, దూషించుకోవడాలూ జరిగాయి.

గౌతమి ఎవరినీ వారించలేక పోయింది. చాలా బాధగా అనిపించింది. 'అత్తయ్యగారు ఉండి ఉంటే, ఎంత మనస్థాపం చెందేవారూ.. వీరి మాటలు విని' అనిపించింది. కార్తీక్‌కి గట్టిగా చెప్పాలని నిర్ణయించుకుంది.

"నాన్నను అలా దూషించటం తప్పు కార్తీక్. నాన్నను గౌరవించాలి. రెస్పెక్ట్ చేయలేకపోతే, ఆయనను క్షమించి వదిలేయాలి!"

కొరడాతో కొట్టినట్టు అనిపించింది కార్తీక్‌కు

నాన్నను నేను క్షమించడం ఏమిటి? నాన్న చేసిన తప్పు ఏమిటీ? ఆయన మీద ఎందుకు కోపం? ఆలోచిస్తున్న కార్తీక్ మనసులో ఏదో కలుక్కుమంది.

సడన్‌గా ఇద్దరి మధ్య గొడవలు ఆగిపోయాయి.

ప్రశాంతంగా ఉన్నారు ఇద్దరు! మామూలుగానే మాట్లాడుకుంటున్నారు!

ఒకరోజు ప్రశాంతంగా గడిచింది.

అలా రోజులు లెక్కపెడుతుంది. వారం రోజులు... గొడవలు సమసిపోయాయి అని ఆనందించింది.

అంతలోనే పిడుగు లాంటి వార్త! రఘురాంకు హార్ట్ స్ట్రోక్.

కార్తీక్ దగ్గరుండి తండ్రిని హాస్పిటల్లో అడ్మిట్ చేసాడు. ఐసియు లో ట్రీట్మెంట్ జరుగుతుంది.

లాంజ్‌లో కూర్చున్న కార్తీక్.. సడన్‌గా గౌతమి చేతిని, తన రెండు చేతులతో పట్టుకుని ఏడుస్తున్నాడు "బాధపడకు కార్తీక్! మావయ్యకు ఏమి అవ్వదు. డాక్టర్లు కూడా చెప్పారు కదా!"

"నా వల్లనే నాన్నకు ఇలా జరిగింది. నేనే ఆయన మీద రివెంజ్ తీర్చుకున్నాను!"

"అర్ధం లేకుండా మాట్లాడకు కార్తీక్. ఆయన మీద నువ్వు రివెంజ్ తీర్చుకోవటం ఏమిటి?"

"ఉంది గౌతమి! చిన్నప్పుడు నేను బాగా చదవలేదని నాన్న నన్ను కొట్టారు. తిట్టారు. ఇంట్లోనూ, స్కూల్లోనూ ఇన్సల్ట్‌గా ఉండేది. అప్పుడే నాన్న మీద చాలా కోపం వచ్చింది. నాన్నను ఏదైనా చేయాలని చాలా సార్లు అనుకున్నాను."

"కార్తీక్. తెలిసీ తెలియని వయసు ఏవేవో అనిపిస్తాయి."

"నాకు ఇప్పటికీ గుర్తు ఉన్నాయి అంటే.. నా సబ్‌కాన్షస్‌లో కోపం, పగ ఉండిపోయాయి. ఇప్పుడు నాన్న నా మీద డిపెండెంట్ కదా.. ఛాన్స్ వచ్చింది నా కోపం తీర్చుకుంటున్నాను!"

"అది నీ భ్రాంతి కార్తీక్! నీకు ఆఫీస్ స్ట్రెస్ ఎక్కువయింది, ఆ చిరాకులో ఒక్కోసారి కంట్రోల్ తప్పుతున్నావు. అంతే."

"స్ట్రెస్ ఎక్కువ అయ్యింది. నా చిరాకు నీ మీద చూపించాలి. కానీ నాన్న మీద చూపిస్తున్నాను అంటే, నాకు ఆయన మీద కోపం ఉంది. దుర్మార్గుడిని.. నాన్నను ఎన్ని మాటలు అన్నాను. ఆయన వలనే కదా నేను ఇంత వాణ్ణి అయ్యాను." దుఃఖం ఆపుకోలేక బోరున ఏడ్చేసాడు.

కార్తీక్ ఏడుపు చూసి ఆపుకోలేక గౌతమి ఏడ్చింది. కార్తీక్‌ను ఓదారుస్తూనే.

"క్రితంసారి గొడవ జరిగినపుడు నాకు అనిపించింది. అనలైజ్ చేసుకున్నాను. నా తప్పు తెలుసుకున్నాను. నాన్నను ఒక్క మాట కూడా అనకూడదు అని డిసైడ్ అయ్యాను. పరిష్కారం ఆలోచించాను, కానీ నీకు చెప్తే బాధ పడతావని చెప్పలేదు. ఆ హై ప్రొఫైల్ జాబ్‌కి రిజైన్ చేసాను. స్ట్రెస్ రిలీజ్ అయ్యింది."

గౌతమి ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. వారం రోజులుగా ప్రశాంతంగా ఎందుకు ఉన్నారో అర్ధం అయ్యింది గౌతమికి! వెంటనే తేరుకుంటూ.. "జాబ్ గురించి నాకు వర్రీ లేదు కార్తీక్. మనం హ్యాపీగా ఉండాలి!"

"సార్. ఆయన కాన్షస్ లోకి వచ్చారు. వెళ్ళి చూడండి." నర్స్ మాటలకు ఇద్దరు కంట్రోల్ లోకి వచ్చారు.

"కార్తీక్ నేను చూసి వస్తాను. నువ్వు చాలా ఎమోషన్‌లో ఉన్నావు." అంటూ గౌతమి ఆ వార్డ్ లోకి వెళ్ళింది.

కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నాడు రఘురాం! అన్ని రకాల ఎక్విప్మెంట్‌తో నింపేశారు ఆయన మొహాన్ని! చాలా బాధ అనిపించి, కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి గౌతమికి! దగ్గరగా వెళ్ళి ఆయన చేతిని పట్టుకుని నిమిరింది.

రెండు రోజుల తర్వాత.. రఘురాం ని రూంలోకి మార్చారు. గౌతమి అక్కడే కూర్చుని, "మీకేం భయం లేదు అని చెప్పారు డాక్టర్లు. మీరు తొందరగా రికవర్ అవుతారు." మృదువుగా చెప్పింది.

రఘురాం నిర్లిప్తంగా నవ్వాడు.

"కార్తీక్..." అడిగాడు.

"డాక్టర్‌తో మాట్లాడుతున్నారు. చాలా బాధ పడుతున్నారు. మిమ్మల్ని మాటలతో బాధ పెట్టానని ఎక్కువ ఫీల్ అవుతున్నారు."

రఘురాంలో ఓ చిన్న మందహాసం కనిపించింది. అదేదో విజయ దరహాసంలా అనిపించింది గౌతమికి!

అలా ఎందుకు నవ్వుతున్నారో గౌతమికి అర్థం కాలేదు.

"వాడు నన్ను తిట్టటం ఏమిటి... నేనే వాడి చేత తిట్టించుకున్నాను. వాడు మంచి కాక మీద ఉన్నటైమ్ చూసి, వాడిని 'రెచ్చగొట్టి అన్ని మాటలు అనిపించుకున్నాను."

ఆ మాటలు వింటూనే ఒక్కసారిగా షాక్ అయ్యింది గౌతమి. 'కొడుకు చేత తిట్టించుకోవాలి అనిపించటం ఏమిటి. ఇదేమి సరదా' అని అనిపించింది.

తమాయించుకుని.. "ఎందుకు మావయ్యగారు అలా చేసారు." అయోమయంగా అడిగింది.

"అపరాధభావం. ప్రాయశ్చిత్తం అంటారు!"

కొంచెం సేపు ఆగి ఆయనే అన్నాడు.. "చిన్నతనంలో సరిగా చదవలేదని కార్తీక్‌ను బాగా కొట్టేవాడిని, తిట్టేవాడిని! అయినా పరీక్షల్లో మంచి మార్కులు రాలేదు. కఠినమైన పనిష్‌మెంట్ తో పిల్లలను చదివిస్తాడని పేరుపడిన రాజారావు మాస్టర్ దగ్గర ట్యూషన్లో పెట్టాను. ట్యూషన్లో చేరిన కొద్దిరోజులకే కార్తీక్‌లో మార్పు వచ్చింది. మంచి మార్కులు తెచ్చుకున్నాడు. టెన్త్ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు. ఆశ్చర్యంగా అనిపించి.. రాజారావు మాస్టారు ఏమి ట్రీట్‌మెంట్ ఇచ్చాడో తెలుసుకోవాలని ఆయన దగ్గరకు వెళ్ళాను."

"కార్తీక్ బ్రిలియెంట్ స్టూడెంట్ రఘురాంగారు! తనకు తానే చదువుకుంటాడు. నేను టీచరుగా పాఠాలు చెప్పాను. చిన్న పనిష్మెంట్ కూడా ఇవ్వలేదు కార్తీక్‌కి."

రాజారావు చెప్పిన రిపోర్ట్ విని షాక్ అయ్యాను.

నేను అంత బాగా చదివిస్తే ఎందుకు చదవలేదని అనిపించి, ఆయన్ని అదే అడిగాను."

"అత్యాశతో.. మీ తెలిసి తెలియని జ్ఞానంతో వాడిని హింసించారు.. వాడికి నచ్చిన పద్ధతిలో చదువుకోనివ్వలేదు. వాడి మైండ్ లోకి ఏమి వెళ్తుందో తెలుసుకోలేదు. ఫోర్స్‌ఫుల్‌గా మీ ఆలోచనల్ని ఇంజెక్ట్ చేయాలని చూసారు. అది వికటించింది."

"వికటించిందా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. మీరు చెప్పిన చదువు, వాడి బుర్రకు ఎక్కలేదు సరి కదా.. అవమానాలతో వాడి మనసు గాయపడింది. మీరంటే చాలా కోపం ఉంది. అది క్లియర్ అయ్యేలా చూసుకోండి."

ఆయన మాటలు వింటుంటే.. నా గుండెను మెలిపెట్టినట్టు అయ్యింది. నా కొడుకు మనసు తెలుసుకోలేక పోయాననే బాధ. నేను ప్రాణం కంటే మిన్నగా చూసుకునే కార్తీక్‌కు నా మీద కోపం!" అలసటగా ఊపిరి పీల్చుకున్నాడు రఘురామ్.

"అప్పటి నుంచి కార్తీక్ ఇష్ట ప్రకారమే చేసాను. అయినా నేను చేసిన తప్పు.. నా మనసును గుచ్చుతూనే ఉంది. రిటైర్మెంట్ తర్వాత మాకు అదే పని కదా! గడిచిపోయిన జీవితంలో తప్పులు తవ్వుకోవటం! ఈ తప్పే నన్ను బాగా కలిచివేసేది. గుండె కింద ముల్లులా గుచ్చుతూనే ఉంది. దీనికి పరిహారంగా.. నేను కార్తీక్ చేత తిట్టించుకోవాలి అనిపించింది. టైమ్ కోసం వెయిట్ చేస్తున్నాను. కొత్త ప్రాజెక్ట్‌లో వాడి అసహనం, కోపం బయటకు వచ్చాయి. ఇదే అదునుగా వాడిని రెచ్చగొట్టాను.

వాడి తండ్రిని కదా, నేను ఏమి తిడితే వాడు స్ట్రాంగ్‌గా రియాక్ట్ అవుతాడో తెలుసు. సక్సెస్ అయ్యాను!" అంటూ రఘురాం ఒక్కసారిగా కళ్ళు మూసుకున్నాడు.

"ఏం జరిగిందో తెలియక.. మధ్యలో నేను నలిగిపోయాను మావయ్యగారు. వారం రోజుల నుంచి కొంచెం బాగున్నాను."

"క్రితంసారి గొడవ తరువాత కార్తీక్ బాధపడటం గమనించాను. నా పాపం ప్రక్షాళన అయిపోయిందనిపించింది. స్టాప్ చేసాను. బాగుందని అనుకునే లోగా ఇదిగో.. ఇది వచ్చింది!"

"తొందరగానే క్లియర్ అవుతుంది అని చెప్పారు. ఇక నుంచి గొడవలు లేకుండా హాయిగా ఉండొచ్చు."

రఘురాం విరాగిలా నవ్వాడు. ఒక విషాద వీచిక ఆయన మొహం మీద దోబూచులాడి, అక్కడే ఉండి పోయింది.

ఏదో వినిపించి తలతిప్పి చూసింది గౌతమి.

కార్తీక్.. తండ్రి పాదాలను పట్టుకుని రోదిస్తున్నాడు.

స్పర్శ

దేశరాజు

"కంగారు పడొద్దు. నీ గుండె వేగాన్ని నియంత్రించు. కళ్ళు మూసుకుని ఒక్క క్షణం నువ్వు భూమి మీద ఉన్నట్టు ఊహించుకో. నీ కాళ్ల కింద పచ్చని, మెత్తని గడ్డి.. దాని మీద సూర్య కిరణాలు బంగారు రంగులో మెరుస్తున్నాయి. చెట్లలోని పక్షుల కువకువలు వింటున్నావు. కొన్ని పక్షులు రెక్కలు విప్పి నీలి రంగు ఆకాశంలో హాయిగా గిరికీలు కొడుతున్నాయి. ఆ అందమైన ప్రపంచాన్ని నువ్వూ, నీ ఫ్యామిలీ అంతా చూడాలంటే ఇప్పుడు ధైర్యంగా పని పూర్తి చేయాలి"

2526వ సంవత్సరం!

భూమి వైపు సాగుతున్న స్పేస్‌షిప్.. అనంతమైన అంతరిక్షంలో ఒక చిన్న వెలుగు చుక్కలా కదులుతోంది. ఆ షిప్‌లోని కిటికీ పక్కన కూర్చున్న పదేళ్ల పిల్లాడికి.. ఆకాశం అంటే నలుపు రంగు మాత్రమే. భూమి మీద ఆకాశం నీలంగా ఉంటుందని, అక్కడ గాలి ఉచితంగా దొరుకుతుందని వాళ్ల అమ్మ చెబుతుంటే ఆశ్చర్యంగా విన్నాడు.

"హే! ఇది చూడు, ఈ పువ్వు బొమ్మ ఏంటో చెప్పుకో?" అంటూ ఐదేళ్ల చెల్లెలు, ఒక పాత డిజిటల్ ట్యాబ్‌తో పరిగెత్తుకుంటూ వచ్చి అడిగింది. అందులో ఒక ఎర్రటి గులాబీ బొమ్మ ఉంది.

దాన్ని చూసి చిన్నగా నవ్వి, "అది గులాబీ పువ్వు" అన్నాడు.

తరువాత "నీకు తెలియని ఇంకో సంగతి చెప్పనా?" కవ్విస్తున్నట్టుగా అడిగాడు.

చెల్లెలు 'ఏంటది?' అన్నట్టు కుతూహలంగా కళ్లెగరేసింది.

"దానికి మంచి వాసన కూడా ఉంటుందట. అంటే, మన షిప్‌లో లాగా ఐరన్ స్మెల్ కాదు. అదో రకమైన మధురమైన వాసనట!" అన్నాడు.

అంతలో వారి గది తలుపులు తెరుచుకున్నాయి. రోబో లోపలికి ప్రవేశించింది.

అదొక పాత కాలపు ఏఐ రోబో! దాని ఒంటి మీద అక్కడక్కడా తుప్పు పట్టిన గుర్తులు ఉన్నా, దాని కళ్ళలోని నీలం రంగు కాంతి ఎప్పుడూ వారికి భద్రతా భావాన్ని ఇస్తూ ఉంటుంది.

"కిడ్స్.. మీ ఆహార సమయం దాటిపోతోంది. సింథటిక్ ప్రొటీన్ బార్స్, న్యూట్రియంట్ చాకొలెట్స్ సిద్ధంగా ఉన్నాయి. తీసుకోండి!" అంటూ లోహపు గొంతుతో పలికి, లోహపు చేతులతోనే అందించింది.

సరిగ్గా అదే సమయంలో, ఒక్కసారిగా షిప్ భారీ శబ్దంతో ఊగిపోయింది. షిప్ గోడల మీద ఇనుప శబ్దాలు హోరెత్తుతున్నాయి. టేబుల్ మీద ఉన్న గ్లాసులు కింద పడిపోయాయి. వెంటనే ఎర్రటి ఎమర్జెన్సీ లైటు బ్లింక్ అవ్వడం మొదలైంది.

"హెచ్చరిక! సెక్షన్–4 వద్ద ఆక్సిజన్ రీసైక్లర్ దెబ్బతింది. గాలి నిల్వలు క్రమేపీ పడిపోతాయి. మిగిలి ఉన్న సమయం కేవలం రెండు గంటలు మాత్రమే" కంప్యూటర్ స్క్రీన్ మీద అక్షరాలు వేగంగా పరిగెడుతున్నాయి.

"అమ్మా, నాన్నా.." అంటూ పిల్లలు గట్టిగా ఏడుపు లంకించుకున్నారు. వారిద్దరూ అదే షిప్‌లోని మరో గదిలో ఉన్నారు. సేఫ్టీ డోర్స్ ఆటోమేటిక్‌గా లాక్ అయిపోవడంతో వారు బయటకురాలేని పరిస్థితి!

"ఏం జరుగుతోంది.. మనం భూమిని చూడకుండానే చచ్చిపోతామా?" అడిగింది చెల్లెలు.



సెకన్లో స్పందించిన రోబో "నో.. కంగారు పడొద్దు. మనకి టూ అవర్స్ టైం వుంది కదా? ఏదో ఒకటి చేద్దాం. బయటి వైపు ఉన్న ఒక సోలార్ ప్యానల్ ముందుకు చొచ్చుకు వచ్చి, ఆక్సిజన్ ట్యాంక్ పైపును నొక్కుతోంది. లోపలి నుంచి దీన్ని సరిచేయడం సాధ్యం కాదు. ఎవరైనా బయటకు వెళ్లి ఆ ప్యానల్‌ను తొలగించాలి" అని చెప్పింది.

"నువ్వే చేయొచ్చుగా?" అన్నాచెల్లెళ్లిద్దరూ ఒకే గొంతుతో అడిగారు.

"సారీ, నాకు ఆ ప్రోగ్రామ్ రాయలేదు. సో.. నేను చేయలేను!" ఎటువంటి భావోద్వేగాలు లేకుండా, మామూలుగా చెప్పింది రోబో.

"పోనీ ఎలా చేయాలో చెప్పు" అడిగారు.

అది ఏదో చెక్ చేసుకుని "చిన్న లేజర్ టూల్ వుంది. దాన్ని తీసుకుని బయటకు వెళ్లి, ఆ సోలార్ ప్యానెల్‌ను కొంత కట్ చేస్తే, ఆక్సిజన్ సరఫరాకు ఆటంకం ఏమీ వుండదు. అందరూ క్షేమంగా వుంటారు!" చెప్పింది.

"నేను వెళ్తాను" ముందుకు వచ్చాడు అబ్బాయి.

చెల్లెలు ఏడుస్తూ "నో.. వీల్లేదు. నేనే వెళ్తాను. నీకేం తెలీదు. నీకేమైనా అయితే నాకు బాధగా వుంటుంది!" అంది.

చెల్లెలు ముఖంలోకి చూశాడు. "నువ్వు గుడ్‌గాళ్ ఆర్ బ్యాడ్‌గాళ్?" అని అడిగాడు.

"గుడ్‌గాళ్‌ని" టక్కున చెప్పింది.

"అయితే, నన్ను వెళ్లనివ్వాలి. నీకెప్పటినుంచో వున్న కోరిక నెరవేరాలంటే.. నేను వెళ్లాలి. మనం సేఫ్‌గా చేరితేనే నువ్వు చక్కని, అందమైన భూమిని చూడగలుగుతావు!" అని బుజ్జగించాడు.

ఆ పిల్లకి ఎప్పటి నుంచో భూమిని చూడాలని కోరిక. అది చిన్న పిల్ల కాబట్టి తన కోరిక బయటపెట్టింది. వాస్తవానికి ఆ కోరిక వాళ్ల అమ్మానాన్నలది. అంతే కాదు, వాళ్ల అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలది కూడా!

500 సంవత్సరాల క్రితం అనేకమంది భారతీయులు ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం అమెరికా, ఆస్ట్రేలియా, చైనా, జపాన్, జర్మనీ లాంటి దేశాలకు వెళ్లినట్టే, సుమారు 400 ఏళ్ల క్రితం నుంచే గ్రహాంతర వాసం మొదలైంది. వీళ్ల కంటే ఎన్నో తరాల క్రితమే పలు దేశాలకు చెందిన అనేకమంది మానవులు, వివిధ గ్రహాలకు వెళ్లి వస్తూ విద్య, ఉద్యోగ, వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈ పిల్లల తాత, ముత్తాతల దగ్గర నుంచి అందరూ భూమి గురించి గొప్పగా చెప్పుకోవడం విన్నారు. కానీ, చూసే అవకాశం రాలేదు. అందుకే చిన్నపిల్ల అడిగిందనే వంకతో ఫ్యామిలీ అంతా భూమి మీదకు విహారయాత్రకు బయల్దేరారు.

ఇంతలో ఆ పిల్లాడు బయటకు వెళ్లేందుకు, సోలార్ ప్యానెల్ కట్ చేసేందుకు అవసరమైన సామాగ్రిని రోబో సిద్ధం చేసింది. అతడు వాటిని తీసుకుని షిప్ బయటకు వెళ్లబోతూ, తల్లిదండ్రులకు ఓ మాట చెబుదామని అనుకున్నాడు. కానీ, సిస్టమ్‌లో కమ్యూనికేషన్ కూడా బ్రేక్ అయ్యింది. చేసేది లేక తల్లిదండ్రులు ఉన్న గది ముందు నిశ్శబ్దంగా నిలబడి, గుండెల నిండా ఊపిరి పీల్చుకుని చెల్లెలు దగ్గరకు వచ్చాడు. అన్నయ్య నుదుటి మీద ముద్దు పెట్టి తడి కళ్లతో వీడ్కోలు పలికింది.

రోబో డోర్ తెరిచి పిల్లాడిని బయటకు పంపింది.

బయట అంతా శూన్యమే. కింద భూమి లేదు, పైన ఆకాశం లేదు. అంతులేని వేగంతో దూసుకుపోతోంది స్పేస్ షిప్. చేతులకు వేసుకున్న గ్లౌజుల్లో, కాలికి వేసుకున్న షూలలో వున్న మేగ్నెట్స్‌తో నిలదొక్కుకుంటూ షిప్ అంచు మీద నెమ్మదిగా పాకడం ప్రారంభించాడు.

కొంతసేపటికే తనకు ఊపిరి సరిగా ఆడటంలేదని గుర్తించాడు. కంగారు పడుతుండగా, తలకు వున్న హెల్మెట్‌లోని ఇయర్ ఫోన్‌లో రోబో వాయిస్ వినిపించింది.

"కంగారు పడొద్దు. నీ గుండె వేగాన్ని నియంత్రించు. కళ్ళు మూసుకుని ఒక్క క్షణం నువ్వు భూమి మీద ఉన్నట్టు ఊహించుకో. నీ కాళ్ల కింద పచ్చని, మెత్తని గడ్డి.. దాని మీద సూర్య కిరణాలు బంగారు రంగులో మెరుస్తున్నాయి. చెట్లలోని పక్షుల

కువకువలు వింటున్నావు. కొన్ని పక్షులు రెక్కలు విప్పి నీలి రంగు ఆకాశంలో హాయిగా గిరికీలు కొడుతున్నాయి. ఆ అందమైన ప్రపంచాన్ని నువ్వూ, నీ ఫ్యామిలీ అంతా చూడాలంటే ఇప్పుడు ధైర్యంగా పని పూర్తి చేయాలి" లలితమైన గొంతుతో రోబో కర్తవ్య బోధ చేసింది.

క్షణాల్లో తనను అదుపులోకి తెచ్చుకున్నాడు. నెమ్మదిగా సోలార్ ప్యానెల్ దగ్గరకు చేరుకున్నాడు. తన చేతిలోని లేజర్ టూల్‌తో దాన్ని కత్తిరించడం మొదలు పెట్టాడు. సమయం గడుస్తున్న కొద్దీ చేతులు వణుకుతున్నాయి. ధైర్యం సన్నగిల్లుతోంది.

స్పందనలను గుర్తించిన రోబో ఉత్తేజాన్నిచ్చే సంగీతాన్ని ప్లే చేయడం ప్రారంభించింది.

అమ్మానాన్నా, చెల్లెలు గుర్తుకు వచ్చారు. గుండె చిక్కబట్టుకున్నాడు. చేస్తున్న పని మీదే దృష్టి నిలిపాడు. కాసేపటికి ఆ సోలార్ ప్యానెల్ ముక్క తెగిపోయింది. అతడి ముఖంపై సంతోషంతో కూడిన చిరునవ్వు తాండవమాడింది.

ఉత్సాహంగా లోపలకు వచ్చాడు. చెల్లెలు చప్పట్లు కొడుతూ వచ్చి చేయందించింది. ఇంతలో ఇంటర్నల్ రేడియోలో తల్లిదండ్రుల గొంతు వినిపించింది.

"మేం కూడా బయటకు వస్తున్నాం" అని.

షిప్‌లో క్రమేపీ ఆక్సిజన్ లెవెల్స్ పెరిగాయి. కుటుంబమంతా ఒక దగ్గర చేరింది.

అందరూ తనను అభినందిస్తుంటే, "నేను ఆ పని ధైర్యంగా చేయడానికి కారణం మన రోబోనే!" అని చెప్పాడు. తల్లిదండ్రులు కూడా రోబో సమయస్ఫూర్తిని అభినందించారు.

ఆ పిల్లాడు ఉత్సాహంగా చూస్తూ "ఇందాక నువ్వు చెప్పిన భూమి గురించిన ఊహ చాలా బావుంది. మనం అక్కడికి వెళ్ళాక, నువ్వు కూడా మాతో గడ్డి మీద నడవాలి. నువ్వు కూడా ఆ మెత్తని స్పర్శను అనుభవించాలి. ఆ పక్షులు, నీలి రంగు ఆకాశం అన్నీ చూద్దువుగాని!" అన్నాడు సంతోషంతో ఊగిపోతూ.

రోబో ఏం మాట్లాడకుండా నిర్లిప్తంగా వుండిపోయింది.

"ఏమైంది? మాట్లాడవేం?" అని అడిగింది పాప రోబో చేతులు పట్టుకుని ఊపుతూ.

"సారీ.. పిల్లలూ. నాకు స్పర్శ తెలీదు" నెమ్మదిగా చెప్పింది రోబో.

వెంటనే తండ్రి కల్పించుకుని "ఇంతకాలం మేము కూడా ఒకరకంగా స్పర్శను కోల్పోయాం. ఇప్పుడు ఆ పురాతన స్పర్శను వెతుక్కుంటూనే వెళ్తున్నాం. భూమికి చేరుకునేలోగా, నీకు స్పర్శ తెలిసేలా కొత్త కోడ్ రాస్తా" అన్నాడు.

పిల్లలిద్దరూ రోబో చేతులు ఊపుతూ సంతోషంగా గంతులేసారు.

ఇనుప చేతులకు స్పర్శ తెలియకపోయినా దాని కళ్లలో కొత్త కాంతి ఏదో మెరిసింది.

సంతోషంతో రెట్టింపైన వేగంతో షిప్ భూమి వైపు దూసుకుపోతోంది.

అనన్యం

శ్రీను పైండ్ల
✆ 9394450105

ఆ కారుచీకట్లో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా విశ్వ.. పెదవులపై తొలిసారిగా చిన్న నవ్వు వెలిసింది. 'బయట ఉన్న ఆ విశాలమైన, కృత్రిమమైన శూన్యం కంటే... నా ఉనికిని, నా పేరును నేను బలంగా రాసిన ఈ ఇరుకు పెట్టెలోనే నాకు నిజమైన స్వేచ్ఛ దొరికింది' అనుకున్నాడు. ఆ క్షణం నుంచి విశ్వప్రసాద్ అనే వ్యక్తి ఈ భూమిపై కనిపించలేదు.

గడియారంలో సెకండ్ల ముల్లు చేసే 'టిక్... టిక్...' శబ్దం తప్ప ఆ గదిలో మరే అలికిడీ లేదు.

విశ్వప్రసాద్ కుర్చీలో స్థాణువులా కూర్చుని ఉన్నాడు. అతని ముందు టేబుల్‌పై ఉన్న కాఫీ కప్పులోంచి, ఆవిర్లు రావడం ఆగిపోయి అరగంట దాటింది. అది చల్లారిపోతోందన్న ధ్యాస అతనికి లేదు. గోడ మీద పాకుతున్న బల్లిని తదేకంగా చూస్తున్నాడు.

"ఒరేయ్... వయసొచ్చిన కొడుకువి! ఇంట్లో ఇలా పనికిమాలిన వాడిలా కూర్చుంటే ఎలాగరా? ఏదైనా ఉద్యోగం చూసుకోవచ్చు కదా!" హాల్లోంచి తండ్రి లక్ష్మీనారాయణ గొంతు చిరాగ్గా వినిపించింది. ఆ చిరాకు వెనుక ఉన్నది కోపం కాదు, ఎదిగిన కొడుకు జీవితం ఎక్కడ నాశనమైపోతుందోనని తల్లడిల్లే ప్రతీ తండ్రి గుండెకోత!

విశ్వలో ఎలాంటి చలనం లేదు. బల్లి పురుగును పట్టుకుంది. విశ్వ పెదవులపై సన్నని నవ్వు కూడా లేదు, అలాగని విషాదమూ లేదు. కేవలం నిర్లిప్తత!

"వాడిని అలా వదిలేయండి. ఎవరికీ ఏ హాని చేయకుండా తనలో తాను ఉంటున్నాడు కదా" వంటగదిలోంచి తల్లి పార్వతమ్మ సర్దిచెబుతున్న మాటలు!

విశ్వ చిన్నప్పటి నుంచీ అంతే! స్కూల్లో ఫస్ట్‌ర్యాంక్ వచ్చినా, ఆటల్లో ఓడిపోయినా అతని ముఖంలో ఒకే భావం. ఎవరైనా ఏడుస్తుంటే ఎందుకు ఏడుస్తున్నారో అర్థమయ్యేది కాదు. నవ్వులు వినపడితే ఆశ్చర్యంగా చూసేవాడు. ప్రేమిస్తున్నానని వచ్చిన అమ్మాయిని "నిన్ను ప్రేమిస్తే నాకు నేను దక్కకుండా పోతాను" అని సున్నితంగా వెనక్కి పంపేశాడు. ఎందుకంటే.. అతనికి బ్రతకడమంటే ఆసక్తి లేదు, చావాలన్న కోరికా లేదు. తానొక శూన్యం. రంగులన్నీ కలిస్తే మిగిలే తెలుపు కాదు... ఏ రంగూ అంటని పారదర్శకత!

ఆ రోజు పేపర్లో ఒక విచిత్రమైన ప్రకటన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని "డిపార్ట్‌మెంట్ ఆఫ్ నథింగ్నెస్" లో "ఆఫీసర్ ఆఫ్ ఎంప్టీనెస్" పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏమీ చేయకపోవడం దీనికి అర్హత అని!

లక్ష్మీనారాయణకు ఆ ప్రకటన చూడగానే కొడుకే గుర్తొచ్చాడు. వెంటనే అప్లై చేయించాడు. ఇంటర్వ్యూ లేదు. విచిత్రంగా, పది రోజుల్లో విశ్వప్రసాద్‌కు అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది! నెలకు... యాభై వేల జీతం! సకల సౌకర్యాలు! కొడుకు స్థిరపడ్డాడని తల్లిదండ్రులు మురిసిపోయారు.

ఏమీ చేయకపోవడాన్ని అధికారికంగా ఎలా చేస్తారో చూడాలన్న చిన్న కుతూహలం విశ్వను ఆ ఉద్యోగం వైపు నడిపించింది.

పాడుబడినట్టుగా ఉండే సిటీ సెంటర్ భవనం. ఏడో అంతస్తు. సెక్యూరిటీ చెక్కింగ్స్, కమాండోల పహారాల మధ్య విశ్వను ఒక గదిలోకి తీసుకెళ్లారు.

అదొక తెల్లని గది. శబ్దం లోపలికి రాదు. గాలికి వాసన లేదు. ఉష్ణోగ్రత ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. గది మధ్యలో ఒక కుర్చీ, టేబుల్! టేబుల్‌పై ఒక తెల్ల కాగితం, పెన్సిల్.

గాలిలో ఒక డిజిటల్ బోర్డ్ ప్రత్యక్షమైంది. అందులో అతని విధులు ఉన్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు కుర్చీలో కూర్చోవాలి. ఆలోచనలను కట్టడి చేయాలి. గోడ మీద ఉన్న గడియారాన్ని చూడకూడదు. చూసినా.. అదెప్పుడూ సమయాన్ని తప్పు తప్పుగానే చూపిస్తుంది. సాయంత్రం వెళ్ళేముందు, టేబుల్‌పై ఉన్న కాగితంపై ఎలాంటి రాతలు రాయకూడదు. సంతకాలు చేయకూడదు. గదిని విడిచి వెళ్లాలి.



మొదటి వారం విశ్వకు కొద్దిగా ఇబ్బంది అనిపించింది. తర్వాత అలవాటైపోయింది. అతను ఒక మైనపు బొమ్మలా, శ్వాస తీసుకునే శవంగా మారిపోయాడు. దానికి ప్రతిఫలంగా బ్యాంక్ అకౌంట్లో డబ్బులు పడుతున్నాయి. ఏమీ చేయకపోవడంలో అతను ప్రొఫెషనల్ అయ్యాడు. అతని అచలనానికి అధికారులు ముగ్ధులయ్యారు.

కానీ.. కాలం గడుస్తున్న కొద్దీ ఆ నిశ్శబ్దం బరువెక్కసాగింది. రోజూ అతను వెళ్లిపోయేసరికి ఆ తెల్ల కాగితం కింద ఎవరో అదృశ్య వ్యక్తి.. చిన్న "టిక్" మార్క్ పెడుతున్నాడు. తనను ఎవరో గమనిస్తున్నారన్న భావన! ఆ కృత్రిమ రిక్తిమ, తన లోపలి సహజ శూన్యాన్ని ప్రశ్నించడం మొదలుపెట్టింది.

ఆ రోజు ఉదయం 11 గంటలు!~

రోబో ఒక వాటర్‌బాటిల్ తెచ్చి టేబుల్‌పై పెట్టింది. ఆ బాటిల్ స్టీల్‌మూతలో విశ్వకు తన ముఖం అస్పష్టంగా కనిపించింది. గుబురు గడ్డం.. పీక్కుపోయిన కళ్లు.. అది తనేనా? తనకొక రూపం ఉందా? 'నేనెవరు?' అప్పటి వరకు నిద్రావస్థలో ఉన్న అతని మేధస్సులో ఒక చిన్న అల! గదిలో తన ఉనికి.. తన శ్వాస.. అతనికి మొదటిసారిగా వినిపించింది. టేబుల్‌పై ఉన్న తెల్ల కాగితం అతన్ని వెక్కిరిస్తున్నట్టు అనిపించింది.

సాయంత్రం ఐదు గంటలు. డ్యూటీ అయిపోయిందని సూచిస్తూ బ్లూ లైట్ వెలిగింది. లేచి వెళ్లిపోవాలి. కానీ.. విశ్వ కాళ్లు కదల్లేదు. తన అస్తిత్వాన్ని ఎవరో లాగేసుకుంటున్నారన్న భయం తొలిసారి అతన్ని కమ్మేసింది. తన చేతులు వాటంతట అవే పెన్సిల్ తీసుకున్నాయి. వణుకుతున్న వేళ్లతో ఆ తెల్ల కాగితంపై రాయడం ప్రారంభించాడు. "నేను ఉన్నాను. నా పేరు విశ్వప్రసాద్" పెన్సిల్ కింద పెట్టాడు. దీర్ఘశ్వాస తీసుకున్నాడు. తొలిసారి బతికిన ఫీలింగ్. క్షణాల్లో గదిలోని లైట్లు ఎర్రగా మారాయి. భీకరమైన సైరన్ మోతలు. తలుపులు బద్దలు కొట్టుకుని ఆర్మీ కమాండోలు లోపలికి వచ్చారు.

"హ్యాండ్స్ అప్! డోంట్ మూవ్!"

వాళ్ల చేతుల్లోని తుపాకులు విశ్వను గురి చూస్తున్నాయి. వింగ్ హెడ్ "మిస్టర్ కే" పరుగెత్తుకుంటూ వచ్చి, "ఏం చేశావ్‌రా? ఏం చేశావ్?" అంటూ విశ్వను నెట్టేశాడు.

"నేను.. నేను.. నా పేరు రాశాను. అంతే కదా!" విశ్వ గొంతులో గందరగోళం.

"ప్రోటోకాల్ బ్రేక్ చేశావ్! సిస్టం క్రాష్ అయిపోయింది! నిన్ను నువ్వు గుర్తుంచుకోవడం ఈ డిపార్ట్‌మెంట్ నిబంధనలకు విరుద్ధం!" అని అరుస్తూ కమాండోలకు సైగ చేశాడు. విశ్వను ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు.

విచారణ గది.. ఎదురుగా క్లినికల్ సైకియాట్రిస్ట్!

"మిస్టర్ విశ్వప్రసాద్.. మీరు ఎందుకు అలా చేశారు? శూన్యంలో ఉనికిని వెతకడం నేరం అని మీకు తెలియదా?" అన్నాడు డాక్టర్.

"కానీ, నేను ఒక మనిషిని! నా ఉనికిని నేను ఎలా చెరిపేసుకోగలను?" విశ్వ తొలిసారిగా ఎదురు ప్రశ్నించాడు.

డాక్టర్ నవ్వాడు. "అదే మీ తప్పు. మీరు మనిషి కాదు. ఈ యాంత్రిక సమూహంలో ఉనికి కోల్పోయిన ఒక చిన్న సాధనం మాత్రమే. గుంపులో కలిసిపోకుండా, నీకంటూ స్వతంత్ర ఆలోచనలు ఉండటం ఈ సిస్టమ్‌కి ఎప్పటికీ ప్రమాదకరమే. వ్యవస్థ నడవాలంటే ప్రశ్నించని సగటు మనుషులే కావాలి కానీ, సొంత గుర్తింపు ఉన్న వ్యక్తులు కాదు. అందుకే, నిన్ను నువ్వు తెలుసుకోవడానికి ప్రయత్నించడమే ఇక్కడ అతిపెద్ద నేరం!" అని క్రూరంగా అన్నాడు.

"నాకు బ్రతకడం మీద ఆశ లేదు, చావాలన్న భయమూ లేదు. నాలో ఉన్నది శూన్యమే కావచ్చు.. కానీ నేను ఉన్నాననే ఆ కనీస స్పృహ నాకుంది. నా ఉనికిని పూర్తిగా చెరిపేసి, నన్నొక ప్రాణం లేని యంత్రంగా వాడేసుకోవడం అమానుషం కాదా?" విశ్వ గొంతులో తొలిసారి తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే అంతర్గత సంఘర్షణ!

డాక్టర్ నిర్దాక్షిణ్యంగా.. "అమానుషం కాదు, అదే ఈ ఆధునిక వ్యవస్థకు కావల్సింది. జీన్ పాల్ సార్త్రే అస్తిత్వవాదం పుస్తకాల్లో చదువుకోవడానికి బాగుంటుంది కానీ, ఈ ప్రాక్టికల్ సిస్టమ్‌లో కాదు. ఇక్కడ మనిషికి సొంత స్పృహ ఉండకూడదు! కేవలం వ్యవస్థను నడిపించే ఒక పనిముట్టుగా మాత్రమే మిగిలిపోవాలి. నీ శూన్యానికి నువ్వే యజమానివి అనుకోవడం నీ ఆత్మగౌరవం కావచ్చు, కానీ ఈ సిస్టమ్ దృష్టిలో అది ఒక వైరస్! బ్రతకాలంటే ఈ యంత్రంలో ఒక అరిగిపోయిన చక్రంలా సైలెంట్‌గా తిరిగిపోవాలి. ఉనికిని వెతికితే... ఇలాగే దాన్ని శాశ్వతంగా కోల్పోవాలి."

ఇద్దరు జవాన్లు వచ్చి విశ్వను మరో చీకటి గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ ఒక పెద్ద మెటల్ బాక్స్ ఉంది. దాని మీద "మిమ్మల్ని మీరు మర్చిపోయి ఇందులో ప్రవేశించండి" అని రాసి ఉంది. విశ్వను అందులోకి తోసి, మూత బిగించేశారు.

ఆ కారుచీకట్లో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా విశ్వ.. పెదవులపై తొలిసారిగా చిన్న నవ్వు వెలిసింది. 'బయట ఉన్న ఆ విశాలమైన, కృత్రిమమైన శూన్యం కంటే... నా ఉనికిని, నా పేరును నేను బలంగా రాసిన ఈ ఇరుకు పెట్టెలోనే నాకు నిజమైన స్వేచ్ఛ దొరికింది' అనుకున్నాడు. ఆ క్షణం నుంచి విశ్వప్రసాద్ అనే వ్యక్తి ఈ భూమిపై కనిపించలేదు.

మూడు రోజుల తర్వాత...

టీవీలో బ్రేకింగ్ న్యూస్. "డిపార్ట్‌మెంట్ ఆఫ్ నథింగ్నెస్" లో నిష్కళంక సేవలు అందించిన ఆఫీసర్ విశ్వప్రసాద్‌కు దేశ అత్యున్నత పురస్కారం "అఖిల భారత శూన్య చక్ర' ప్రదానం!"

ఆ ప్రకటన రాగానే లక్ష్మీనారాయణ ఇల్లు బంధువులతో కిటకిటలాడుతోంది. కొడుకు ఏమయ్యాడన్న ఆందోళన, అతన్ని వెతకాలన్న తపన ఆ నిమిషమే గాలికి కొట్టుకుపోయాయి. పోలీసు స్టేషన్ చుట్టూ తిరగడం మానేశాడు.

"మా వాడు ఏమీ చేయకుండానే దేశంలోనే గొప్పవాడయ్యాడు" అని తండ్రి గర్వంగా చెబుతున్నాడు. తల్లి పార్వతమ్మ ఆనందభాష్పాలు రాలుస్తోంది. ఒకప్పుడు అతన్ని తిరస్కరించిన ధనలక్ష్మి, "ఇంతటి గొప్పవాడికి భార్య కాలేకపోయాను" అని ఏడుస్తోంది.

అవార్డు ఎవరు తీసుకున్నవారూ... విశ్వ ఎక్కడున్నాడో ఎవరికీ పట్టలేదు! వారికి కేవలం కావల్సింది ఆ "హోదా" మాత్రమే..

ఆ మరుసటి రోజు..

"డిపార్ట్‌మెంట్ ఆఫ్ నథింగ్నెస్" లోని ఆ తెల్లటి గదిలో ఇంకొక యువకుడు కుర్చీలో వచ్చి కూర్చున్నాడు. అతని పేరు ఫైల్‌లో "విశ్వప్రసాద్–2" అని రాసి ఉంది.

రోబో వచ్చి అతనికి మంచి నీళ్ల బాటిల్ ఇచ్చి, టేబుల్‌పై ఒక కొత్త తెల్ల కాగితం, ఒక పెన్సిల్ ఉంచి వెళ్లిపోయింది. వ్యవస్థ మనుషుల అస్తిత్వాన్ని లాగేసుకునే వేట మళ్ళీ నిశ్శబ్దంగా మొదలైంది.

వ్యక్తులు మారుతారు, శూన్యం అలాగే ఉంటుంది. సిస్టం నడుస్తూనే ఉంటుంది! తనకు తాను 'అనన్యం' అనుకునే ప్రతి మనిషీ, ఈ వ్యవస్థ దృష్టిలో భర్తీ చేయదగిన ఒక అంకె మాత్రమే! అనన్యం.. అంకెగా మిగిలిన అస్తిత్వం!

ఉనికి

ఎం కె కుమార్
✆ 9948125268

"నేను రేపు ఎక్కడికీ వెళ్లను రాఘవా. ఇంట్లోనే ఉంటాను. వాళ్ళు వస్తే వాళ్లకు టీ ఇస్తాను. కానీ నా చేతికి గాజులు వేసుకోను. నా బుల్లెట్ గాయం వాళ్ళకు కనిపిస్తుంది. వాళ్ళు నా పాత కాటన్ చీరను, నా ముతక చేతులను చూసి భయపడితే, అది వాళ్ళ సమస్య. నేను బతకడం కోసం చేసిన పోరాటాన్ని, నా గతాన్ని చూసి నువ్వు సిగ్గుపడొచ్చు... కానీ నేను సిగ్గుపడను. నేను ఒక కాంట్రాక్టర్ భార్యను కావచ్చు, కానీ అంతకంటే ముందు నేను కామ్రేడ్ సారక్కను,"

బయట సన్నగా, విసుగు పుట్టించేలా ఏకధాటిగా చినుకులు పడుతున్నాయి. కిటికీ అద్దాలపై నిలచిన నీటి బిందువుల గుండా చూస్తే, సుదూరంగా మసకబారిన శేషాచలం కొండలు ఒకప్పటి జ్ఞాపకంలా.. ఎప్పటికీ చేరుకోలేని మరో ప్రపంచంలా కనిపిస్తున్నాయి.

అపార్ట్‌మెంట్ లోని నాలుగో అంతస్తు బాల్కనీలో నిలబడిన భారతి చేతిలో చల్లారిపోతున్న టీ కప్పు ఉంది. కింద కాంక్రీట్ రోడ్డు మీద రంగురంగుల గొడుగులు వేసుకుని యంత్రాల్లా వేగంగా నడిచి వెళుతున్న మనుషులు, ట్రాఫిక్ హారన్ల కర్కశ శబ్దాలు... ఇదంతా ఆమెకు పదేళ్ల తర్వాత కూడా ఇంకా అలవాటు పడని ఒక కొత్త అరణ్యంలానే అనిపిస్తోంది.

లోపలి గదిలోంచి భర్త రాఘవ గొంతు వినిపిస్తోంది. అతను ఫోన్లో ఎవరితోనో గట్టిగా, అధికార స్వరంతో మాట్లాడుతున్నాడు.

"ఆ కాంట్రాక్ట్ మనకే రావాలి రెడ్డి గారూ... వాళ్లకి ఎంత పర్సంటేజ్ ఇవ్వాలో నాకు తెలుసు లెండి, మీరు పేపర్లు రెడీ చేయండి" అంటూ ఇంగ్లీషు, తెలుగు కలిపి మాట్లాడుతున్నాడు.

ఆ గొంతులోని ఆత్మవిశ్వాసం, ఆ కరెన్సీ నోట్ల భాష, ఆ రాజీపడే తత్వం భారతికి ఏమాత్రం అర్థం కావు. ఆ గదిలోకి వెళ్లాలంటేనే ఆమెకు ఒక తెలియని సంకోచం, అసహ్యం.

భారతి ఒకప్పుడు కామ్రేడ్ సారక్క. నల్లమల, శేషాచలం అడవుల్లో రెండు దశాబ్దాల పాటు తుపాకీ పట్టి తిరిగిన దళ కమాండర్. రాఘవ ఆమె దళంలోనే పనిచేసిన సహచరుడు, కామ్రేడ్ రణధీర్. అప్పట్లో ఇద్దరూ సమానులే! ఇద్దరికీ ఒకే ఆకలి, ఒకే ఆశయం, ఒకే ప్రాణభయం, ఒంటి మీద ఒకే ఆకుపచ్చని యూనిఫామ్.

కానీ ఇప్పుడు... ఈ డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లో భారతి కేవలం ఒక 'లొంగిపోయిన నక్సలైట్'. దానికి మించి, ప్రధాన స్రవంతిలో కలిసిపోయిన ఒక డబ్బున్న కాంట్రాక్టర్‌కు 'సాధారణ భార్య'.

ప్రభుత్వ పునరావాస పథకం కింద దొరికిన సహాయం, పాత పరిచయాలతో రాఘవ మొదలుపెట్టిన వ్యాపారం వారి భౌతిక

అవసరాలను, దారిద్ర్యాన్ని తీర్చాయి కానీ, భారతి అస్తిత్వాన్ని మాత్రం ఎప్పుడో చంపేశాయి.

భారతి వంటగదిలోకి నడిచింది. టీ కప్పును సింక్‌లో పెట్టి, కూరగాయలు తరగడం మొదలుపెట్టింది. పదునైన కత్తి ఆమె చేతిలో చాలా నెమ్మదిగా కదులుతోంది.

ఆమె చేతులు ముతకగా, ఎన్నో ఏళ్ల అటవీ జీవితం మిగిల్చిన పగుళ్లతో ఉన్నాయి. ఎడమ చేతి మణికట్టు దగ్గర ఒక పెద్ద బుల్లెట్ గాయం తాలూకు మచ్చ స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు ఏకే–47 రైఫిల్‌ను అలవోకగా పేల్చిన ఆ వేళ్లు, ఇప్పుడు ఉల్లిపాయను కోయడానికి యాంత్రికంగా కదులుతున్నాయి.
కారణం వయసు పైబడటం కాదు, తనలో రగులుతున్న తీవ్రమైన మానసిక సంఘర్షణ, ఈ నాలుగు గోడల మధ్య ఆవిరైపోతున్న తన ఉనికి!



పదేళ్ల క్రితం వారు అడవిని వదిలి, పోలీసుల ముందు లొంగిపోవడానికి కారణం... "అందరిలా బతకాలి, ప్రశాంతమైన జీవితం గడపాలి" అని రాఘవ చేసిన గొడవ!

సిద్ధాంతాల మీద రాఘవకు నమ్మకం సడలిపోయింది. వయసు మీద పడుతున్న సమయంలో సురక్షితమైన భవిష్యత్తు కోసం, అడవిని వదిలి ప్రధాన స్రవంతిలోకి వలస వద్దామని అతనే ఒప్పించాడు.

ఆ ప్రయాణం ఇథియోపియా ఎడారుల గుండా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఇజ్రాయెల్ చేరిన ఒక నల్లజాతి శరణార్థి ప్రయాణం లాంటిదే! పాత జీవితాన్ని, నమ్మకాలను వదిలేసి, ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టడం!

కానీ ఆమె ఎన్నో కలలతో అడుగుపెట్టిన ఈ "నాగరిక" సమాజం ఆమెను అక్కున చేర్చుకోలేదు. ఇక్కడ అంతా వ్యాపారమే.

రాఘవ ఈ కాంక్రీట్ అరణ్యపు చట్టాలను చాలా వేగంగా నేర్చుకున్నాడు.

అతను పాత కామ్రేడ్ రణధీర్ ముసుగును తీసేసి, ఆధునిక పితృస్వామ్య సమాజంలో ఒక యజమానిలా మారిపోయాడు. ఖరీదైన చొక్కాలు వేసుకుని, పార్టీలకు వెళుతూ, ఆ వ్యవస్థలో పూర్తిగా కలిసిపోయాడు.

కానీ భారతి అలా మారలేకపోయింది. ఆమె మనసు ఇంకా ఆ అడవిలోని నిజాయితీ దగ్గరే ఆగిపోయింది.

సమాజం, ఈ కొత్త వ్యవస్థ ఆమె నుండి ఎప్పుడూ ఒక 'కృతజ్ఞత'ను ఆశించింది. ప్రభుత్వం చూపిన జాలికి తలవంచుకుని, 'కృతజ్ఞత గల శరణార్థి' లాగా ఆమె బతకాలి. గతంలో జరిగిన దానికి పశ్చాత్తాపపడుతూ ఒక మూల పడి ఉండాలి.

రాఘవ కూడా సరిగ్గా అదే కోరుకుంటున్నాడు. అడవిలో ఉన్నప్పుడు భారతి ఆలోచనలు దళంలో తీవ్రమైన చర్చను లేపేవి. ఆమె కనుబొమ్మ ముడిపడితే రాఘవతో సహా అందరూ మౌనంగా ఉండేవారు. ఎందుకంటే ఆమె అంచనాలకు చాలా విలువ ఉండేది.

ఆనాటి ఆమె 'నిశ్శబ్ద అధికారం' ఇప్పుడు ఈ ఇంటి నాలుగు గోడల మధ్య పూర్తిగా అదృశ్యమైపోయింది. ఇప్పుడు ఆమె వంట గదికే పరిమితమైన ఒక సాధారణ గృహిణి మాత్రమే.

అడుగుల చప్పుడు వినిపించింది. ఫోన్ మాట్లాడటం ముగించిన రాఘవ వంటగది గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

"భారతీ... రేపు రాత్రి మన ఇంటికి ఇద్దరు ముఖ్యులు వస్తున్నారు. రేపు ఫైనల్ అయ్యే కాంట్రాక్ట్ చాలా పెద్దది. మన భవిష్యత్తును మార్చేసేది!" అన్నాడు రాఘవ. అతని గొంతులో ఒక విధమైన ఆందోళన, హెచ్చరిక ఉన్నాయి.

భారతి ఉల్లిపాయలు కోయడం ఆపకుండానే, "సరే, భోజనానికి ఏమేం వండాలో చెప్పు, తెప్పిస్తాను" అని నెమ్మదిగా అంది.

"భోజనం గురించి కాదు భారతీ..." రాఘవ కొద్దిగా తడబడ్డాడు.

"రేపు వాళ్లొచ్చినప్పుడు... నువ్వు ఆ పాత కాటన్ చీరలు కట్టుకుని రావద్దు. నేను మొన్న తెచ్చిన పట్టుచీర కట్టుకో. ముఖానికి కాస్త పౌడర్ రాసుకో. వీలైతే, చేతికి నిండుగా గాజులు వేసుకో.. ఆ బుల్లెట్ మచ్చ కనిపించకుండా!"

భారతి చేతిలోని కత్తి ఆగిపోయింది. గదిలో నిశ్శబ్దం ఆవరించింది. కేవలం ప్రెషర్ కుక్కర్ లోంచి వస్తున్న సన్నటి ఆవిరి శబ్దం మాత్రమే ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తోంది.

"ఎందుకు? వాళ్ళు నా చేతి గాయాన్ని చూస్తే నీకు కాంట్రాక్ట్ ఇవ్వరా?" అని అడిగింది భారతి. ఆమె గొంతులో కోపం లేదు, కానీ భరించలేని ఒక పదునైన వ్యంగ్యం ఉంది.

"అర్థం చేసుకో భారతీ... వాళ్ళ ప్రపంచం వేరు. మనం ఇప్పుడు వాళ్ళతో కలిసి నడవాలి. నువ్వు ఇంకా ఆ అడవి మనిషిలాగా, కరుకుగా ఉంటే వాళ్ళకు తప్పుగా అనిపిస్తుంది. మన గతాల గురించి, ఆ తుపాకి పోరాటాల గురించి వాళ్ళ దగ్గర ప్రస్తావించకు! నేనేదో కష్టపడి పైకొచ్చిన ఒక సాధారణ బిజినెస్ మ్యాన్ అని మాత్రమే వాళ్ళకు తెలుసు. నా భార్య ఒక సాధారణ, మర్యాదస్తురాలైన గృహిణి అని వాళ్ళు అనుకోవాలి. ప్లీజ్... రేపు ఒక్కరోజు కాస్త అడ్జస్ట్ అవ్వు!" రాఘవ మాటలు ఒక భర్త చేస్తున్న అభ్యర్థనలా లేవు, ఒక యజమాని ఇస్తున్న ఆదేశంలా ఉన్నాయి.

ఆ క్షణంలో భారతి గుండెలో ఏదో సన్నటి నరం తెగినట్టయింది. ఇది ఈ రోజు కొత్తగా జరిగిన విషయం కాదు. రాఘవ తన

పాత జీవితాన్ని, తన గుర్తింపును పూర్తిగా తుడిచేయాలని చూస్తున్నాడు.

అతనికి ఇప్పుడు తను ఒక భారం, ఒక సామాజిక అవమానం. ఇజ్రాయెల్‌లో అడుగుపెట్టిన ఇథియోపియన్ తల్లి తన పాత సంప్రదాయాలను చూసి తమ పిల్లలే సిగ్గుపడుతున్నప్పుడు ఎలాంటి వేదన అనుభవిస్తుందో, సరిగ్గా అలాంటి మానసిక క్షోభనే భారతి ఇప్పుడు అనుభవిస్తోంది.

ఒకప్పుడు ఇద్దరూ కలిసి వ్యవస్థపై పోరాడారు. ఇద్దరి మీదా పోలీసుల బుల్లెట్లు పడ్డాయి. కానీ, ఈ నాగరిక సమాజంలోకి రాగానే రాఘవ ఒక 'మగాడిగా' తన స్థానాన్ని వెతుక్కున్నాడు.

పితృస్వామ్యపు నీడలో అతను అధికారంలోకి వచ్చేశాడు. కానీ భారతికి మాత్రం ఈ సమాజం కేవలం వంటగదిని, అణచివేతను బహుమతిగా ఇచ్చింది.

తన సొంత భర్త దృష్టిలో ఇప్పుడు తను బయట వాళ్లకు చూపించడానికి సిగ్గుపడే ఒక మరకలాగా మారిపోయింది. తన ఆత్మగౌరవాన్ని, తన త్యాగాలను ఒక కాంట్రాక్ట్ కోసం దాచేయమంటున్నాడు రాఘవ.

బయట వర్షం ఆగిపోయింది. వీధి దీపాల వెలుతురు తడిసిన రోడ్డు మీద పడి ప్రతిఫలిస్తోంది.

భారతి లోపల ఒకప్పుడు కట్టలు తెంచుకునే ఆవేశం ఉండేది. ఒక అన్యాయం జరిగితే తుపాకీ ఎత్తాలనే వేగం ఉండేది. కానీ ఇప్పుడు ఆ కోపం అంతా ఒక చల్లటి, నిస్సహాయమైన మంచు గడ్డలా మారిపోయింది.

'నేను ఎవరి కోసం నా యవ్వనాన్ని, నా ఆశయాలను, నా అడవిని త్యాగం చేసి ఈ కాంక్రీట్ జైల్లోకి వచ్చానో... ఆ త్యాగం తాలూకు విలువ ఈ కొత్త ప్రపంచానికి అవసరం లేదు. నేను బతికి ఉండగానే నా అస్తిత్వాన్ని చంపేస్తున్నారు' అనుకుంది.

కానీ భారతి కళ్ళలో నీళ్లు రాలేదు. ఆమె ఒక సామాన్యమైన, రాజీపడిపోయిన, భర్త అడుగులకు మడుగులొత్తే గృహిణి కాదు. ఆమెలో ఆనాటి పోరాటపు మూలాలు ఇంకా బతికే ఉన్నాయి.

వల వేసి పట్టుకుని బోనులో బంధించినంత మాత్రాన పులి సాధు జంతువు అయిపోదు. సమాజం తనను అణగదొక్కాలని చూసినా, తన జీవిత భాగస్వామే తనను ఇరేజ్ చేయాలని చూసినా, ఆమె తలవంచకూడదని నిశ్చయించుకుంది.

రాఘవ ఇంకా అక్కడే నిలబడి ఉన్నాడు, ఆమె జవాబు కోసం ఎదురుచూస్తూ!

భారతి నెమ్మదిగా అతని వైపు తిరిగింది. ఆమె చూపు చాలా ప్రశాంతంగా ఉంది. ఆ చూపులో ఒకప్పుడు దళాన్ని నడిపించిన కమాండర్ గాంభీర్యం ఉంది.

"నేను రేపు ఎక్కడికీ వెళ్లను రాఘవా. ఈ ఇంట్లోనే ఉంటాను. వాళ్ళు వస్తే వాళ్లకు టీ ఇస్తాను. కానీ నా చేతికి గాజులు వేసుకోను. నా బులెట్ గాయం వాళ్ళకు కనిపిస్తుంది. వాళ్ళు నా పాత కాటన్ చీరను, నా ముతక చేతులను చూసి భయపడితే, అది వాళ్ళ సమస్య. నేను బతకడం కోసం చేసిన పోరాటాన్ని, నా గతాన్ని చూసి నువ్వు సిగ్గుపడొచ్చు... కానీ నేను సిగ్గుపడను. నేను ఒక కాంట్రాక్టర్ భార్యను కావచ్చు, కానీ అంతకంటే ముందు నేను కామ్రేడ్ సారక్కను," భారతి గొంతులో ఎటువంటి ఆవేశం లేదు, అరుపు లేదు. కేవలం ఒక పదునైన, కొండంత స్పష్టత ఉంది.

రాఘవ ఆశ్చర్యంగా ఆమె వైపు చూశాడు. ఇన్నాళ్లూ తన మాటలకు తలవంచుకుని, వంటగదికే పరిమితమైన భార్య, పదేళ్ల

తర్వాత మొదటిసారిగా ఒక అదృశ్యమైన, దాటలేని గీత గీసింది.

ఆ గీతను దాటే ధైర్యం, ఆమె కళ్లలోని ఆ పాత కమాండర్‌ను ఎదుర్కునే ధైర్యం ఆ ఆధునిక వ్యాపారవేత్తకు లేకపోయింది.

వాతావరణం అకస్మాత్తుగా బరువెక్కింది. అతను ఏమీ మాట్లాడలేక, తల దించుకుని నెమ్మదిగా హాల్ లోకి వెళ్ళిపోయాడు.

భారతి మళ్లీ కూరగాయలు తరగడం మొదలుపెట్టింది. గోడ గడియారం టిక్ టిక్ మంటూ శబ్దం చేస్తూనే ఉంది. రేపు ఉదయం మళ్ళీ ఆకాశం మేఘావృతమై ఉంటుంది, మళ్ళీ రోజువారీ పనులు మొదలవుతాయి.

జీవితంలో ఏ పెద్ద నాటకీయమైన ముగింపులూ ఉండవు. కేవలం మన ఉనికిని మనం కాపాడుకోవడానికి ప్రతిరోజూ చేసే నిశ్శబ్ద సమరాలే ఉంటాయి.

భారతికి తెలుసు, రేపటి నుంచి ఈ ఇంట్లో అన్నీ మునుపటిలాగే ఉన్నా, తన అంతరంగంలో మాత్రం తను పితృస్వామ్యం పై సాధించిన ఒక చిన్న, నిశ్శబ్దమైన విజయం ఎప్పటికీ మిగిలిపోతుందని.

ఆమె పెదవులపై సన్నటి చిరునవ్వు వికసించింది. బయట మళ్లీ వర్షం మొదలైంది.

సమస్య-పరిష్కారం

కొయిలాడ రామ్మోహన్ రావు
✆ 9849345060

'ఆమె హైదరాబాద్‌లో క్యాన్సర్ హాస్పిటల్లో ఉంది. ఇంతవరకు మా పిల్లలకు ఆ విషయం తెలియకుండా దాచి ఉంచాను. కానీ మరణానికి చేరువలో ఉన్న నా భార్య, పిల్లలను చూడాలని గొడవ చేస్తే, తప్పక వాళ్ళ అమ్మను చూపించాను. ఒళ్లంతా ఎక్కడ పడితే అక్కడ గొట్టాలతో, చిక్కి శల్యం అయిపోయి, కీమో థెరపీ వల్ల జుట్టు అంతా రాలిపోయిన నా భార్యను చూసి, నా పిల్లలు తట్టుకోలేకపోయారు.

"అబ్బబ్బ! ఈ పిల్ల రాక్షసులు తినేస్తున్నారు. ట్రైన్ ఎక్కిన దగ్గర్నుంచి గోలే! గోలైనా బాగుండును. పెద్దగా అరుపులు, కేకలు, ఏడుపులు. నరకం చూపిస్తున్నారు. మీరు కాస్త అటు వెళ్లి ఆ గోల ఆపమని వాళ్ళ అమ్మా నాన్నలకు చెప్పండి. మన చంటిది నిద్రపోలేక పోతుంది. వాళ్ల గోలతో పాటు దీని ఏడుపు భరించలేకపోతున్నాను. అయినా ... ఇందాకటి నుంచి చూస్తున్నాను, మీరే పూనుకొని ఏదైనా చేస్తారని" అంటూ పోరు పెట్టడం మొదలు పెట్టింది, శ్రావణి.

"మెల్లగా మాట్లాడు. వాళ్లకు వినిపిస్తుంది" చిన్నగా కసిరాడు ఆమె భర్త ఆనంద్.

"ఏదో ఒకటి చేయడం మానేసి, నన్నే అంటారు! ఇదే మీతో వచ్చిన తంటా. అన్నిటికీ మీకు మొహమాటమే. ఎవరైనా ఏమైనా అనుకుంటారని ముందు మీరే ముడుచుకుపోతారు. మీలాంటి వాళ్లతో వేగడం కష్టం" అని నిష్టూరంగా అనేసరికి,

"సరే. సరే. ఏదో ఒకటి చేద్దాంలే. మనం ఇంకా నయం, ఇటు పక్కన ఉన్నాము. అక్కడున్న వాళ్ళ పరిస్థితి ఎలా ఉందో.. ఏమిటో పాపం?" అంటూ పక్క భాగానికి వెళ్లడానికి లేచి నిలబడ్డాడు. అదే సమయానికి ఆ భాగంలో సైడ్ బెర్త్ మీద కూర్చున్న వ్యక్తి పైకి లేచి, ఆనంద్ వైపు రాసాడు. అతను బాత్రూంకి వెళ్లే పనిలో ఉన్నాడని ఆనంద్‌కి అర్థమయింది. అతని ఆపి,


"క్షమించండి సార్, ఇలా ఆపుతున్నందుకు. మిమ్మల్ని ఒక మాట అడగాలని అనుకుంటున్నాను!" అని అన్నాడు అభ్యర్థనగా!

"చెప్పండి సార్. దేని గురించి?"

"ఆ పిల్లలు చేసే గోల ఇక్కడున్న మేమే భరించలేకపోతుంటే, మీరంతా ఎలా భరిస్తున్నారు?"

"అదా విషయం? ఆ నరకాన్ని కాసేపైనా తప్పించుకుందామని డోర్ దాకా వెళ్దామని బయలుదేరాను" అంటుండగా, ఆనంద్‌కి ఎదురు సీట్లో కూర్చున్న ముసలాయన లేచి వాళ్ళిద్దరి దగ్గరికి వచ్చాడు.

"నా బాధ కూడా మీతో పంచుకుందామని వచ్చాను. మా ఆవిడకు రెండు నెలల క్రితం హార్ట్ ఆపరేషన్ అయింది. ఆమె ఈ గోల భరించలేక పోతుంది. గుండె నెప్పి తిరగబడుతుందేమోనని భయపడుతున్నాను!" అన్నాడు వణికే గొంతుతో.



ఆ తర్వాత ఆ ముగ్గురు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ఆ ముసలాయన పేరు రాఘవ. అతని భార్య పేరు కల్యాణి. అవతల నుంచి వచ్చిన వ్యక్తి, హరి. అతను చెప్పడం మొదలుపెట్టాడు.

"మీరన్నట్లు మా పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అక్కడ ఉన్న ఎనిమిది బెర్త్ లలో ఆ పిల్లలవి రెండు, తండ్రిది ఒకటి. వాళ్లు ముగ్గురు కాకుండా నాతో కలిసి ఐదుగురం ఆ ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నాం. మీరు మధ్యలో ఎక్కారు కాబోలు, కొంత భాగాన్ని మాత్రమే చూస్తున్నారు. మేము బండి బయలుదేరిన దగ్గర్నుంచి ఆ నరకాన్ని భరిస్తూ వస్తున్నాము. మీరు అక్కడి పరిస్థితి ప్రత్యక్షంగా చూసినట్లు లేదు. నా వెనుక మెల్లగా రండి, అటు వైపు వెళ్దాం. అలా వెళ్తూ అక్కడ పరిస్థితిని చూద్దురు గాని!" అంటూ ఆ వైపు నడిచాడు హరి.

ఆనంద్, రాఘవ అతన్ని అనుసరిస్తూ మెల్లగా అడుగులు వేస్తూ, ప్రక్క భాగాన్ని పరికించి చూడసాగారు. సెల్ ఫోన్ కోసం ఆ పిల్లలిద్దరూ పోట్లాడుకుంటూ పెద్దగా కేకలు వేస్తూ, ఒకరినొకరు తోసుకుంటూ, పక్క ప్రయాణికుల మీద పడుతూ, వాళ్ల చేత తిట్లు తింటున్నారు. తండ్రి మాత్రం చోద్యం చూస్తున్నట్లుగా కూర్చున్నాడే తప్ప, గొడవ ఆపే ప్రయత్నం చేయడం గానీ, వాళ్ళని మందలించే ప్రయత్నం గానీ చేయడం లేదు.

కాస్త దూరం వెళ్ళాక అడిగాడు ఆనంద్,

"ఏమిటి సార్? వాళ్ళ నాన్నేమిటి అలాగే కూర్చుని ఉండిపోయాడు బెల్లం కొట్టిన రాయిలాగ. మరీ చోద్యంగా ఉందే!" అంటూ.

"కొత్తగా చూస్తున్నారు కదా? మీకు అలాగే ఉంటుంది. మాకు అలవాటు అయిపోయింది" పేలవంగా నవ్వాడు హరి.

"అలా ఊరుకుంటారేమిటి? పదండి వెళ్లి కడిగేద్దాం. అందరం కలిసి గట్టిగా అడిగితే ప్రయోజనం ఉంటుంది" రాఘవ కోపంగా అన్నాడు.

"అదీ అయ్యింది, రెండుసార్లు" అన్నాడు హరి,

"అవునా! మరి దానికీ ఆయన స్పందించలేదా?" ఆనంద్ అడిగాడు ఆశ్చర్యపోతూ.

"స్పందించాడు. వాళ్ల మీద కోపంగా అరిచాడు. పది నిమిషాల పాటు సైలెంట్ గా ఉండడం మళ్ళీ గొడవలు మొదలుబెట్టేవారు. వాళ్లతో ఎలా వేగాలో అర్థం కావడం లేదు?" అన్నాడు హరి.

"నాతో రండి. నేను చూసుకుంటాను. నాకు కాస్త సపోర్ట్ చేయండి చాలు. వయసులో పెద్దవాడిని కదా? గట్టిగా అడిగే ధైర్యం, అర్హత నాకున్నాయి" అంటూ రాఘవ రెచ్చిపోయాడు.

ఆ మాటకు తలూపుతూ "అక్కడున్న వాళ్లంతా మన వైపే ఉంటారు. ఈసారి వార్నింగ్ కాస్త ఘాటుగా ఇద్దాం" అన్నాడు హరి.

★★★

ఆ ముగ్గురూ, పిల్లల తండ్రి దగ్గరకు వచ్చి నిలబడి, అతని వైపు కోపంగా చూస్తుంటే, అక్కడున్న వాళ్లకు, అతనికి పరిస్థితి అర్థమయిపోయింది.

"ఏమయ్యా? అన్నం తింటున్నావా? గడ్డి తింటున్నావా? మీ పిల్లలు, కంపార్ట్‌మెంట్ టాప్ లేపేస్తుంటే, నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటావా? వాళ్లు పిల్లలు కాదు రాక్షసులు. ఎటువంటి వాళ్లను కన్నావయ్యా? వాళ్ళని అలాగే వదిలేస్తే తీవ్రవాదులుగా మారడం తథ్యం! మా బాధలేవీ నీకు పట్టడం లేదు. హార్ట్ పేషెంట్ అయిన నా భార్య ఏమైపోతుందో అని భయపడి చస్తున్నాను. మాలాంటి వాళ్లను అటువంటి హింసకు గురి చేయడానికి మీ పిల్లలకు ఆ హక్కు ఎవరిచ్చారయ్యా? నేను చెప్పేది అర్థమవుతుందా? లేదా?" అంటూ పిచ్చికోపంతో అరుస్తున్న రాఘవ కేకలకు అదిరిపడిన అతని భార్య కళ్యాణి గబగబా అక్కడికి వచ్చి,

"అయ్యో అలా గట్టిగా అరవకండి. మీ ఆరోగ్యం అసలే బాగాలేదు. ఇక ఆపండి. ఇంతమంది ఉన్నారుగా.. వాళ్ళు చూసుకుంటారు!" అంటూ భర్తను ఆపే ప్రయత్నం చేయసాగింది.

ఈ లోగా నలుగురైదుగురు మూకుమ్మడిగా పిల్లల తండ్రి పైన దాడి చేసి ధ్వజమెత్తారు. దాంతో పిల్లలిద్దరూ బిక్క చచ్చిపోయి సైలెంట్ అయిపోయారు. అందరి మాటలు ఆ తండ్రిలో తీవ్రమైన కదలికను తెచ్చాయి.

"అందరూ నన్ను క్షమించండి. తప్పంతా నాదే. దరిద్రపు వెధవల్లారా... మీ వల్ల ఎన్నెన్ని మాటలు పడాల్సివచ్చింది" అంటూ పిల్లలిద్దరిని పట్టుకొని ఆ చెంప ఈ చెంప వాయించాడు. వాళ్ళు గొల్లున ఏడుస్తూ వాళ్ళ బెర్త్‌ల మీదకు పోయి ఏడ్చి, ఏడ్చి, కాసేపటికి నిద్రలోకి జారుకున్నారు.

అతను పిల్లల్ని పాశవికంగా కొట్టడం, అక్కడి వాళ్ళలో కొందరికి బాధ కలిగించింది. కానీ అందరికీ సాంత్వన లభించింది. ఇప్పుడు ఆ కంపార్ట్‌మెంట్ చాలా ప్రశాంతంగా ఉంది. ఆ తండ్రి దిగాలుగా కూర్చుండిపోయాడు. పిల్లలను కొట్టినందుకు అతను ఎంత బాధ పడుతున్నాడో అర్థమవుతుంది. ఆ దృశ్యం చూసిన ఆనంద్ మనసు వికలమయిపోయింది. స్వతహాగా సున్నిత మనస్కుడైన ఆనంద్ అది తట్టుకోలేకపోయాడు.

★★★

"మనం చాలా పెద్ద తప్పు చేశాం శ్రావణీ" అని ఆనంద్ అనగానే, ఆమెతో పాటూ రాఘవ, అతని భార్య ఆనంద్ వైపు చూశారు, ఆశ్చర్యపోతూ!

"అవును రాఘవ గారూ మనందరం పెద్ద తప్పే చేశాం" అన్నాడు ఆనంద్ బాధగా.

"అబ్బా! ఏమయిందో చెప్పండి" అడిగింది శ్రావణి అసహనంగా.

"బాత్రూంకి బయలుదేరిన నాకు, అక్కడ ఆ పిల్లల తండ్రి కనిపించాడు. అటెండెంట్ కూర్చునే చోట కూర్చుని హృదయవిదారకంగా ఏడవటం నాకంటపడింది. చెట్టంత మనిషి, అలా చిన్నపిల్లవాడిలా ఏడవటం నేను తట్టుకోలేకపోయాను. పరిచయం లేకపోయినా అతన్ని ఓదార్చే ప్రయత్నం మొదలుపెట్టాను. 'సార్... దయచేసి ఏడవకండి. అందరూ అన్న మాటలు పట్టించుకోకండి. పిల్లలన్న తర్వాత అల్లరి చేయడం సహజం. కాస్త ఎదిగితే వాళ్లే అన్నీ తెలుసుకుంటారు. ఎల్లకాలం ఇలాగే ఉంటారా ఏమిటి?' అనగానే అతను నన్ను పట్టుకొని మరింత బిగ్గరగా ఏడ్చాడు. కాస్త తేరుకున్నాక, 'మీరెవరో తెలియదు కానీ, సాటి మనిషి కష్టాన్ని గుర్తించే మంచి మనసు మీకు ఇచ్చాడా దేవుడు. మా పిల్లలు అలా ఎందుకు పెత్రేగిపోతున్నారో ఎవరికీ చెప్పాలనిపించలేదు. మీరు ఎంతో ఆత్మీయుల్లా కనిపిస్తున్నారు. మీకు మాత్రమే చెప్తాను' అన్నాడు దుఃఖాన్ని దిగమింగుకునే ప్రయత్నం చేస్తూ.

'చెప్పండి సార్. నేను కూడా తెలుసుకోవాలని అనుకుంటున్నాను' అన్నాను నేను. కాసేపాగి చెప్పడం మొదలు పెట్టాడతను.

'నా భార్యకు లివర్ క్యాన్సర్ నాలుగవ దశలో ఉంది' అనగానే షాక్ తగిలినట్లయింది నాకు.

'ఆమె హైదరాబాద్‌లో క్యాన్సర్ హాస్పిటల్లో ఉంది. ఇంతవరకు మా పిల్లలకు ఆ విషయం తెలియకుండా దాచి ఉంచాను. కానీ మరణానికి చేరువలో ఉన్న నా భార్య, పిల్లలను చూడాలని గొడవ చేస్తే, తప్పక వాళ్ళ అమ్మను చూపించాను. ఒళ్లంతా ఎక్కడ పడితే అక్కడ గొట్టాలతో, చిక్కి శల్యం అయిపోయి, కీమో థెరపీ వల్ల జుట్టు అంతా రాలిపోయిన నా భార్యను చూసి, నా పిల్లలు తట్టుకోలేకపోయారు. అప్పటికి వాళ్ళను ఓదార్చి మామూలు స్థితికి తీసుకువచ్చినా, వాళ్ల మనస్సులో ఆ దృశ్యాలే పదే పదే కదులుతున్నాయి. ఆ బాధ, దుఃఖం ఎలా దాచాలో, ఎలా భరించాలో తెలియని ఆ పసి మనసుల మానసిక సంఘర్షణ ఫలితమే, ఆ గొడవలు, కొట్లాటలు. మామూలుగా అయితే వాళ్ళిద్దరూ మంచి స్నేహితులే. వాళ్ళిద్దరూ గొడవపడే సందర్భాలు చాలా అరుదు. కానీ వాళ్ళు ఇప్పుడు ఉన్న పరిస్థితి వేరు. 'దేవుడు మా మీద ఎందుకు పగబట్టాడు? ఏ పాపం చేయని మా అమ్మకు ఎందుకంత పెద్ద శిక్ష విధించాడు? అన్న ఆలోచనలతో పుట్టిన కోపాన్ని బహిర్గతం చేయడం తెలియక, వాళ్ళిద్దరూ కొట్టుకుంటూ, విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. అగ్నిపర్వతంలో ఇమడలేక, అక్కడి ఒత్తిడిని తట్టుకోలేక లావా ఎలా ఉప్పొంగి బయటకు వస్తుందో అలా వాళ్ళ ఆవేదన, ఉక్రోషం, కోపం, దుఃఖం కట్ట గట్టుకొని ఇలా ఈ రూపంలో బయటపడుతుందన్న

విషయం వాళ్లకూ అర్థం కావడం లేదు. ఆ విషయం నాకు ఒక్కడికే తెలుసు. ఎవరికి చెప్పినా అర్థం కాదు. అన్నీ తెలిసినా పశువులా నా చిన్నారి పిల్లలను కిరాతకంగా కొట్టాను. నా పాపానికి నిష్కృతి ఉంటుందా?' అంటూ హృదయ విదారకంగా ఏడవడం పెట్టాడు. అది చూసి నేను తట్టుకోలేకపోయాను. నా గుండెను ఎవరో గట్టిగా నలిపేస్తున్నంత బాధ కలిగింది" అంటున్న ఆనంద్ చెమ్మగిల్లిన కళ్లను చూసి కదిలిపోయింది. అప్రయత్నంగా ఆమె కంట రెండు కన్నీటి చుక్కలు రాలాయి. రాఘవ ముఖంలోనూ పశ్చాత్తాపం తొంగి చూస్తుంది.

"దీనంతటికీ కారణం నేనే. నావల్లే ఇదంతా జరిగింది. పాపిష్టి దాన్ని" అంటూ తనని తాను నిందించుకోవడం మొదలు పెట్టింది శ్రావణి.

"అయిందేదో అయిపోయింది. ఇలా బాధపడి ప్రయోజనం లేదు. మన తప్పు సరిదిద్దుకునే దారి ఏదయినా ఉందేమో ఆలోచించు" అన్నాడు ఆనంద్.

"ఉంది" అంది.

"గుడ్. ఏమిటది?"

"సమస్య నా వల్లే వచ్చింది కదా? పరిష్కారం నేనే చెపుతాను. భోజనాల సమయం అవుతుంది కదా? ఆ పిల్లలు కాసేపట్లో లేస్తారు. వాళ్ళ ధోరణిలో మార్పు తీసుకురావాలి. అంటే వాళ్ళ దృష్టి మళ్లించాలి. అలా చేయడం వల్ల వాళ్ళు తల్లిని, వాళ్ళ బాధలను తాత్కాలికంగా మర్చిపోవాలి. మన పాపను అక్కడికి తీసుకెళ్లి, వాళ్ళు దానితో ఆడుకొనే పరిస్థితిని కల్పించండి. మన పాప అంటే అందరూ ఎంతో ఇష్టపడినట్లే ఆ పిల్లలూ ఇష్టపడతారు. వీలయినంత సేపు, వాళ్ళు పాప ధ్యాసలోనే ఉండేలా చూడండి. పాప వాళ్ళకు బాగా అలవాటు అయిన తర్వాత, వాళ్ళే మన దగ్గరకు వస్తారు. వాళ్ళకు మంచి కథలు, ఇష్టమయిన విషయాలు చెపుతూ వాళ్ళను ఎంగేజ్ చేద్దాం. ఇక్కడ ఇంతమంది ఉన్నాం. ఆమాత్రం చేయలేమా?"

"తప్పకుండా చేయగలం. చాలా మంచి ఆలోచన. నేనూ, మా ఆవిడ కూడా ఆ పిల్లలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తాము. నీకు థాంక్స్ చెప్పాలి తల్లీ. ఆనంద్ గారి ద్వారా అన్ని విషయాలు తెలుసుకున్నాక అపరాధ భావనతో నలిగిపోతున్నాను. ఈ విధంగానయినా నా తప్పు దిద్దుకొనే అవకాశం దొరికింది" అన్నాడు రాఘవ ఉత్సాహంగా.

"మీకే కాదు. అందరికీ" అంటూ పాపను ఎత్తుకొని, పిల్లలు ఎప్పుడు లేస్తారా అని ఎదురుచూడడం మొదలుపెట్టాడు, ఆనంద్.



(ఈ కథకు థీమ్ అందించిన మిత్రుడు 'డా. భాస్కర్ కొంపెల్ల' కు కృతజ్ఞతలు.)

బాల కథ

తల్లి మీద ప్రేమ

కంచనపల్లి వేంకట కృష్ణారావు
✆ 9348611445

"వీడు రాక్షసుడైనా తల్లి మీద ప్రేమ ఉంది. అదే వీడిని రక్షిస్తోంది. వీడు నిజమే చెబుతున్నట్టు నాకు నమ్మకం కలిగింది. ఎందుకైనా మంచిది.. మన దగ్గర బందీగా ఉన్న కొన్ని క్రూర మృగాలను వీడికి ఇద్దాం. వాటిని తీసుకువెళ్లి, వీడు వీడి అమ్మా తింటారు. మనం కూడా ఒక మంచి పని చేసినవారం అవుతాము"

అందమైన ఆరావళీ పర్వతాలలో అదో పెద్ద గుహ! ఆ గుహ చుట్టూ చిక్కని చెట్లు. ఆ గుహలో బీబుంభా అనే రాక్షసుడు తన ముసలి తల్లితో నివసిస్తున్నాడు. వయసురీత్యా ఆ ముసలి తల్లి బయటకు వెళ్ళి, తిండి సంపాదించుకోలేదు. ఆ రాక్షసతల్లి బాగోగులు అన్నీ బీబుంభా చూసుకోవలసిందే. అందువలన బీబుంభా అడవిలోకి వెళ్ళి రకరకాల జంతువులను వేటాడి, చంపి తెచ్చి తల్లికి పెట్టి తనూ తినేవాడు. వాడు రాక్షసుడైనా సరే.. వాడికి తల్లి మీద ప్రేమ ఎక్కువ. అందుకే ఆ ముసలి రాక్షస తల్లికి కొడుకుపై ఎనలేని ప్రేమ! వాడు బయటికి వెళుతున్నప్పుడల్లా వాడి క్షేమం కోరుతూ, రాక్షస దేవత అయిన ప్రచండ చండిని ఆ ముసలి తల్లి ప్రార్థిస్తూ ఉండేది.

ఒకనాడు వాడు అడవిలో ఎంత దూరం వెళ్ళినా ఒక్క మృగం కూడా కనబడలేదు! అయినా వాడు మృగాల కోసం వెతుకుతూ చాలా దూరం వెళ్ళాడు. అలా వెతుకుతున్న వాడికి దూరంగా ఒక పెద్ద నది కనబడింది.

దాని మధ్యలో ఓ ద్వీపం కనబడింది. దానిలో వింత చెట్లు పెద్ద బండరాళ్ళు వాడికి కనబడ్డాయి. అక్కడ జంతువులు తప్పక ఉంటాయని, కష్టపడి ఈది ఆ ద్వీపాన్ని చేరుకున్నాడు. జంతువుల కోసం అటు ఇటు పరిశీలిస్తున్నంతలో.. ఉన్నట్టుండి ఆ రాళ్ళ చాటు నుండి పదిమంది మరుగుజ్జులు వచ్చి వాడి ఎదుట నిలబడ్డారు. వారిని చూసి బీబుంభా గట్టిగా నవ్వాడు. మరుగుజ్జులు వాడి వైపు కోపంగా చూశారు.

ఆ పదిమంది మరుగుజ్జులను ఒడిసిపట్టి తీసుకు వెళితే తనకు తన తల్లికి వారం రోజుల ఆహారం దొరుకుతుందన్న ఆశతో వాడి మొహం వెలిగి పోయింది!

వాడి దుష్ట ఆలోచన కనిబెట్టి ఆ మరుగుజ్జులు, "ఏరా రాక్షసాధమా! మా ద్వీపానికి వచ్చి మమ్మల్ని మింగాలని చూస్తావా?" అంటూ ఓ వింత మంత్రం చదివారు.

పెద్ద వింత చెట్ల నుండి ఊడలు విడిపోయి ఎగురుకుంటూ వచ్చి వాడిని బంధించివేసాయి!

వాళ్ళు మరుగుజ్జులు అయినా అనేక శక్తులు కలిగిన వారని.. వాడికి అర్థం అయిపోయింది. బీబుంభా అచేతనుడై పోయాడు. ఆ మరుగుజ్జుల వైపు కళ్ళు తేలవేసి చూచి ఈ విధంగా అన్నాడు... "మరుగుజ్జు మహానుభావుల్లారా.. తిండి వెతుక్కుంటూ పొరపాటున ఈ ద్వీపానికి వచ్చాను. ఇక్కడ మీరు తప్ప ఏ జంతువూ కనబడలేదు నా తప్పును క్షమించి నన్ను వదలి పెట్టండి.



నా ముసలి తల్లి గుహలో ఒక్కతే ఉన్నది. ముసలితనం వల్ల మా అమ్మ వేటాడలేదు. నేను జంతువులను వేటాడి తీసుకువెళ్ళాలి. వెళ్ళకపోతే మా అమ్మ ఆకలితో చచ్చిపోతుంది" అని దీనంగా వేడుకున్నాడు.

ఆ మాటలు మరుగుజ్జులను కదిలించాయి. ఒక ముసలి మరుగుజ్జు.. "వీడు రాక్షసుడైనా తల్లి మీద ప్రేమ ఉంది. అదే వీడిని రక్షిస్తోంది. వీడు నిజమే చెబుతున్నట్లు నాకు నమ్మకం కలిగింది. ఎందుకైనా మంచిది.. మన దగ్గర బందీగా ఉన్న కొన్ని క్రూర మృగాలను వీడికి ఇద్దాం. వాటిని తీసుకువెళ్లి, వీడు వీడి అమ్మా తింటారు. మనం కూడా ఒక మంచి పని చేసినవారం అవుతాము" అని ఎంతో మంచిగా చెప్పాడు.

ఆ ముసలి మరుగుజ్జు మాటలకు మిగతా మరుగుజ్జులు హర్షం వెలిబుచ్చారు.

మరుగుజ్జులు మరో మంత్రం చదివారు, ఊడల బంధనం విడిపోయింది! బీబుంభా మరుగుజ్జులకు నమస్కారం పెట్టాడు.

"చూడు నీవు రాక్షసుడవయినా సరే.. నీకు తల్లి మీద ప్రేమ ఉంది. ఆ ప్రేమే నిన్ను రక్షించింది. మాకు నీ తల్లి మీద ప్రేమ నచ్చింది. అందుకే మా దగ్గర ఉన్న కొన్ని క్రూర మృగాలను ఇస్తున్నాము. వాటిని తీసుకువెళ్లి, నీవు, నీ తల్లి తృప్తిగా తినండి. నీవు ఆమెకు పెట్టకుండా నీవే తినేస్తే, మా శక్తి నీ గుహ వద్దకు వచ్చి తగిన విధంగా శిక్షిస్తుంది! అందుకే మీ అమ్మను బాగా చూచుకో!" అని మరుగుజ్జులు వాడిని ఒక విధంగా భయపెట్టి, మరో విధంగా మంచి మాటలు చెప్పి పంపారు.

ఆ మరుగుజ్జుల మాటలు వాడిలో సంతోషం కలిగించాయి. పరుగున గుహకు వెళ్ళి, ఆ మృగాలలో కొన్నింటిని తల్లికి ఆహారంగా పెట్టి సంతోషించాడు.

గుహలో రాయి మీద ఉన్న ప్రచండచండి విగ్రహం దీవిస్తున్నట్లుగా కనబడింది.

బాల కథ

విజ్ఞాన వేసు

పైడిమర్రి రామకృష్ణ
✆ 92475 64699

సూర్యుడు నడినెత్తికి రాగానే వేడికి రాళ్లలోని గాలి వ్యాకోచించి, ఏనుగు ఇచ్చిన ఒత్తిడికి ఒక్కసారిగా రాళ్లు పక్కకు తప్పుకున్నాయి. అప్పుడు అడ్డుకట్ట తెగి, పాత ఏరుతో పాటు భూగర్భంలో దాగి ఉన్న ఒక కొత్త జలధార కూడా బయటకు ఉప్పొంగింది. అడవి అంతా జలకళతో నిండిపోవడంతో, జంతువుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఒక అడవిలో విజ్ఞానాగ్నిలా వెలిగే ఒక గుడ్లగూబ నివసించేది. దానికి తన పూర్వీకుల నుండి అపారమైన వైజ్ఞానిక శాస్త్ర రహస్యాలు వారసత్వంగా లభించాయి. పగలు విశ్రాంతి తీసుకునే ఆ గుడ్లగూబ, చీకటి పడగానే అడవి అంతా సంచరిస్తూ, ప్రకృతిలో జరిగే మార్పులను గమనించేది. రాత్రి వేళల్లో అది కేవలం ఆహారం కోసం కాకుండా, అడవిలో ఏవైనా సమస్యలు ఉన్నాయేమోనని పరిశీలిస్తూ తిరిగేది. ఏదైనా చిక్కు సమస్య ఎదురైతే, తన తెలివితేటలతో దానికి ఒక శాస్త్రీయమైన పరిష్కారాన్ని ఆలోచించేది. రాత్రంతా మేల్కొని ఒక ఖచ్చితమైన ప్రణాళికను రూపొందించి, సూర్యోదయం కాగానే తన మిత్రులను కలిసేది. బలవంతుడైన ఏనుగు, ధైర్యవంతుడైన ఎలుగుబంటి, ఓపిక గల తాబేలు ఆ గుడ్లగూబకు ప్రాణమిత్రులు. గుడ్లగూబ చెప్పే ప్రతి మాటలోనూ ఒక అర్థం, పరమార్థం ఉంటాయని ఏనుగు ఎలుగుబంటి తాబేలు నమ్మేవి.

ఒకానొక దుర్దినాన, అడవికి ఉత్తర దిశలో ఉన్న ఎత్తైన పర్వతాల నుండి, ఒక భారీ కొండచరియ విరిగిపడింది. ఆ కొండచరియ సరిగ్గా అడవికి ప్రాణనాడి వంటి ఏరు ప్రవహించే దారిలో పడి, ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకుంది. నీరు రాకపోవడంతో అడవిలోని చెరువులు, కుంటలు ఎండిపోయి భూమి నెర్రెలు బారిపోయింది. పచ్చని చెట్లు వాడిపోయి, అడవి అంతా బోసిపోయి కనిపించసాగింది. "చెరువు ఎండితే కప్పలకు చేటు" అన్నట్లుగా, నీటి వనరులు ఆగిపోవడంతో అడవిలోని పశుపక్ష్యాదులన్నీ ప్రాణభయంతో విలవిలలాడాయి.

మొదట ఏనుగు తన భారీ కాయంతో, కొండంత బలంతో ఆ రాళ్లను నెట్టడానికి ప్రయత్నించింది. కానీ ఆ రాళ్లు ఇసుకలో లోతుగా కూరుకుపోయి ఉండటంతో, ఏనుగు ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో జంతువులన్నీ నిరాశతో గుడ్లగూబ దగ్గరకు పరుగెత్తాయి.

గుడ్లగూబ ఆ కొండచరియల దగ్గరకు వెళ్లి రాత్రంతా నిశితంగా పరిశీలించింది. అది కేవలం రాళ్లను చూడలేదు, వాటి మధ్య ఉన్న బలాలు, పీడనాన్ని లెక్క గట్టింది. తెల్లవారగానే తన మిత్రులను పిలిచి, మనం రాళ్లను నెట్టడం కంటే, వాటిపై ఒత్తిడి పెంచడం మేలని చెప్పింది. "గోరుతో పోయేదానికి గొడ్డలి ఎందుకు" అని హితవు పలుకుతూ తన శాస్త్రీయ ప్రణాళికను వివరించింది. గుడ్లగూబ సూచన మేరకు ఏనుగు ఆ కొండచరియల పైభాగానికి వెళ్లి, ఒక కీలకమైన బిందువు వద్ద తన

బరువునంతా వేసి తొక్కింది. ఇక్కడ రాళ్ల మధ్య ఉన్న ఘర్షణ తగ్గి, అవి కదలడానికి సిద్ధమయ్యాయి. అదే సమయంలో ఎలుగుబంటి కొండకు అవతలి వైపు మట్టిని తవ్వి నీరు ప్రవహించడానికి వీలుగా ఒక పల్లాన్ని సిద్ధం చేసింది. తాబేలు తన వంతుగా నీరు భూమిలోకి ఇంకిపోకుండా ఉండేందుకు జిగురు మట్టితో రంధ్రాలను మూసి వేసింది.



సూర్యుడు నడినెత్తికి రాగానే వేడికి రాళ్లలోని గాలి వ్యాకోచించి, ఏనుగు ఇచ్చిన ఒత్తిడికి ఒక్కసారిగా రాళ్లు పక్కకు తప్పుకున్నాయి. అప్పుడు అడ్డుకట్ట తెగి, పాత ఏరుతో పాటు భూగర్భంలో దాగి ఉన్న ఒక కొత్త జలధార కూడా బయటకు ఉప్పొంగింది. అడవి అంతా జలకళతో నిండిపోవడంతో, జంతువుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. "ఆరు నెలలు కష్టపడితే ఆరు కాలాలు సుఖపడవచ్చు" అన్నట్లుగా ఆ ఒక్కరోజు చేసిన శాస్త్రీయ ప్రయత్నం, అడవికి శాశ్వత పరిష్కారాన్ని ఇచ్చింది. నీరు సమృద్ధిగా లభించడంతో అడవిలో అరుదైన మొక్కలు మొలకెత్తి అది ఒక నందనవనంలా మారిపోయింది. చివరగా తాబేలు మెల్లగా నవ్వుతూ, గుడ్లగూబ యుక్తి వల్ల మనకు అష్టైశ్వర్యాలు లభించాయని కొనియాడింది. గుడ్లగూబ వినయంగా తలవంచి, "సమిష్టి కృషికి సరైన వ్యూహం తోడైతే, ప్రకృతే మనకు దాసోహమంటుంది" అని చెప్పింది.

శాస్త్రీయ దృక్పథం ఉంటే, ఎంతటి క్లిష్ట సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని అడవిలోని ప్రాణులన్నీ గ్రహించాయి. ప్రకృతిని కేవలం వాడుకోవడం మాత్రమే కాకుండా, దాని గమనాన్ని అర్థం చేసుకోవటమే నిజమైన తెలివితేటలని ఏనుగు, ఎలుగుబంటి, తాబేలు గ్రహించాయి. అడవి జీవులన్నీ ముద్దుగా గుడ్లగూబను 'విజ్ఞాన వేగు ' అని పిలుచుకున్నాయి

నాటకం

శ్రీమతి కె. వరలక్ష్మి
✆ 9866467062

విశిష్ట అతిథి కథ

పల్లవి వెంట ప్రకాష్‌ను చూసి మొహం చిట్లించాడు రమేష్. "వాళ్ళకొక రూం ఇవ్వండి" అన్నాడు కొంత నిర్లిప్తంగా, కొంత చికాగ్గా.
పల్లవిని పక్కకి పిల్చి "ఇదేమన్నా హనీమూన్ ట్రిప్పా మీ ఆయన్ని వెంటేసుకు రావడానికి, ఆ మాత్రం ఇండివిడ్యుయాలిటీ లేకపోతే మోడలింగ్లో ఎలా రాణిస్తావమ్మా" అన్నాడు పాపారావు నాయుడు.
"ఏమిటి సంగతి?" అంటూ దగ్గరకొచ్చిన ప్రకాష్‌ను చూసి "అబ్బే, ఏంలేదు. మీ డ్యూటీకి సెలవు పెడితే నష్టమేం లేదా అనడగుతున్నా" అన్నాడు.

పల్లవి కళ్ల ముందు పట్టపగలే చుక్కలు మెరుస్తున్నాయి. పదేపదే మెట్లెక్కీ దిగీ ఆమె అలసిపోయింది. ఫ్లడ్‌లైట్స్ వేడిమికి ఆమె ముఖం కందగడ్డలా ఎర్రబడిపోయింది.

"టీ బ్రేక్" అరిచారెవరో.

బ్రతుకుజీవుడా అనుకుంటూ వెళ్ళి చెట్టు కింది చప్టా మీద కూలబడింది. బాసింపట్టు వేసుకు కూర్చుని నొప్పులు పెడుతున్న పాదాలను రెండు చేతుల్తో ఒత్తుకోసాగింది. చెమటలు దిగకారి బ్లౌజంతా తడిసి ముద్దయ్యింది. ఐ షేడ్ కరిగి కళ్ళల్లోకి జారి కళ్లు మంటలు పెడుతున్నాయి.

మేకప్ టచ్ చేసుకోమని అద్దం, పౌడర్ కేక్ ఇచ్చి వెళ్ళాడు బోయ్. పీక్కుపోయిన ముఖాన్నీ, ఎర్రబడిపోయిన కళ్లనీ అద్దంలో చూసుకున్నాక, పల్లవి కళ్ళు నీటి చెలమలయ్యాయి. ఎత్తైన ఆలయశిఖరం ఆ కన్నీళ్ళలోంచి మసక మసకగా కన్పిస్తోంది.

"హరియప్... లైట్ ఫేడయ్యేలా వుంది" అరుస్తున్నాడు కెమెరా అసిస్టెంట్.

పల్లవి కర్చీఫ్‌తో కళ్ళు ఒత్తుకుని గబగబా మేకప్ సరిచేసుకోసాగింది.

అనుకోకుండా ఆమె కళ్లు ప్రకాష్ కోసం వెదికాయి. అతను రెయిలింగునానుకుని దూరంగా పంపానది రిజర్వాయరులో నిలిచి వున్న నీటిని చూస్తున్నాడు. ఆ సాయంసంధ్య వేళలో నీరెండ పడి మెరుస్తూన్న చిన్ని చిన్ని అలల్నీ, కొండల మధ్య ఒంపులు తిరిగి ప్రవహిస్తూన్న పంపానదినీ, అలాగే చూస్తూ వుండి పోవాలన్పించింది పల్లవికి!

మూడు నెలల క్రితం అన్నవరం వచ్చినప్పుడు ప్రకాష్, తనూ ఈ అందాల్ని ఎంతగా ఎంజాయ్ చేశారు! ఫ్లవర్ గార్డెన్లో గులాబీల మధ్య తిరుగుతున్నప్పుడు "ఈ పూలలో ఓ పువ్వులా వున్నావు నువ్వు" అన్నాడు ప్రకాష్, ప్రకాష్ అంతగా మెచ్చుకునే తన రూపమంటే పల్లవికెంతో ఇష్టం.

టచప్ పూర్తి చేసుకుని పల్లవి లేవబోతూండగా, పడమటి కొండల వెనక నుంచి పల్చటి మబ్బుతెరొకటి సూర్యబింబాన్ని ఆక్రమించుకుంది. 'హుష్' అని తలపట్టుకున్నాడు పాపారావు నాయుడు. అతను ప్రొడక్షన్ మేనేజరు. కాఫీలు సప్లై చెయ్యడం దగ్గర్నుంచి లైట్స్ ఎరేంజ్ చెయ్యడం వరకూ అన్నీ అతనే చూస్తున్నాడు. కథొక్కటి తక్కువ గాని, ఓ సినిమా తీస్తున్నంత హడావుడి జరుగుతోందక్కడ!

యాడ్ కంపెనీ ప్రొడ్యూసర్ రమేశ్.. అంబరిల్లా కింద కూర్చుని కూల్‌డ్రింక్ తాగుతూ పాపారావుని నమిలి మింగేసేలా చూస్తున్నాడు... అక్కడికా మబ్బుల్ని పాపారావే రప్పించాడన్నట్టు! మరో మోడల్ మౌసమీ సనారా అతని పక్క కుర్చీలో, అతన్ని ఆనుకుని కూర్చుని, అయిందానికీ కానిదానికీ అందమైన పలు వరసంతా కన్పించేలా నవ్వుతోంది.

వారం రోజులుగా యాంగ్జైటీ, రెండు రోజులుగా నిద్రలేమి, రెస్ట్‌లెస్‌నెస్, మేకప్, లిప్‌స్టిక్ చెరిగిపోతాయని ఉదయం నుంచి చేసిన ఉపవాసం.. అన్నీ కలిసి పల్లవికి నీరసం ముంచుకొస్తోంది. ఆ చెట్టు కింద అలా నడుం వాల్చి నిద్రలోకి జారుకోవాలని వుంది.



ఈ జనానికిదేం వేలంవెర్రో తెలీదు, దైవదర్శనం చేసుకోవడం మర్చిపోయి మరీ షూటింగును చూస్తున్నారు. మేకప్‌లో వున్న తననీ, మౌసమీని చూడడమే తమ జీవితధ్యేయమన్నట్టు ప్రవర్తిస్తున్నారు.

ఈ షూటింగ్‌ను గురించీ, మోడలింగ్ చేసే అమ్మాయిల గ్లామరస్ జీవితాన్ని గురించీ ఎన్నెన్ని కలలు కన్నది తను. ఎంత గొప్పగా ఊహించుకుంది! వద్దు బాబోయ్ వద్దు, కలలో కూడా ఈ జీవితం వద్దు!

అసలిదంతా ఎలా మొదలైందో ఆ సమయంలో గుర్తుకొచ్చింది పల్లవికి.

కాలేజ్ ప్రేమను పదిలంగా పెంచి పోషించుకుని, ప్రకాష్ ఎల్లెల్బీ రిజల్ట్స్ రాగానే రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నారు ఇద్దరూ! ఇరువైపుల పెద్దలూ అంగీకరించకపోవడంతో, సొంతంగా జీవనాన్ని ప్రారంభించాల్సి వచ్చింది. ఎన్నో తంటాలు పడి, సీనియర్ లాయరొకాయన దగ్గర అప్రెంటిస్‌గా చేరాడు ప్రకాష్.

డిగ్రీ చేసిన పల్లవి ఓ ప్రైవేటు స్కూల్లో టీచరుగా జాయినైంది. సంపాదించే కొద్దిపాటి డబ్బుల్తో, ఇంటిని పొదుపుగా ఎలా నడపాలో పెళ్లైన ఆరునెలల్లోనూ పల్లవికి బాగానే పట్టుబడింది.

జీవితంలో స్థిరపడే వరకూ పిల్లలొద్దనుకున్నారు. టీ.వీ. ఫ్రిజ్ లాంటి ప్రస్తుత జీవనంలోని లగ్జరీస్ మాత్రం ఇద్దర్నీ బాగా ప్రలోభపెడుతున్నాయి.

మూడు నెలల క్రితం డైలీ పేపర్లోని ఓ కటింగ్ తెచ్చి పల్లవి చేతికిచ్చాడు ప్రకాష్, బ్యూటీ కాంటెస్ట్ వివరాలవి! చదివి.. "ఎందుకిది?" అడిగింది పల్లవి.

"మన టౌన్లోనే కదా, సరదాగా పాల్గొరాదూ!"

"బాగుంది, నీ కళ్ళకి నేను అందంగా కన్పడుతున్నానని అందరికీ అలాగే కన్పిస్తాననుకుంటున్నావా?"

"కన్పిస్తావో లేదో చూద్దాం!"

జిల్లా కేంద్రంలో నిర్వహించబడిన ఆ చిన్న బ్యూటీ కాంటెస్టులో అలా పాల్గొంది పల్లవి. ప్రకాష్‌కే కాదు, అందరికీ ఆమె అందంగానే కన్పించి ఫస్ట్ ప్లేస్ సంపాదించుకుంది.

ఆ కాంటెస్ట్‌కి జడ్జిగా వచ్చిన యాడ్ కంపెనీ ఎమ్.డి. రమేష్ పల్లవిని నాలుగైదు రకాల యాంగిల్స్‌లో ఫోటోలు తీయించి పట్టుకెళ్ళాడు. స్క్రీన్ టెస్ట్ చెయ్యాలని హైదరాబాద్ పిలిపించాడు. ప్రకాష్, తను.. అప్పు చేసి మరీ వెళ్ళొచ్చారు.

"వచ్చే నెలలో అన్నవరంలో ఒక టాల్కం పౌడరు యాడ్ తీయాల్సి వుంది. ఫోన్ చేసి కారు పంపిస్తా, వస్తావా?" అని అడిగాడు రమేష్.

తను ఆలోచిస్తూంటే, "ఇది కూడా మీ ఆయన్ని అడగాలా, మీ ఊరికి అన్నవరం దగ్గరేగా, ఒప్పేసుకో" అన్నాడు పాపారావు నాయుడు. "ఇలాంటి యాడ్స్‌లో కన్పిస్తే తొందరగా సినిమాల్లో ఛాన్సొస్తుంది".

తన నిర్ణయంతో పని లేకుండానే ఇవన్నీ జరిగిపోతూండడం పల్లవికి ఆశ్చర్యంగానూ, కొంత ఆనందంగానూ వుంది. ప్రకాష్, తనూ జీవితంలో స్థిరపడడానికి తన అందం ఉపయోగపడబోతోందని తల్చుకుంటే కొంత గర్వంగానూ వుంది.

వచ్చే నెలన్నది ఇప్పటికప్పుడే రెండునెలలు దాటింది. ఈలోపల మూడుసార్లు వాళ్ళు వస్తున్నామని, తయారుగా ఉండమని ఫోన్ చేసి రాలేదు. వారం క్రితం ఫోనొచ్చినప్పుడు ఎదురింటి ఇంజనీరు గారి భార్య విసుక్కుంది 'అస్తమాటూ ఈ ఫోన్లేమిటి, మా నెంబరెందుకిచ్చారు?' అని.

ఫలానా రోజు తప్పకుండా షూటింగ్ వుంటుంది. రెడీగా ఉండమని కబురు. ఈ వారం రోజులుగా పల్లవి కంటి మీదికి నిద్రే రాలేదు. భరించలేని యాంగ్జైటీతో తిండి నోటికి పోయేది కాదు.

నిన్న ఉదయం వస్తుందన్న కారు మధ్యాహ్నం వచ్చింది. ఆ టైంలో ప్రకాష్ ఇంట్లో లేడు. కోర్టుకెళ్ళిపోయాడు. ప్రకాష్ వస్తే గాని తను రాననడంతో డ్రైవరు వెళ్ళిపోయాడు. అరగంటలో మళ్లీ తిరిగొచ్చి "మా కార్లన్నీ ఇప్పుడెళ్ళిపోతున్నై, సాయంకాలం మీ అంతట మీరే రావాల్సి ఉంటుందట, సారు చెప్పమన్నాడు" అని చెప్పి వెళ్లిపోయాడు.

సాయంకాలం ప్రకాష్ వచ్చాక కనుక్కుంటే తెల్సింది వాళ్ళంతా అన్నవరం వెళ్ళిపోయారని. అప్పటికప్పుడు వాళ్ళ లాయర్ దగ్గరకి పరుగెత్తి ఐదువందలు అప్పు తెచ్చాడు ప్రకాష్. టాక్సీ మాట్లాడుకుని అన్నవరం చేరేసరికి రాత్రి తొమ్మిది దాటింది.

ఎందుకైనా మంచిదని తన దగ్గరున్న వాటిల్లో కాస్త మంచివన్పించే చీరలు రెండు, పంజాబీ డ్రెస్సొకటి బేగ్‌లో సర్దుకుంది పల్లవి. అన్నవరంలో షూటింగ్ వాళ్ళున్న గెస్ట్‌హౌస్‌ను పట్టుకోవడం పెద్ద కష్టమేం కాలేదు. పెళ్లిళ్ల సీజన్ కాకపోవడం వల్ల కొంత తెరిపిగా వుంది.

పల్లవి వెంట ప్రకాష్‌ను చూసి మొహం చిట్లించాడు రమేష్. "వాళ్ళకొక రూం ఇవ్వండి" అన్నాడు కొంత నిర్లిప్తంగా, కొంత చికాగ్గా.

పల్లవిని పక్కకి పిల్చి "ఇదేమన్నా హనీమూన్ ట్రిప్పా మీ ఆయన్ని వెంటేసుకు రావడానికి, ఆ మాత్రం ఇండివిడ్యుయాలిటీ లేకపోతే మోడలింగ్లో ఎలా రాణిస్తావమ్మా" అన్నాడు పాపారావు నాయుడు.

"ఏమిటి సంగతి?" అంటూ దగ్గరకొచ్చిన ప్రకాష్‌ను చూసి "అబ్బే, ఏంలేదు. మీ డ్యూటీకి సెలవు పెడితే నష్టమేం లేదా అనడగుతున్నా" అన్నాడు.

రూంలో కొచ్చాక "బొంబాయి నుంచి వచ్చినమ్మాయీ, రమేష్ నిన్న టౌన్లో ఒకేరూంలో వున్నారు తెల్సా" అన్నాడు ప్రకాష్ కొంటెగా నవ్వుతూ.

"పోనిద్దూ, ఎవరిష్టం వాళ్ళది" అంది పల్లవి.

"ఇదేం హనీమూన్ ట్రిప్పా' అన్నాడు నాయుడు"

"పోనీ అలాగే అనుకుంటే పోలా" అన్నాడు ప్రకాష్ పల్లవిని హత్తుకుంటూ.

"అంతేలే, లేకపోతే టాల్కం పౌడరు యాడ్ అన్నవరంలో తియ్యడమేంటి?" అంది పల్లవి.

మేకప్ వేసుకోవాలి లెమ్మని రెండు గంటలకే లేపేశారు. నిద్ర పట్టేసరికే ఇంచుమించు ఒంటిగంట కావచ్చిందేమో, పల్లవికి కళ్ళు భగ్గున మండాయి. ఇంకొక్క గంట నిద్ర పోనిమ్మని అడుగుదాం అనుకుంది గానీ, ఏమంటే ఏం తంటానో అని మానుకుంది.

ప్రకాష్ అటు తిరిగి ముణగదీసుకు పడుకున్నాడు.

బ్రష్ చేసుకుని, చల్లని నీళ్ళతో కళ్ళను కడుక్కుని మేకప్ రూంలోకెళ్ళి కూర్చుంది పల్లవి.

మూడున్నరదాటేక స్థిమితంగా ఆవలించుకుంటూ వచ్చాడు మేకప్‌మేన్.

పల్లవి మొహానికి క్రీం పట్టించేసి చాయ్ తాగొస్తానని ఎటో పోయాడు. ఆ పోవడం పోవడం ఐదు దాటాక వచ్చాడు. ఈలోగా పాపారావు నాయుడు రెండుసార్లొచ్చి చూసి వెళ్ళాడు.

'ఓరి దుర్మార్గుల్లారా, నా నిద్రంతా చెడగొట్టారు కదరా' అని లోపల్లోపలే తిట్టుకుంది పల్లవి.

సిగరెట్టు మీద సిగరెట్టు తాగుతూ రూం నిండా పొగపెట్టాడు మేకప్‌మేన్. ఆ పొగకు ఉక్కిరిబిక్కిరౌతూ అలాగే భరిస్తూ కూర్చింది పల్లవి.

ఆరు గంటల కల్లా మేకప్, హెయిర్ స్టైల్ పూర్తి చేసి, వెనకనించి అనవసరంగా పల్లవి రెండు భుజాల మీదా చేతులు వేసి నొక్కి "అచ్చం అప్సరసలా ఉన్నావ్, అద్దంలో చూసుకో" అన్నాడు.

'యాభై దాటి వుంటాయ్, వీడికిదేం పొయ్యేకాలం' అనుకుంది పల్లవి మనసులో.

చీర కడతానని తయారయ్యాడు. "వద్దులే, నేను కట్టుకోగల్ను" అంది పల్లవి.

"నువ్వు కట్టుకునేలా పనికిరాదు. వేరేలా కట్టాలి' అంటూ ఇష్టమొచ్చిన చోటల్లా చేతులు వేశాడు.

ఆ సరికి ప్రకాష్ లేచి పల్లవిని వెతుక్కుంటూ వచ్చాడు. "కాఫీ తేనా, తాగుతావా" అన్నాడు.

"భలేవాడివేలే, మేకప్ పూర్తయ్యాక కాఫీ తెచ్చిస్తావా, లిప్ స్టిక్కంతా చెరిగిపోదూ" అన్నాడు మేకప్‌మేన్. "జాగర్తమ్మోయ్, పదే పదే టచప్పులివ్వడం నావల్ల కాదు" అనేసి బైటికి పోయాడు.

పౌడరు, కేకులు సర్దుతూన్న కుర్రాడిని "ఆ బొంబాయి అమ్మాయికి మేకప్పెయ్యరా" అంది పల్లవి.

"ఆరింకా లేవలే. లేచేక ఆరి రూంలోకెళ్ళి ఎయ్యమన్నాడు సారు" చెప్పాడు కుర్రాడు.

పల్లవికి ఒక్కక్షణం మనసు చివుక్కుమన్పించింది. ఆ బొంబాయి అమ్మాయికి కూడా మోడలింగ్ కొత్తనే విన్నది. అయినా ట్రీట్మెంట్లో ఎంత పార్షియాలిటీ చూపిస్తున్నారు!

పది గంటలకి మౌసమీ మేకప్ పూర్తి చేసుకుని, పల్చటి దేవతావస్త్రం లాంటి చీర, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో వచ్చింది. ఆ అమ్మాయి కన్నా తనే బావున్నాననుకుంది పల్లవి. ప్రకాష్ కూడా ఆ మాటే అన్నాడు.

కూర్చుని కూర్చుని విసుగొచ్చేస్తూంటే –

"ఏమిటాలస్యం?" అనడిగింది.

ప్రకాష్ బైటికెళ్ళొచ్చి "సరిపోయింది, ఇంతకీ కెమెరా టీమ్ రాలేదట హైద్రాబాదు నుంచి!" అన్నాడు.

"వచ్చేస్తుందొచ్చేస్తుంది. ఈలోగా దైవదర్శనం చేసుకురండి" అని తరిమేడు పాపారావు నాయుడు.

పదకొండు గంటలకు కెమెరా వచ్చిందన్నారు. ఇంకాస్సేపటికి ఎండోమెంట్స్ నుంచి తెచ్చిన పర్మిషన్ ఎక్కడో పోయిందన్నారు, మళ్లీ దొరికిందన్నారు. అంతలో కరెంటు పోయిందన్నారు.

లైటెక్కువైందనీ, తక్కువైందనీ.. రెండు దాటేక షూటింగ్ ప్రారంభించారు.

ముందుగా మౌసమిని, పల్లవిని కలిపి రెండు మూడు షాట్లు తీశారు. తర్వాత మౌసమితో తొందరతొందరగా ముగించారు. ఆవిడ ఆంధ్రా ఎండల్ని తట్టుకోలేక పోతోందట. పై నుంచి నీళ్ళు పడుతున్న చోట, రంగు రంగుల పూల మధ్య, నాట్య మంటపం శిల్పాల పక్కన మౌసమి రకరకాల భంగిమల్లో నిలబడి పౌడరు చల్లుకుంటూండగా ఫిల్మ్ తీశారు.

పల్లవిని మాత్రం మెట్లెక్కుతూ, దిగుతూ, ఆలయ గోపురం బ్యాక్ గ్రౌండులో తీస్తున్నారు.

'ముప్పై సెకన్ల యాడ్‌కి మూడువేల షాట్లెందుకో" అనుకుంది పల్లవి నీరసంగా.

ఎవరో కొట్టిన చప్పట్లకు గోపురం మీది పావురాలన్నీ ఒక్కసారిగా టపటపమని రెక్కలు విదుల్చుకుంటూ గాలిలోకి లేచాయి. ఆ దృశ్యం కన్నుల పండుగగా అన్పించింది పల్లవికి, ఆ పావురాల్లో తనూ ఓ పావురంగా మారిపోతే...

"పల్లవీ, హరియప్..." తొందర తొందరగా లేచి వెళ్ళింది పల్లవి. రాత్రి పది వరకూ లొకేషన్స్ మార్చి మార్చి పల్లవితో షాట్స్ తీస్తూనే వున్నారు. ఒక దశలో పాపారావు నాయుడు ప్రకాష్‌దగ్గరకొచ్చి "నాయనా, అమ్మాయిని మేం జాగ్రత్తగా తీసుకొస్తాంలే, నీకు కోర్టు పోతుందేమో వెళ్ళరాదూ" అన్నాడు.

"కోర్టెక్కడికీ పోదులెండి, పల్లవిని తీసుకునే ఇక్కడ్నించి వెళ్తాను" అన్నాడు ప్రకాష్,

టీమ్ వాళ్ళంతా రెస్ట్ తీసుకోవాలని ఆ రాత్రి కొండపైనే ఉండిపోయారు. తిరిగి వచ్చేటప్పుడు బస్సులో నిస్సత్తువగా చేరబడిపోయిన పల్లవి భుజం చుట్టూ చెయ్యివేసి ప్రకాష్ అన్నాడు.. "ఆ రమేష్ గాడు డబ్బులివ్వకుండానే, నీచేత వర్క్ చేయించుకుని చెక్కేద్దామనుకున్నాడు. 'మన దగ్గర ఆ పప్పులుడకవని' చెప్పేను. మొదటిసారి యాడ్లోకి తీసుకోవడమే గొప్పన్నట్లు మాట్లాడేడా నాయుడు. అందుకే మన 'లా' తడాఖా చూపించి రెండు వేలకి చెక్కు సంపాదించేను"

ఆ బొంబాయి అమ్మాయి మౌసమీకి పదివేలిచ్చారని విందితను. ఆ మాటే ప్రకాష్‌తో అనబోయి చీకట్లోకి చూస్తూ, మౌనంగా వుండిపోయింది పల్లవి.

పల్లవికి యాడ్ కంపెనీవాళ్ళిచ్చిన పోస్ట్ డేటెడ్ చెక్కు చెల్లదని తిరిగొచ్చింది.

ప్రకాష్ తన 'లా' తడాఖా చూపించి వాళ్ళ మీద కోర్టులో కేసు వెయ్యాలని సిద్ధమౌతుండగా రెండు నెలల తర్వాత టీ.వీ.లో యాడ్ వచ్చింది.

దాన్లో మౌసమీ సనారా తప్ప పల్లవి ఎక్కడుందో ఎంత వెదికినా కన్పించలేదు.

(స్వాతి వారపత్రిక, 16.05.1997 నుంచి పునర్ముద్రణ)

మాయలేడి

కాటూరి రవీంద్ర త్రివిక్రమ్

కథా మార్గదర్శి కథ

"ఎవరి ఒత్తిడీ లేని, దయా దాక్షిణ్యాలవసరం లేని స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేద్దాం. ఆ వ్యక్తి మన ఊరివాడే కావాలి!" అందరూ చప్పట్లు కొట్టారు.
"ఆ వ్యక్తి మీరే అయితే బావుంటుంది మాస్టారూ." నవ్వాడు.

"కాదు.. రావణాసురుల్లా తయారవుతున్న రౌడీ నాయకుల్ని తట్టుకోవాలంటే, వీరయ్యలాంటి వీరుడు మన ప్రతినిధిగా నిలబడాలి. రాజ్యం వీరభోజ్యం అన్న ఆది సూక్తి కిప్పుడు మళ్ళీ కాలం వచ్చింది."

"ఓటరు మహాశయులకు నమస్కారం!

రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. వైభవాలు పోయాయి. వైభోగాలు పోయాయి. బానిసత్వపు బాధలు పోయాయి. ఈ నేల, ఈ నీరు, ఈ గాలి... ఇవన్నీ కలగలిపిన ఈ దేశం, మనకి పూర్తి అధికారాలతో లభించింది. తెల్లదొరలు వదిలిన కుర్చీల్లో నల్లదొరలు కూర్చున్నారు. కనకపు సింహాసనమున అన్నట్టు బంగారం మీద కూర్చున్నందుకు అది మైలపడింది కానీ, వీళ్ళు శుభ్రపడలేదు.. అయ్యలారా! ఇంతకు ముందు మన ప్రతినిధిగా పార్లమెంటుకి వెళ్లిన పెద్దమనిషి, తను పెట్టిన ఖర్చు రాబట్టుకునేందుకు పడిన తంటాలు పూర్తి కాకుండానే, మళ్ళీ ఎలక్షన్లొచ్చేశాయి. మరి కాస్సేపటిలో మీ ముందుకు రాబోతున్నాడు. రెడీగా వుండండి.." అంటుండగానే దుమ్ములేపుకుంటూ అంబాసిడర్ కారు ఎండలో తెల్లగా మెరిసిపోతూ సమావేశ స్థలానికి దూసుకువచ్చింది.

అంతవరకు జనజాగృతి మంత్రం పఠించిన, పాతతరం పంతులుగారు జనం మధ్యలో నిలబడ్డాడు. కారు ఆగింది. కనకయ్యగారు ముకుళిత హస్తాలతో మందహాసంతో కారులోంచి బయటికి వచ్చాడు. నమస్కారముద్రతో అందరి వైపు కలియజూశాడు. పెదవుల మీద మందహాసాన్ని మరింత పెద్దది చేశాడు. ప్రతిస్పందన లేకుండా ప్రజలు కళ్ళప్పగించి చూస్తున్నారు. పట్టించుకోకుండా అభివాదం చేశాడు. మైకు ముందు నిలబడ్డాడు. గొంతు సవరించుకున్నాడు. గొంతు విప్పాడు. అంతే... జనం మీదికి జడివాన కురిసినట్లు, అకాల వర్షంలా, వాయుగుండం వల్ల చెలరేగిన ప్రకృతి వైపరీత్యంలా, వాగ్దానాల వెల్లువ ముంచుకొచ్చింది. కొందరు కొట్టుకుపోయారు. కొందరు సందేహాల తుమ్ములతో సతమతమయ్యారు. కొందరు కొయ్యదుంగల్లా చలించకుండా నిలబడ్డారు. కనకయ్యగారి మాటలతో 'మాయలేడి' లాంటి భవిష్యత్ భ్రమ.. అలా

మనిషికొక రీతిగా మనసు చలింపజేసింది.

"అందువల్ల మహాజనులారా! మీ అతి విలువైన, పరమ పవిత్రమైన ఓటును ప్రజాసేవకి అంకితమైన మా పార్టీకి వేసి, అఖండమైన మెజార్టీతో గెలిపించి, మన నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడవలసిందిగా మీ అందర్నీ పదేపదే ప్రార్థిస్తున్నాను" ముక్తాయింపు మాటలు చెప్పి, నమస్కార మందహాస ముద్రలతో వెళ్ళి కారులో కూర్చున్నాడు కనకయ్య.

కారు బుర్రుమని స్టార్టయి తుర్రుమంది. దుమ్ము మేఘం లేచి ప్రజలందరినీ ఆలింగనం చేసుకుని తలోకాస్త దుమ్ము కళ్ళలో కొట్టింది. ప్రజలు కళ్ళు నులుముకుని చూశారు. మాయలేడి కనుమరుగయింది. దురద బాధించింది. కళ్ళమంట మిగిల్చింది.


★★★

"మాస్టారూ! మీరు చెప్పిందంతా నిజమే. 'మాయలేడి' లాంటి మాయ వాగ్దానాలు నమ్మి ప్రతిసారీ మోసపోతూనే వున్నాం. సీతమ్మోరులాంటి నమ్మకం, గీత దాటక తప్పటం లేదు" నిస్సహాయంగా పలికిందొక గొంతు.

"చిలక జ్యోతిష్యాన్ని కూడా నమ్మకుండా ఉండలేం. మనిషి మాటలు నమ్మకుండా ఎలా ఉండగలం?" మరొక గొంతు.

"మన భవిష్యత్తునేదో ఉద్ధరిస్తారనేగా వీళ్ళని అందలం ఎక్కించటం" ఇంకొక గొంతు.

"దుర్గమ్మతల్లికి దేవతలందరూ తమ అస్త్రాలు, శక్తులూ ఇచ్చి మహిషాసురుని చంపించినట్లు, ప్రజలందరూ తమ జీవశక్తిలాంటి ఓట్లిచ్చి నాయకుణ్ణి చేసి.. దారిద్ర్యం, నిరక్షరాస్యత, అనారోగ్యం, అభద్రత లాంటి రాక్షస సమస్యల్ని సమయింప జేయమంటే, వీళ్ళు మనల్నే సమస్యలకి అప్పగించి, బలిపశువులు చేస్తున్నారు" మరో మాస్టారు.



మాస్టారు మౌనంగా అందరి మాటలూ విన్నాడు. వాళ్ళ బాధ అర్థం చేసుకున్నాడు. ఊరి సమస్యలు మననం చేసుకున్నాడు. రోడ్లు గోతులమయం. అందుకే బస్సులు రద్దు చేశారు. స్కూలు కూలటానికి సిద్ధంగా వుంది. మాస్టార్ల జీతాల బకాయిలు ఆరు నెలలు దాటాయి. ఇప్పుడిక్కడ సరస్వతి మూగవోయింది. జీవిక కోసం మాస్టార్లు మరో వ్యాపకాన్ని ఆశ్రయించారు. పిల్లలకు ప్రకృతి బడి అయ్యింది. కోతి కొమ్మచ్చులే నిత్య కాలక్షేపాలయినాయి. వాళ్ళ వంటి మీద బట్టల్లాగానే, భవిష్యత్తు కూడా చింకిపాతలా అతి దీనంగా అందనంత దూరంలో కన్నీరు కారుస్తూ నిలబడి వుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనారోగ్యంతో చివరిశ్వాస పీలుస్తోంది.

ఆకాశంలో ఉండాల్సిన మబ్బులన్నీ రైతుల గుండెల్లో ముసిరి, మున్నీరు కన్నీరుగా విలపిస్తున్నాయి. నింగి నీటి శూన్యమై, నేల గుండె బీటలు వారింది. ఎటు చూసినా దీనత్వం. ఎవరి మాట విన్నా దైన్య పూరితం. బరువుగా నిట్టూర్చాడు.

"ఓటు వెయ్యటం దేనికి? మన వేలితో మనకన్నే పొడుచుకోవటం దేనికి? ఈ మాటు ఓట్లు వెయ్యటం మానేద్దాం.." మాస్టారు ఆ కుర్రాడి కేసి మౌన మందహాసంతో చూశాడు.

"ఓటు మానటం దేనికి? ఓటుకింత అని వసూలు చేసి, ఆ డబ్బుతో ఊరుని బాగు చేద్దాం..." అదే మందహాసంతో ఆ మధ్య వయస్కుడి వైపు కూడా చూశాడు మాస్టారు.

"మనం ఓట్లు వెయ్యకపోతే దొంగ ఓట్లు వేయించుకుంటారు. ఆళ్ళకియన్నీ కొత్త కాదు.." మాస్టారు నవ్వాడు.

"చూశారా? ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం అని సంబరపడ్డాం. మన భవిత విధాతలం మనమే అని గర్వపడ్డాం. వజ్రాల వంటి వ్యక్తిత్వాలు కాలవాహినిలో అడుగు చేరాయి. వెదురు వాసాల్లాంటి చెదురు మనుషులు పైకి చేరి, జాతికి చేటు చేస్తున్నారు."

"నిజమే! ఈ పరిస్థితులో మనమేం చెయ్యాలో మీరే చెప్పండి. ఓటు మానెయ్యాలా? డబ్బులు తీసుకు వెయ్యాలా?.. వేస్తే ఎవరికెయ్యాలి? ఎవర్ని నమ్మాలి? ఎవర్ని నమ్మకూడదు?"

"అవును! నేనూ ఈ ప్రశ్నలకి సమాధానాలనే వెతుక్కుంటున్నాను. ఇంకా మనకి సమయం ఉంది. ప్రశాంతంగా ఆలోచించుకుని నిర్ణయించుకుందాం" రచ్చబండ దగ్గర్నుంచి ఇంటికి వెళ్ళటానికి లేచాడు మాస్టారు.

"మాస్టారూ! మేమందరం మీరెట్టా చెబుతే అట్టా చేస్తాం. గంగలో దూకమన్నా దూకుతాం?

మాస్టారు వాళ్ళందరి వైపు కృతజ్ఞతగా చూసి, చేతులు జోడించి నమస్కరించాడు.

"మళ్ళీ రేపు కలుద్దాం" అని ఇంటికి దారి తీశాడు.

★★★

మంచంమీద నడుం వాల్చి, తలకింద చేతులు పెట్టుకుని మనసులో వేధిస్తున్న సమస్య గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు మాస్టారు. ఎవరో పాదాలు వత్తుతుంటే ఆశ్చర్యంగా చూశాడు. దత్తపుత్రుడు దామోదరం! క్లుప్తంగా 'దామూ' అని పిలవటం అలవాటు.

"ఏమిట్రా దామూ! ఇంకా నిద్రపోలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"లేదు నాన్నగారూ!"

"ఎందుకని?" లేచి కూర్చున్నాడు.

"మీతో కొంచెం మాట్లాడాలి."

"నాతోనా?"

"అవును"

"ఏమిటది?"

"నేను ఇప్పటిదాకా ఏ ఉద్యోగంలో చేరలేకపోయాను. మీకు ఏ విధంగానూ సాయం చెయ్యలేక పోతున్నాను!"

మాస్టారికి జాలివేసింది. మనిషిలో పరివర్తనకి, పశ్చాత్తాపం మొదటి మెట్టు. మహా పాపాత్ముణ్ణి సైతం పరమాత్మ పశ్చాత్తాపాగ్నిలో కాలిపోతుంటే కాపాడి కరుణిస్తాడు. "దాని దేముందిలే! నీ చేతుల్లో పని కాదు కదా! దేనికైనా సమయం రావాలి." ఓదార్పుగా అన్నాడు.

"ఆ సమయం ఇప్పుడు వచ్చింది నాన్నగారూ.."

మాస్టారికి కొద్ది క్షణాలు ఏమీ అర్థం కాలేదు. "నీకు ఏమైనా ఉద్యోగం వచ్చిందా?"

"అలాంటిదే!"

"అలాంటిదే' అంటే..."

"నన్ను కనకయ్యగారు తన దగ్గర పని చెయ్యమన్నారు. మెల్లగా అన్నీ నేర్పి తనంత వాడిని చేస్తానన్నారు."

మాస్టారికి విషయం అర్థమైపోయింది. తనను తన దారికి తెచ్చుకోవడానికి విఫల యత్నాలు చేసి, చివరకు అమాయకుడైన దత్తపుత్రుడికి వల వేశాడన్నమాట. "నువ్వా కనకయ్య దగ్గరకి వెళ్ళొద్దని చెప్పాను కదా?"

"ఏం చెయ్యను? ఇంట్లో ఊరకే కూర్చుంటే ఏమీ తోచట్లా.. అలా బజారుకి వెళితే వెంటనే కనకయ్య గారి మనుషులు బలవంతాన లాక్కువెళ్ళారు. కనకయ్య గారు బోలెడు మర్యాదలు చేసి.. ఇదుగో ఈ వెయ్యి రూపాయలూ జేబులో పెట్టాడు" నోట్లకట్ట తీసి చేతిలో పెట్టాడు.

మాస్టారి కంటికి అది పడగ విప్పిన పాములా కనిపించింది. అందులో వికటాట్టహాసం చేస్తూ విషం కక్కుతున్న కనకయ్య మొహం కనపడింది. చటుక్కున వదిలేశాడు. మంచం మీద పడింది.

"బాబూ! ఇది పాము కన్నా ప్రమాదమైంది. దీని మాయలో పడకు. ఇటుపైన నువ్వెప్పుడూ ఒంటరిగా బయటకు వెళ్ళకు. నా వెంబడే తిరుగు.. నువ్వు ఏమీ చెయ్యకపోయినా ఫరవాలేదు. క్షేమంగా వుంటే అదే చాలు!"

"అలాగే నాన్నగారూ! మీరు చెప్పినట్టే చేస్తాను." అమాయకంగా అన్నాడు.

"గుమ్మంలో వీరయ్య పడుకుని వుంటాడు. నేను రమ్మన్నానని చెప్పు.."

"అలాగే నాన్నగారూ!" పిలవటానికి వెళ్ళాడు.

వీరయ్య అంటే అపర వీర హనుమాన్! ఎంత మందికైనా కర్రసాములో గానీ, కోట్లాటలో గానీ, సమాధానం చెప్పగల దిట్ట. తనకే ఆపదా కలగకుండా కాపలాగా తన వెంటనంటి ఉంటాడు. రాత్రిళ్ళు గుమ్మం దగ్గరే పడుకుంటాడు. "ఏంటి అయ్యగారూ!.."

"వీరయ్యా! ఈ వెయ్యి రూపాయలూ నీ దగ్గరుంచు.. కనకయ్య బలవంతంగా మా అబ్బాయి జేబులో పెట్టాడట. రేపు ఏదో రకంగా దీన్ని అతనికి అందజెయ్యి"

"అలాగే బాబూ!" అంటూ అందుకుని బొడ్డున పెట్టుకున్నాడు.

"కనకయ్యగారికి కోపం వస్తుందేమో" భయంగా అన్నాడు దామూ.

"ఇక దాని విషయం నువ్వు మర్చిపో.. వెళ్ళి హాయిగా పడుకో"

"అలాగే.." అంటూ తన మంచంకేసి వెళ్ళాడు.

వీరయ్య కూడా గుమ్మం వైపు వెళ్ళాడు.

మాస్టారు బరువుగా నిట్టూర్చి నడుం వాల్చాడు.

★★★

"ఒరేయ్.. లేడికి బదులు దున్నపోతు వస్తోంది. విషయమేంటో చూడండిరా.." కనకయ్య పులిలా పెంచుకున్న కుక్కని దువ్వుతూ భృత్యులకి ఆదేశం ఇచ్చాడు. యమదూతల్లాంటి ఇద్దరు ఎదురు వెళ్ళారు. శరీరంలో ఒక భాగంలా వున్న బాణా కర్రతో వీరయ్య నేల అదిరేలా అడుగులు వేస్తూ వస్తున్నాడు.

"ఏంటి విషయం?" అడ్డంగా నిలబడి అడిగారు దూతలు.

వీరయ్య ఆగి ఒకసారి కనకయ్యకేసి చూశాడు. ఓరగా, క్రూరంగా తనకేసే చూస్తున్నాడు. బొడ్లోంచి డబ్బు తీసి ఒకడి చేతిలో పెట్టి 'పిల్లకాయల్తో పరాసికాలు ఆడొద్దని సెప్పు మీ అయ్యగారికి.." అని విసురుగా వెనుదిరిగాడు.

సైగలతో 'ఏమిటని' అడిగాడు కనకయ్య.

డబ్బు కనిపించేలా వేళ్ళతో పైకెత్తి పట్టుకు చూపించాడు. విషయం అర్థమై, అవమానకరంగా అనిపించి, వీరయ్యని ఓ పట్టు పట్టమని సైగ చేశాడు.

"రేయ్ ఆగరా!" అని వెంటపడ్డారు.

వీరయ్య వెనుదిరిగాడు. పరిస్థితి గ్రహించాడు. బాణాకర్ర సిద్ధంగా పట్టుకున్నాడు. మూడు నిమిషాల్లో ఇద్దర్నీ మట్టి కరిపించాడు. కనకయ్య ఆగ్రహంగా లేచి నిలబడ్డాడు. కాలభైరవుడి లాంటి కుక్కని ఉసిగొల్పాడు. దగ్గరదాకా రానిచ్చి ఒకే ఒక దెబ్బ. గింగిరాలు తిరుగుతూ పడిపోయింది పాపం అల్పప్రాణి. కనకయ్య కోపం కట్టలు తెంచుకుంది. జేబులోంచి పిస్టలు తీశాడు.

★★★

రచ్చబండ. అందరూ మౌన గంభీరంగా వున్నారు. మాస్టారు నోరు విప్పాడు.

"మనందరం ఓట్లు వేస్తున్నాం. అది మన ప్రాథమిక హక్కు. దాన్ని త్యాగం చెయ్యటం కానీ, అమ్ముకోవటం గానీ రెండూ అపరాధమే, అపచారమే! మనకి మనమే ద్రోహం చేసుకున్నట్టు! అయితే ఎవరికి ఓటు వెయ్యాలి! ఎట్టి పరిస్థితుల్లోను మాయ మాటలతో పదే పదే మోసగిస్తున్న మారీచుడు లాంటి కనకయ్యకి కాదు!"

"ఇంకెవరికి?"

"ఎవరి ఒత్తిడీ లేని, దయా దాక్షిణ్యాలవసరం లేని స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేద్దాం. ఆ వ్యక్తి మన ఊరివాడే కావాలి!"

అందరూ చప్పట్లు కొట్టారు.

"ఆ వ్యక్తి మీరే అయితే బావుంటుంది మాస్టారూ." నవ్వాడు.

"కాదు.. రావణాసురుల్లా తయారవుతున్న రౌడీ నాయకుల్ని తట్టుకోవాలంటే, వీరయ్యలాంటి వీరుడు మన ప్రతినిధిగా నిలబడాలి. రాజ్యం వీరభోజ్యం అన్న ఆది సూక్తి కిప్పుడు మళ్ళీ కాలం వచ్చింది."

అందరూ చప్పట్లు కొట్టారు. మాస్టారుకి జేజేలు పలికారు. అంతలో అక్కడికి కనకయ్య కారు వచ్చింది. అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగా కనకయ్య చేతులు.. కండువాతో బిగించబడి వీరయ్య చేత ముందుకు తోయబడుతూ మాస్టారి కాళ్ళమీద పడ్డాడు. వెనకాల చేతులు పట్టుకుని డ్రైవరు నిస్సహాయంగా నిలబడ్డాడు. వీరయ్య జరిగిందంతా వివరించాడు. కిందపడిన కుక్క శరీరం అడ్డం పెట్టుకుని, కనకయ్య పిస్టలు గుళ్ళ నుంచి ఎలా తనని తాను రక్షించుకుంటూ కనకయ్యని బంధించి తెచ్చిందీ అందరికీ చెప్పాడు. దాంతో ఆగ్రహం పెల్లుబికిన జనం కనకయ్య మీదకి విరుచుకు పడుతుంటే చేతులెత్తి ఆపేశాడు మాస్టారు.

"ఇప్పుడితను మాయ విడిచిన మారీచుడు. మనకి ఎవరి ప్రాణాలు తీసే హక్కు లేదు. వదిలెయ్యండి. మనిషయితే మారతాడు.. వదిలెయ్యండి.."

కనకయ్య మాస్టారి పాదాలు గట్టిగా పట్టుకుని భోరున ఏడిచాడు.



(జాగృతి మాసపత్రిక నుంచి పునర్ముద్రణ)

కథామంజరి పాఠకమహాశయులకు మనవి!

ప్రతినెలా కథామంజరి సంచిక నమోదు చేసుకున్న పాఠకుల ఇమెయిల్స్‌కి నేరుగా చేరడమే కాకుండా, ఇతర సాంఘికమాధ్యమాలు, కథామంజరి వెబ్‌సైట్ ద్వారా కూడా ఎంతో మందికి సంచిక చేరుతోంది.

అలాగే పాఠకులు కూడా వారివారి బంధుమిత్రులకు ఈ మాధ్యమాల ద్వారా పంపుతున్నారు. ఈ రోజు కథామంజరి దేశ, విదేశాల్లో ఎక్కువ మందికి ఏదో విధంగా చేరుతోంది. పాఠకుల సంఖ్య పెరగడం సంతోషమే! అయితే, సాంకేతికంగా పత్రిక నిర్వహణకు, కొన్ని వెసులుబాట్లకు.. సంచికను చదివే పాఠకుల సంఖ్య తెలుసుకోవడం అసాధ్యమైన పనే! అంచేత మా మనవి ఏమిటంటే.. కథామంజరి చదివే పాఠకులు ప్రతి ఒక్కరు ఇమెయిల్ నమోదు చేసుకోవలసినదిగా కోరుతున్నాం. మీరు ఇమెయిల్ నమోదు చేసుకోడానికి ఈ లింక్‌ని క్లిక్ చేయండి.

వార్షిక చందా రూ.200/- ఉచిత సంచిక కోసం

https://imjo.in/ebrJuh *https://zcmp.in/K93t*

పత్రికకు చందా ఇచ్చికమే ఐనప్పటికీ చందా కట్టినా, కట్టలేకపోయినా సరే, పత్రిక అందరికి అందుబాటులోనే ఉంటుంది.

- కథామంజరి బృందం -